


www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 26 గురువారం | జూన్, 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 281

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## న్యూయార్క్ మేయర్ అభ్యర్థిగా భారత సంతతి వ్యక్తి



2 తల్లి ప్రముఖ చిత్ర దర్శకురాలు మీరా నాయర్

## అంతరిక్ష యాత్రకు ఎంపికైన పాలకొల్లు యువతి



2 జాహ్నవిని అభినందించిన ఏపీ ఐటీ మంత్రి లోకేశ్

## బోనాల పండుగ శుభాకాంక్షలు

ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులుండాలి: సీఎం రేవంత్‌రెడ్డి



3

## తెలంగాణ లాసెట్ ఫలితాల విడుదల..!



2 లాసెట్, పీజీ ఎల్‌సెట్ 2025 ఫలితాల వెల్లడి

## వైసీపీలో చేరిన సుగవాసి



2 టీడీపీ నేతను కండువా కప్పి ఆహ్వానించిన జగన్

## వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని భర్త హతం



2 అనంతపురం జిల్లా కేంద్రంలో ఓ మహిళ దారుణం

# ప్రపంచ దేశాల మద్దతు కోసం ఇరాన్ వెంపర్లాట

- ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఆగని పోరు
- అమెరికా జోక్యంతో వేడెక్కిన పశ్చిమాసియా
- ఇజ్రాయిల్‌కు కొన్ని దేశాలు మద్దతు
- ఇరాన్‌కు మద్దతు తెలిపిన రష్యా
- ఇరాన్‌కు అణ్వాయుధాల ఇవ్వడానికి పలు దేశాలు సిద్ధం..పుతిన్ సన్నిహితుడు కీలక వ్యాఖ్యలు

2



**టెహ్రాన్-నవభూమిబ్యూరో**

ఇరాన్‌లోని కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులతో పశ్చిమాసియా మరింత వేడెక్కింది. నేరుగా యుద్ధంలోకి అమెరికా దిగడంతో ఇరాన్-ఇజ్రాయేల్ యుద్ధం మలుపు తిరిగింది. ఈ క్రమంలో అమెరికా దాడుల అనంతరం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరక్చీ అత్యవసరంగా రష్యాకు పయనమయ్యారు. సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఆయన సమావేశం కానున్నారు. ఇస్తాంబుల్‌లో జరుగుతున్న ఇస్లామిక్ సహకార సంస్థ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. 'రష్యా ఇరాన్‌కు మిత్రదేశం. మేము తరచూ కీలక అంశాలపై పరస్పరం సంప్రదింపులు జరుపుతుంటాం... ఈ రోజు సాయంత్రం మాస్కో వెళ్లి, రేపు ఉదయం అధ్యక్షుడు పుతిన్‌తో మౌలిక చర్చల్లో పాల్గొంటాను' అని అరక్చీ చెప్పారు.

ఆదివారం తెల్లవారుజామున అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ కీలక అణు కేంద్రాలపై అమెరికా సైన్యం దాడులు జరిపింది. పది రోజుల కిందట ఇజ్రాయేల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై యుద్ధం మొదలుపెట్టింది. ఈ దాడుల పరంపరను కొనసాగిస్తూ అమెరికా కూడా రంగంలోకి దిగింది. అమెరికా వర్గాల ప్రకారం, ఈ దాడుల ఉద్దేశం ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధిని అడ్డుకోవడమే. అయితే ఇరాన్ విదేశాంగ మంత్రి మాత్రం వీటిని అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ఉన్న ఘోరమైన దాడులుగా అభివర్ణించారు. 'అణు స్థావరాలపై దాడి చేసి, రెడ్ లైన్ దాటారు. ఇరాన్ ఇప్పుడు ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటుంది' అని హెచ్చరించారు.

**ట్రంప్ యుద్ధ ప్రియుడు**

పుతిన్ ప్రధాన అనుచరుడు, రష్యా భద్రతా మండలి ఉపాధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'శాంతి ప్రతినిధిగా అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఇప్పుడు అమెరికాను మరో యుద్ధంలో నెగ్గించాడు' అంటూ టెలిగ్రామ్ వేదికగా ఆయన వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా దాడులు ఇరాన్ అణు మౌలిక సదుపాయాలను పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని అన్నారు. 'అణు ఇంధన శ్రేణి పూర్తిగా పనిచేస్తూనే ఉంది. ఇదే గమనిస్తే అణ్వాయుధాల

# పాక్ మేజర్ హతం

- కమాండర్ అభినందన్‌ను బంధించిన పాకిస్థాన్ మేజర్ హతం
- దక్షిణ వజీరిస్తాన్‌లో ఉగ్రవాద సంస్థ టీటీపీ జరిపిన దాడిలో
- పాకిస్థాన్ ఆర్మీ అధికారి మేజర్ మోయిజ్ అబ్బాస్ షా మృతి
- 2019లో బాలకోట్ ఎయిర్‌స్ట్రైక్ తర్వాత భారత కమాండర్‌ను బంధించి చిత్రహింసలు పెట్టిన పాక్ ఆర్మీ అధికారి అబ్బాస్ షా

2



**దక్షిణ వజీరిస్తాన్-నవభూమిబ్యూరో**

భారత పొరుగు దేశమైన పాకిస్థాన్ నుంచి మరో వార్త వచ్చేసింది. దక్షిణ వజీరిస్తాన్‌లో ఉగ్రవాద సంస్థ టీటీపీ జరిపిన దాడిలో, పాకిస్థాన్ ఆర్మీకి చెందిన కీలక అధికారి మేజర్ మోయిజ్ అబ్బాస్ షా మృతి చెందారు. 2019లో బాలకోట్ ఎయిర్‌స్ట్రైక్ తర్వాత భారత వాయుసేన అధికారి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను బంధించిన అధికారి మోయిజ్ కావడం విశేషం.

పాకిస్థాన్ నుంచి కీలక వార్త వెలుగులోకి వచ్చింది. దక్షిణ వజీరిస్తాన్‌లోని సర్గోధాలో (తెహ్రిక్-ఇ తాలిబన్ పాకిస్థాన్) జరిపిన దాడిలో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా అనే అధికారి మరణించారు. 2019లో బాలకోట్ దాడిలో భారత వైమానిక దళ అధికారి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను బంధించిన అధికారి మేజర్ మోయిజ్ అబ్బాస్ షా. పాకిస్థాన్ సైన్యం ప్రకారం, దాడిలో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా, లాన్స్ నాయక్ కూడా మరణించారు. ఖైబర్ పఖ్తున్వాలోని దక్షిణ వజీరిస్తాన్ జిల్లాలో నిఘా ఆధారిత ఆపరేషన్‌లో ఈ ఇద్దరు సైనికులు మరణించారని పాకిస్థాన్ మీడియా విభాగం తెలిపింది.

దక్షిణ వజీరిస్తాన్‌లో నిఘా ఆధారిత ఆపరేషన్‌లో ఈ దాడి జరిగింది. ఈ ఆపరేషన్‌లో ఉగ్రవాదులు, పాకిస్థాన్ సైన్యానికి మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా, లాన్స్ నాయక్ జిబ్రాన్ మరణించారు. పాకిస్థాన్ సైన్యం కొంతమంది ఉగ్రవాదులను కూడా చంపినట్లు

# 'యోగాంధ్ర' దేశానికే ఆదర్శం

- ప్రధాని మోదీ ప్రశంసల జల్లు.. దేశానికే ఆదర్శమన్న ప్రధాని
- కేంద్ర కేబినెట్ సమావేశంలో "యోగాంధ్ర" పై ప్రధాని మోదీ ప్రశంసలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల కృషిని కొనియాడిన ప్రధాని
- ఇంత భారీ యోగా కార్యక్రమాన్ని ఎప్పుడూ చూడలేదని మోదీ వ్యాఖ్య
- యోగాంధ్ర నివేదికను ఇతర రాష్ట్రాలకు పంపుతామన్న కేంద్రం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన "యోగాంధ్ర" కార్యక్రమంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ కార్యక్రమం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ల దార్శనికతను, అమలు తీరును కొనియాడారు. తాను చూసిన కార్యక్రమాల్లో ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, ప్రభావవంతమైనదని ఆయన పేర్కొన్నారు.

"యోగాంధ్ర" వంటి భారీ కార్యక్రమాన్ని తాను

# 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం
- ఎన్నికల సంఘానికి ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల సహకారం అందించాలని సర్కార్‌కు సూచన
- స్థానిక సంస్థల ఎన్నికలు జాప్యమవుతున్నాయని పలువురు
- రిట్ పిటిషన్లు..విచారించిన హైకోర్టు తుది తీర్పు వెల్లడి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

రాష్ట్రంలో మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అదేవిధంగా ఎన్నికల సంఘానికి ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు జస్టిస్ టీ మాధవీ దేవి తీర్పును వెలువరించారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఇప్పటికైనా నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పలువురు రిట్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లపై గత సోమవారం విచారణ జరిపిన హైకోర్టు తీర్పును బుధవారానికి రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరిస్తూ మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. సోమవారం విచారణ సందర్భంగా హైకోర్టు.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఉదాసీన వైఖరిపై సీరియస్‌గా స్పందించింది. పంచాయతీల గడువు 2024 జనవరి 31 నాటికే ముగిసినా ఇప్పటివరకు ఎందుకు ఎన్నికలు నిర్వహించడంలేదని ప్రశ్నించింది. కాగా, పంచాయతీ ఎన్నికల నిర్వహణలో జాప్యం రాజ్యాంగంలోని ఆర్టికల్ 243E, ఆర్టికల్ 243Kలకు విరుద్ధమని పిటిషనర్‌లు తమ పిటిషన్‌లలో పేర్కొన్నారు.

అయితే రాష్ట్రంలో కులగణన సర్వే జరుగుతున్నందున ఎన్నికల నిర్వహణకు తమకు మరికొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరింది. అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు తమకు అదనంగా మరో 60 రోజుల సమయం ఇవ్వాలని కోర్టుకు విన్నవించింది. అయితే పంచాయతీ ఎన్నికల గడువు ముగిసిన ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా నిర్వహించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని జస్టిస్ మాధవీ దేవి నిలదేశారు.

# ఏఐతో అద్భుతాలు

- అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివర్ణించిన చంద్రబాబు
- త్వరలో అమరావతి ప్రపంచంలోనే గుర్తింపు పొందే స్థాయికి చేరుతుంది
- హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ అయితే.. అమరావతి గ్రీన్ ఫీల్డ్ విజన్
- హైటెక్ సిటీలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజాలను తీసుకురాగలిగా..
- 3 దశాబ్దాలుగా టెక్నాలజీని ప్రోత్సహించేందుకు పని చేస్తున్నాన్న సీఎం

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక పురోగతికి ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలో జరిగిన ఫిక్కీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఈ వ్యాఖ్యలకి వేదికైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎంకు ఫిక్కీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల

# సినీతారల ఫోన్లు ట్యాపింగ్!?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సంచలనం..
- యాంకర్,సినీతార ఫోన్ సైతం ట్యాప్..?
- ప్రముఖ సినీతారల ఫోన్లన్నీ ట్యాపింగ్? 2
- ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ ఫోన్ సైతం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సినీ ప్రముఖుల పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే విచారణ కొనసాగుతుండగా.. బాధితుల జాబితాలో పలువురు ప్రముఖ నటులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జబర్దస్త్ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ఫోన్ కూడా ట్యాప్ అయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. గతంలో పవిత్ర లోకేశ్ సహా పలువురు హీరోయిన్ల ఫోన్‌లు ట్యాప్ అయ్యాయని వార్తలు రాగా.. ఈ జాబితా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిఘా విభాగం (ఇంటెలిజెన్స్) అధికారులు ప్రతిపక్ష నాయకులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధులు, సినీ సెలబ్రెటీల ఫోన్లు ట్యాప్ చేశారనే

## సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డు పరీక్షలు ఇక ఏడాదికి 2 సార్లు

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నుంచి సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మొదటి విడత పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయి. ఈ పరీక్షలకు విద్యార్థులంతా తప్పనిసరిగా హాజకావాల్సి ఉంటుంది. ఇక రెండో విడత పరీక్షలు మేలో ఉంటాయి. ఇది ఐచ్ఛికం. తమ పెర్‌ఫారమెన్స్ పెంచుకోవాలని ఆశించే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం అకడమిక్ సెషన్‌లో ఒకేసారి ఉంటుంది.

సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోల్ సంయమ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. పరీక్షల ఫస్ట్ ఫేజ్ ఫిబ్రవరిలోనూ, రెండో ఫేజ్ మేలోను ఉంటాయన్నారు. ఏప్రిల్, జూన్‌లో ఫలితాలు వెలువడతాయని తెలిపారు. ఫస్ట్ ఫేజ్‌కు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, రెండో ఫేజ్ వారివారి ఇష్టమని చెప్పుకొచ్చారు. విద్యార్థులు సైన్స్, మేథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజ్‌లలో మూడు సబ్జెక్టులను ఎంచుకుని బెటర్‌మెంట్ కోసం రాసుకోవచ్చని వెల్లడించారు.

చలి ఎక్కువగా ఉండే (వింటర్ బౌండ్) స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు ఏదో ఒక ఫేజ్‌లో పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నారు. సీబీఎస్ఈ గత ఫిబ్రవరిలో ఈ పరీక్షలకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది.

# కేసులపై న్యాయపోరాటం

- తనపైన కేసుల నమోదు వేళ జగన్ సంచలన నిర్ణయం..!!
- కూటమి సర్కార్‌పై రాజకీయ పోరాటం
- తనపై కేసులపై న్యాయ పోరాటానికి సిద్ధం
- తనపై కేసులు కొట్టి వేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్

2

**తాడేపల్లి-నవభూమిబ్యూరో**

మాజీ ముఖ్యమంత్రి జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నేతల పైన నమోదవుతున్న కేసులపై జగన్ అధికార పార్టీని టార్గెట్ చేస్తున్నారు. తాజాగా జగన్ పల్నాడు పర్యటన వివాదాస్పదంగా మారింది. జగన్ కారు కింద పడి సింగయ్య మరణించినట్లు తేల్చారు. ఈ కేసులో ఏ-2గా జగన్ పేరు చేర్చారు. జగన్ బుల్లెట్ ప్రూఫ్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమైన జగన్.. తన పైన నమోదైన కేసుల విషయంలో మరో నిర్ణయం తీసుకున్నారు. జగన్ పై కేసుతో మాజీ సీఎం జగన్ పల్నాడు పర్యటన వేళ అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. జగన్ పల్నాడు పర్యటన సమయంలో పోలీసులు కొన్ని ఆంక్షలు విధించారు. గతంలో చోటు చేసుకున్న ఘటనల కారణంగా.. జగన్ తనకాన్వాయ్‌తో

## నవ వార్త



## 24గంటల్లో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణకు ఐదురోజులు వర్ష సూచన..!

**హైదరాబాద్-నవభూమి:** వాయువ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వొంగి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ దీని ప్రభావం రాగల 24గంటల్లో ఆ ప్రాంతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశాలు న్నాయని పేర్కొంది. ఇక తెలంగాణలో రాగల ఐదురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆదిలాబాద్, పెద్దపల్లి, ఖమ్మం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడుతాయని చెప్పింది. శుక్రవారం ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 నుంచి కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని పేర్కొంది.శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురు గాలులతో వానలు పడే అవకాశం ఉందని చెప్పింది.

## రేషన్ కార్డు లబ్ధిదారులకు 'కొత్త' కష్టం.. సెప్టెంబర్ వరకు రేషన్ రాదు..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ ఒకేసారి ఇస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ సరుకులు ఈనెల 1 నుంచి పంపిణీ చేస్తుండగా.. 30 వరకు లబ్దిదారులకు రేషన్ అందించనున్నారు. అయితే కొత్తగా ఆహార భద్రత కార్డులు పొందిన వారికి మాత్రం తీవ్ర నిరాశ ఎదురైంది. కొత్త కార్డులు మంజూరయ్యాయన్న సంతోషంతో కార్డుదారులు రేషన్ డీలర్ల వద్దకు వెళ్లగా.. వారందరికీ జూన్ నెల రేషన్ కోటా రాలేదని డీలర్లు తేల్చి చెప్పారు. అంతేకాదు, జూలై, ఆగస్టు నెలల కోటా కూడా రాదని స్పష్టం చేయడంతో చేసేదేమీ లేక వేలాది మంది కార్డుదారులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించి, దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే, 2021 నాటికి కొందరికి మాత్రమే ఆహార భద్రత కార్డులు పంపిణీ చేసింది. అప్పటికే ఉన్న కార్డులలో చనిపోయిన వారి పేర్లను తొలగించినప్పటికీ, కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సైతం చాలా మంది అర్హులు అందుకోలేని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ప్రజాపాలన, మీసేవా కేంద్రాల ద్వారా రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించింది. చాలా మంది లబ్ధిదారులు కొత్తగా రేషన్ కార్డులు పొందారు.
అయితే కొత్త కార్డులు మంజూరైన వారికి మాత్రం రేషన్ అందలేదు. జూన్ నెలలోనే మూడు నెలలకు సరిపడా అంటే ఆగస్టు వరకు రేషన్ బియ్యం ఇచ్చేయడంతో ఇప్పుడు కొత్త కార్డుదారులు రేషన్ బియ్యం అందుకోవాలంటే సెప్టెంబర్ వరకు ఆగాల్సిందేనని రెవెన్యూ అధికారులు, డీలర్లు పేర్కొంటున్నారు. దీంతో కొత్త రేషన్ కార్డులపై ఆశలు పెట్టుకున్న వేలాది కుటుంబాలకు తీవ్ర నిరాశను మిగిలింది. ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించి అర్హులైన లబ్ధిదారులకు వెంటనే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్కారు బడులు ఫుల్లు.. ఏకంగా 2.50 లక్షలు దాటిన ప్రవేశాలు.. నో అడ్మిషన్ బోర్డులు

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది భారీగా విద్యార్థులు తరలివస్తున్నారు. దాదాపు రెండున్నర లక్షల కొత్త అడ్మిషన్లు నమోదయ్యాయి, ఇందులో 50 వేల మంది ప్రైవేటు పాఠశాలల నుండి వచ్చినవారే. ప్రభుత్వం చేపట్టిన 'బడిబాట' కార్యక్రమం, మెరుగైన పదో తరగతి ఫలితాలు ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు కూడా ఈ పెరుగుదలకు దోహదపడ్డారు. జూలై, ఆగస్టు నెలల్లో మరిన్ని అడ్మిషన్లు వస్తాయని భావిస్తున్నారు.అయితే గత కొన్నాళ్లుగా ఈ ఆలోచనలో మార్పు వస్తుంది. పదో తరగతిలో విద్యార్థులు సాధిస్తున్న మార్కులతో పాటుగా.. ప్రభుత్వ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి కారణంగా సర్కార్ బడుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. ఈ ఏడాది ఏకంగా గవర్నమెంట్ స్కూల్స్‌లో అడ్మిషన్లు 2.50 లక్షలు దాటాయి. చాలావరకు ప్రభుత్వ స్కూల్స్‌లో నో అడ్మిషన్ బోర్డులు దర్శనం ఇస్తుండటం విశేషం. ఆ వివరాలు..తెలంగాణలోని సర్కారు బడుల్లో ఈ ఏడాది కొత్త అడ్మిషన్లు ఊపందుకున్నాయి. ప్రభుత్వ స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతుండటంతో.. పెద్ద ఎత్తున కొత్త అడ్మిషన్స్ నమోదయ్యాయి. ఈ విద్యాసంవత్సరం ఇప్పటివరకూ గవర్నమెంట్ స్కూల్స్‌లో సుమారు రెండున్నర లక్షల మంది కొత్తగా చేరారని అధికారులు తెలిపారు. పైగా ఇలా చేరిన వారిలో సుమారు 50వేల మంది వరకు విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం విశేషం.ప్రభుత్వ బడుల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే కాక.. సర్కారు బడుల్లో అడ్మిషన్లను పెంచడం కోసం ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగా విద్యాశాఖ అధికారులు జూన్ 6-19 వరకు వరకూ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్కారు బడుల్లో తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా టీచర్లు ప్రచారం నిర్వహించారు.దీంతో ఈ ఏడాది సర్కార్ బడుల్లో రికార్డు స్థాయిలో అడ్మిషన్స్ నమోదయ్యాయి. జూన్ 12 న స్కూల్స్ మొదలయ్యాయి. ఈ క్రమంలో నిన్న అనగా జూన్ 24, మంగళవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా సర్కార్ బడుల్లో 2,56,156 కొత్త అడ్మిషన్లు వచ్చాయి. దీంట్లో ఒకటో తరగతిలో 1,07,126 మంది చేరగా, 2-10వ తరగతి వరకూ 1,49,030 మంది అడ్మిషన్లు పొందారు. గతేడాదితో పోలిస్తే.. 2024, జూన్ 24 వరకూ 2,00,901 అడ్మిషన్లు నమోదు కాగా.. ఈసారి అవి 2.56 లక్షలకు పెరగడం విశేషం.అంటే ఈ ఏడాది 55 వేలకు పైగా కొత్త అడ్మిషన్లు పెరిగాయి. అయితే ఇంత భారీ ఎత్తున అడ్మిషన్స్ రావడానికి ఈ సంవత్సరం కొత్తగా విధుల్లో చేరిన పదివేల మంది టీచర్ల పాత్ర కీలకంగా ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకూ 48,133 మంది ప్రైవేటు స్కూళ్ల నుంచి గవర్నమెంట్ బడుల్లో చేరారు. వీటిల్లో 10 శాతం అడ్మిషన్లు అంటే.. 5 వేలకు పైగా హైదరాబాద్ జిల్లాలో ఉన్నాయి.ఇక ఈ ఏడాది హైదరాబాద్ జిల్లాలో 19,555 అడ్మిషన్లు నమోదు కాగా.. అత్యల్పంగా హనుమకొండ జిల్లాలో 1,386 వచ్చాయి. అయితే జులై, ఆగస్టు నెలల్లో కూడా అడ్మిషన్లు నమోదవుతాయని అధికారులు చెప్తున్నారు. సర్కారు తీసుకున్న పలు నిర్ణయాలే వల్లే తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు.

## కేసులపై న్యాయపోరాటం

**(1వపేజీ తరువాయి)**పాటుగా వంద మందితో మాత్రమే పర్యటన పూర్తి చేయాలని నిర్దేశించారు. అయితే, జగన్ తన నివాసం నుంచి పల్నాడు వరకు దాదాపు ఎనిమిది గంటల పాటు భారీగా తరలి వచ్చిన అభిమానుల మధ్య అభివాదం చేస్తూ పర్యటన కొనసాగిం చారు. కాగా, ఈ పర్యటనలో సింగయ్య అనే కార్యకర్త మరణించారు. సింగయ్య మరణం పైన విచారణ చేసిన పోలీసులు ఆయన జగన్ ప్రయాణిస్తున్న కారు కింద పడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసారు. హైకోర్టుకు జగన్ ఈ కేసులో భాగంగా జగన్ ప్రయాణించిన బుల్లెట్ ప్రూఫ్ కారును పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. జగన్ తో పాటుగా పార్టీ నేతలకు నోటీసులు జారీ చేసారు. ఇదే సమయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ప్రభుత్వం వచ్చే నెల నుంచి ప్రతీ ఇంటికి తమ ఎమ్మెల్యేలను పంపాలని.. తాము సాధించిన విజయాలను వివరించాలని నిర్ణయించింది. దీనికి కౌంటర్ గా రీకాల్ చంద్రబాబు అనే నినాదంతో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ.. ప్రతీ ఇంటికి వెళ్లి ఎన్నికల హామీల విస్మరణ గురించి పార్టీ నేతలు వివరించేలా జగన్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇదే సమయంలో తన పైన కేసుల పైన హైకోర్టుకు వెళ్లారు. తన పైన నమోదైన కేసును క్వాష్ చేయాలని జగన్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసారు. రేపు విచారణ :జగన్ తో పాటుగా ఈ కేసులో ఉన్న పార్టీ ముఖ్య నేతలు సైతం క్వాష్ పిటీషన్లు దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

## గచ్చిబౌలిలోని ఓయో రూమ్‌లో కలకలం



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో ఒక ఓయో రూమ్‌లో ఓ యువతి అనుమానాస్పద రీతిలో ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగండ్లలో నివాసం ఉంటున్న జి. అనూష (26) అనే యువతి బ్యూటీషియన్ గా పనిచేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా సంప్రదించిన క్లయింట్‌ల వద్దకు వెళ్లి సేవలు అందించడం ఆమె పని స్వభావం. ఈ యువతికి ఏడాది క్రితమే వివాహం జరిగింది. అయితే కొన్ని రోజులకే మనస్పర్థల కారణంగా ఆమె భర్త నుంచి విడిపోయి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు అనూష తన స్నేహితుల వద్దకు వెళు తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. మరుసటి రోజు.. అంటే జూన్ 23న, సాయంత్రం 4:30 గంటలకు గచ్చిబౌలిలోని క్యాబిన్ ఓయో లాడ్జ్‌లో అనూష ఆత్మహత్య చేసుకున్నట్లు రాయదుర్గం పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోగా, గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆమె కనిపించింది.అయితే.. అనూష మృతిపై కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు స్పష్టంగా తెలియలేదని పోలీసులు పేర్కొన్నారు. మొదట సంతోష్ అనే వ్యక్తి ఈ ఆత్మహత్య గురించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అనుమానాలున్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని మృతురాలి సోదరుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సాధారణంగా.. ఆత్మహత్య కేసుల్లో పోలీసులు మరణానికి దారితీసిన పరిస్థితులు, గత చరిత్ర, చివరి కాల్‌లు, సందేశాలు, వ్యక్తిగత సంబంధాలను లోతుగా పరిశీలిస్తారు.అనూష జీవితంలో ఎదురైన వివాహ సంబంధమైన సమస్యలు, ఆమె బ్యూటీషియన్‌గా ఒంటరిగా పనిచేయడం వంటి అంశాలు ఆమె మానసిక స్థితిపై ప్రభావం చూపించి ఉండవచ్చు. ఆధునిక జీవనశైలి, సంబంధ బాంధవ్యాలలో తలెత్తే ఒత్తిళ్లు, ఒంటరితనం వంటివి యువతలో మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సరైన మానసిక ఆరోగ్య సహాయం, కౌన్సిలింగ్ అనేది అత్యంత ముఖ్యం.ఓయో రూమ్స్ వంటి ప్రైవేట్ లాడ్జింగ్‌లలో భద్రతా ప్రమాణాలపై కూడా ఈ సంఘటన ప్రశ్నలను లేవనెత్తుతోంది. పోలీసులు, లాడ్జ్ నిర్వాహకులు భద్రతా ప్రోటోకాల్స్‌ను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కేసులో పోలీసులు అనూష చివరి గంటల కదలికలు, ఆమె ఎవరిని కలిసింది, సంతోష్ అనే వ్యక్తితో ఆమెకు ఉన్న సంబంధం వంటి వివరాలను లోతుగా విచారిస్తున్నారు.
కుటుంబ సభ్యులు న్యాయం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో.. పోలీసుల దర్యాప్తు ఈ విషాద ఘటన వెనుక ఉన్న నిజాలను బయటపెడుతుందని ఆశిస్తున్నారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా తీవ్ర కలకలం రేపింది.

## 'యోగాంధ్ర' దేశానికే ఆదర్శం

**(1వపేజీ తరువాయి)** ఇంతకు ముందెన్నడూ చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల యోగా కార్యక్రమం ఒక అసాధారణ విజయమని ఆయన కొనియా డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ల నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతమైందని, వారి కృషి అభినందనీయమని ప్రధాని పేర్కొన్నారు. "ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలను చూశాను, కానీ 'యోగాంధ్ర' స్థాయిలో, స్ఫూర్తితో జరిగిన కార్యక్రమాన్ని చూడలేదు. దీనిని రూపొందించి, అమలు చేసిన తీరు నా అంచనాలను మించిపోయింది," అని మోదీ తన కేబినెట్ సహచరులతో అన్నట్లు సమాచారం.
వయసు, లింగ, వర్గ భేదాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను వరుసగా 30 రోజుల పాటు యోగా కార్యకలాపాల్లో ఏకం చేయగలిగిన రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యాన్ని ప్రధాని అభినందించారు. "ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు, ఇదొక ఉద్యమం" అని మోదీ అభివర్ణించారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున తాను పాల్గొన్న అనుభవం, గత 11 ఏళ్లుగా తాను హాజరైన అన్ని యోగా కార్యక్రమాల కంటే విభిన్నంగా, ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆయన గుర్తుచేసుకున్నారు.
"యోగాంధ్ర" కార్యక్రమ ప్రణాళిక, ప్రజలను భాగస్వాములను చేసిన తీరు, అమలు చేసిన విధానాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరినట్లు ప్రధాని తెలిపారు. ఆ నివేదిక అందిన తర్వాత, దానిని అన్ని రాష్ట్రాలకు పంపిస్తామని, వారు కూడా దీనిని అధ్యయనం చేసి, ఉత్తమ పద్ధతులను అనుసరించవచ్చని సూచిస్తామని ఆయన వెల్లడించారు. ఒక మంచి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో చంద్రబాబు, లోకేశ్ లను చూసి మిగతా వారు నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. "యోగాంధ్ర" విజయాన్ని అందరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రులకు తెలియజేశారు.జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో 3,02,087 మంది ఒకేచోట యోగా చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

## వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని భర్త హతం

**అనంతపురం-నవభూమి:**అక్కంపల్లిలో గ్రామంలో నివసిస్తున్న సురేష్‌బాబు(43) మంగళవారం నాడు హత్యకు గురయ్యాడు. కేవలం ఆరు గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. ఈ ఘటనలో భార్యే అసలు సూత్రధారి అని గుర్తించారు. ఈ కేసులో సురేష్ భార్య అనిత (37), ఆమె ప్రియుడు ఫక్రుద్దీన్(34)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.
సురేష్‌బాబు స్థానిక కల్యాణదుర్గం రోడ్డులో ఓ చిన్న హోటల్ నడుపుతున్నాడు. అతడి భార్య అనిత కూడా మొదట్లో ఓ హోటల్‌లో పనిచేసేది. ఈమెకు రెండు నెలల కిందటే బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే అనిత, బాబా ఫక్రుద్దీన్‌ల మధ్య వివాహేతర సంబంధం మొదలైంది. సురేష్‌కు ఈ వ్యవహారంపై అనుమానం రావడంతో ఆమెను తరచూ తాగొచ్చి వేధింపులకు గురిచేసేవాడు. తనను అనుమానిస్తుండటం, అదే సాకుతో వేధిస్తుండటం వంటి విషయాలన్నీ అనిత తన ప్రియుడు ఫక్రుద్దీన్‌కు చెప్పింది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుతగులుతున్న భర్తను ఎలాగైనా చంపితే ఇద్దరం సంతోషంగా ఉండొచ్చని ప్రియుడిని ఉసిగొల్పింది.
ఈ మేరకు ప్రతిరోజు రాత్రి హోటల్ మూసేసి తన భర్త టూవీలర్‌పై ఇంటి కుస్తాడని.. ఆ సమయంలో చంపాలని సలహా ఇచ్చింది. అందుకు అంగీకరించిన బాబా ఫక్రుద్దీన్.. వ్యాపారం నిమిత్తం మార్తాడు గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో అతడికి ఫోన్ చేసిన అనిత.. ఎలాగైనా తన భర్తను ఈరోజు చంపాలని సూచించింది. దీంతో హోటల్ మూసేసి.. రాత్రి 11 గంటల సమయంలో బైక్‌పై వస్తున్న సురేష్‌బాబుపై.. బాబా ఫక్రుద్దీన్ దాడి చేశాడు. అందుబాటులో ఉన్న సీసాను సురేష్‌బాబుపై విసిరేయడంతో బైక్ పై నుంచి కిందకు పడిపోయాడు. వెంటనే అతడిపై ఫక్రుద్దీన్ దాడి చేసి తన వెంట తీసుకెళ్లిన స్క్రూడ్రైవర్‌తో పొడిచి ఆ తర్వాత బండరాయితో బాది హత్య చేసినట్టు విచారణలో తేల్చారు. ఆ తర్వాత అక్కడి నుంచి పరారైనట్టు వెల్లడించారు.

## న్యూయార్క్ మేయర్ అభ్యర్థిగా భారత సంతతి వ్యక్తి

**న్యూయార్క్-నవభూమిబ్యూరో**
అమెరికా రాజకీయాల్లో భారతీయ మూలాలు కలిగిన మరో నేత హాట్ టాపిక్‌గా మారారు. న్యూయార్క్ మేయర్ అభ్యర్థిగా భారత సంతతి వ్యక్తి జోహ్రాన్ మమదానీ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ఖరారు అయ్యారు. ఇటీవల జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ర్యాంక్డ్ ఛాయిస్ కౌంటింగ్ ద్వారా ఆయన విజయం సాధించారు. ముఖ్యంగా మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై ఆయన విజయం సాధించడం గమనార్హం. దీంతో ఈ వ్యవహారం అమెరికాలోనే కాకుండా భారత్‌లో కూడా చర్చనీయాంశంగా మారింది.
**కుటుంబ నేపథ్యం..**
33 ఏళ్ల జోహ్రాన్ మమదానీ ఉగాండాలో భారత మూలాలున్న కుటుంబంలో జన్మించారు. తండ్రి ప్రొఫెసర్ మహ్మూద్ మమ్దానీ, తల్లి ప్రముఖ చిత్ర దర్శకురాలు మీరా నాయర్. జోహ్రాన్ ఎన్నికల ప్రచారంలో చేసిన కొన్ని హామీలు బాగా ప్లస్ అయ్యాయి అని చెప్పొచ్చు. పిల్లల సంరక్షణ, ఉచిత బస్సు ప్రయాణం, సంపన్నులపై అధిక పన్నులు వంటి ప్రతిపాదనలు చాలా మందికి నచ్చాయి. బెర్నీ సాండర్స్, అలెగ్జాండ్రియా ఒకాసియో-కార్టెజ్ వంటి డెమోక్రాటిక్ సోషలిస్టుల మద్దతు ఆయనకు బలాన్ని ఇచ్చింది.
అంతే కాకుండా సాధారణ రాజకీయ ప్రచారాలకు భిన్నంగా జోహ్రాన్ తన ప్రచారాన్ని సోషల్ మీడియాలో వినూత్నంగా నిర్వహిస్తున్నారు. మద్దతుదారులతో డ్యాన్స్ చేస్తూ, బాలీవుడ్ పాటలు, డైలాగులతో వీడియోలు చేసి యువతను ఆకట్టుకుంటున్నారు. ఎన్నారై కమ్యూనిటీపై ప్రత్యేక దృష్టితో ఆయన ప్రచారం మరింత బలంగా నిలుస్తోంది. జోహ్రాన్ నవంబర్‌లో జరిగే ప్రధాన ఎన్నికల్లో గెలిస్తే, న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన తొలి ముస్లిం మరియు భారతీయ-అమెరికన్ వ్యక్తిగా చరిత్రలో నిలుస్తారు.
కాగా ఇప్పటి వరకు ప్రధానంగా నాలుగు పేర్లు న్యూయార్క్ మేయర్ రేసులో వినిపిస్తున్నాయి. వారిలో జోహ్రాన్ మమదానీ - డెమోక్రటిక్ సోషలిస్ట్ అభ్యర్థిగా ఉంటే.. కర్టిస్ స్లివా - రిపబ్లికన్ అభ్యర్థిగా ఉన్నారు. అలానే జిమ్ వాల్డెన్ - స్వతంత్ర అభ్యర్థి, ఎరిక్ ఆడమ్స్ - ప్రస్తుత మేయర్, స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో తలపడనున్నారు. అయితే మమదానీకి మిగిలిన అభ్యర్థుల కంటే ఎక్కువ ఆదరణ ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఏఐతో అద్భుతాలు

**(1వపేజీ తరువాయి)**అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ప్రతినిధులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గతంలో దావోస్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సదస్సులకు హాజరై రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు కృషిచేశానని గుర్తుచేశారు. అప్పట్లో వ్యాపారవేత్తలతో రాజకీయ నేతలు మాట్లాడటానికే వెనుకంజ వేసిన పరిస్థితుల్లోనూ తాను ముందడుగు వేసినట్టు తెలిపారు. "ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నా సరే, పెట్టుబడుల కోసం కృషి చేశా" అని స్పష్టం చేశారు.
అలానే తాను మూడు దశాబ్దాలుగా టెక్నాలజీని ప్రోత్సహించేందుకు పని చేస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైటెక్ సిటీలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజాలను తీసుకురాగలిగానని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలు ట్రెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. టెక్నాలజీ ఊహించని స్థాయిలో మారిపోతూ ఉందని.. ఆ మార్పుకు అనుగుణంగా మనం ముందుకు సాగాలని ఆయన సూచించారు.
**అమరావతి - గ్రీన్ ఫీల్డ్ విజన్..**
చంద్రబాబు అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివర్ణిస్తూ, త్వరలో అది ప్రపంచంలోనే గుర్తింపు పొందే స్థాయికి చేరుతుందని తెలిపారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ అయితే.. అమరావతి గ్రీన్ ఫీల్డ్ విజన్ అని స్పష్టం చేశారు. ఇది ఎంతో వైజ్ఞానికంగా, భవిష్యత్తు దృష్టితో నిర్మించబోతున్న ఒక అద్భుత నగరం అవుతుందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు.

## పాక్ మేజర్ హతం

**(1వపేజీ తరువాయి)** తెలిపింది.
అభినందన్ సంఘటన..జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో జైష్-ఎ-మొహమ్మద్ ఉగ్రవాదులు 2019 ఫిబ్రవరిలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై దాడి చేశారు. ఈ దాడిలో 40 మంది జవాన్లు అమరులయ్యారు. ఈ దాడులకు ప్రతీకారంగా ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం పాకిస్థాన్?లోని బాలకోట్‌లో జైష్ ఉగ్రవాద శిబిరంపై వైమానిక దాడులు చేసింది. ఈ దాడిలో 40 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టారు. అయితే ఆ మరుసటి రోజు యుద్ధ విమానం కూలిపోయిన ఘటనలో.. అభినందన్ వర్ధమాన్ పారాచూట్ సాయంతో పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో దిగాడు. ఆ తర్వాత అతన్ని పాకిస్థాన్ సైన్యం కస్టడీలోకి తీసుకుంది. ఈ సంఘటనలో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వచ్చాయి.

## వైసీపీలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం

**కడప-నవభూమి:** ఉమ్మడి కడప జిల్లా రాజకీయాల్లోకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం ఆ పార్టీలో చేరారు. కొద్దిసేపటి కిందటే ఆయన వైఎస్ జగన్ ను కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఆయనను సాదరంగా ఆహ్వానించారు జగన్.టీడీపీ కూటమి అధికారంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన పార్టీని వీడటం ప్రాధాన్యతను సంతరించుకుంది. అన్నమయ్య రాయచోటి జిల్లా టీడీపీ అధ్యక్ష పదవిని మరో నేతకు అప్పగించడం, తన వర్గీయులను నిర్లక్ష్యం చేస్తోండటం వంటి పరిణామాలు సుగవాసి మనస్తాపానికి కారణం అయ్యాయని అంటున్నారు.

## అంతరిక్ష యాత్రకు ఎంపికైన పాలకొల్లు యువతి

**అమరావతి-నవభూమి:**పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి అరుదైన ఘనత సాధించారు. అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక టైటాన్ స్పేస్ మిషన్‌కు ఆమె ఆస్ట్రోనాట్ క్యాండిడేట్‌గా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో జాహ్నవి బుధవారం సాయంత్రం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్ర హ్మణ్యం కూడా ఆమె వెంట ఉన్నారు.అంతరిక్షంలోకి అడుగుపెట్టబోతు న్న తొలి తెలుగు మహిళగా చరిత్ర సృష్టించనున్న జాహ్నవిని మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. తెలుగు బిడ్డగా రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. జాహ్నవి అంతరిక్ష యాత్రకు ఎంపికైన క్రమం, ఆమె పడ్డ శ్రమ గురించి మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆమె సాధించిన విజయం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని కొనియాడారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ జాహ్నవి భవిష్యత్ ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, రాష్ట్ర విద్యాశాఖ చేపట్టే "స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) అవుట్ రీచ్ యాక్టివిటీ"లో ప్రభుత్వం తరఫున భాగస్వామి కావాలని జాహ్నవిని కోరారు. దీని ద్వారా ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తినివ్వవచ్చని ఆయన సూచించారు. కాగా, దంగేటి జాహ్నవి 2029లో తన తొలి అంతరిక్ష యాత్రలో పాల్గొననున్నారు. ఈ యాత్ర ద్వారా అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారి కీర్తి పతాకాన్ని ఆమె ఎగురవేయనున్నారు.

## తెలంగాణ లాసెట్ ఫలితాలు విడుదల..!

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో న్యాయ విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్, పీజీ ఎల్‌సెట్ 2025 ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హైదరాబాద్‌లో విడుదల చేశారు. జూన్ 6న రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా అభ్యర్థులు తమ ఫలితాలను https://lawcet.tgche.ac.in% అనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. అలానే తమ ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫలితాల కోసం హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన రోజు తేదీ అవసరం అవుతోంది. ఈ సంవత్సరం మొత్తం 57,715 మంది అభ్యర్థులు లాసెట్‌కు దరఖాస్తు చేసుకోగా, 45,609 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఇందులో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు 32,118 మంది.. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎంకు కలిపి 13,491 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పీజీ ఎల్‌సెట్ (ఎల్‌ఎల్‌ఎం) కోసం కూడా వేల మంది పరీక్షలు రాశారు. ఈ ఏడాది లాసెట్, పీజీ ఎల్‌సెట్ పరీక్షల నిర్వహణ బాధ్యత వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీకి అప్పగించారు. ఈ పరీక్షలను ఆన్లైన్ మోడ్‌లో నిర్వహించగా.. పరీక్షలన్నీ శాంతియుతంగా పూర్తి అయ్యాయి. పరీక్ష తర్వాత జూన్ 11న ప్రాథమిక సమాధానాలు విడుదల చేయగా.. అభ్యంతరాల స్వీకరణ అనంతరం నేడు తుది ఫలితాలను విడుదల చేశారు. ఇక ఎంట్రన్స్ ఎగ్జామ్ పాస్ అయిన వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ ర్యాంక్, కేటగిరీ, జిల్లాల వారీగా కాలేజీలకు ఎంపిక చేసుకోవచ్చు. అధికారిక షెడ్యూల్, హెల్ప్‌లైన్ సెంటర్లు, సీట్ల ఖాళీలు తదితర సమాచారం త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

## సినీతారల ఫోన్లు ట్యాపింగ్!?

**(1వపేజీ తరువాయి)**ఆరోపణలు వచ్చాయి. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం భారీ ఎత్తున ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలున్నా యి. ఎన్నికల సమయంలో రాజకీయ ప్రత్యర్థుల కదలికలను తెలుసుకోవడం, వారి ఆర్థిక లావాదేవీలను పసిగట్టడం, ప్రైవేటు సంభాషణలను రికార్డు చేయడం వంటివి ఈ నిఘాలో భాగంగా జరిగినట్లు పోలీసులు గుర్తించారు.ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అనధికారికంగా సేకరించిన డేటాను నాశనం చేయడానికి డీఎస్పీ ప్రణీత్ రావు తన టీమ్‌తో కలిసి సిస్టమ్స్, హార్డ్ డ్రైవ్‌లను ధ్వంసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఉపయోగించి కొందరు పోలీసులు రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపార వివాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేశారని, పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని ఆరోపణలున్నాయి. ఈ కేసులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుల జాబితా ఒక్కొక్కటిగా బయటపడుతుండగా.. పోలీసుల విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రముఖ సినీతారలు, ముఖ్యంగా హీరోయిన్ల ఫోన్‌లు కూడా ట్యాప్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రముఖ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ఫోన్ ట్యాప్ అయినట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | గురువారం | 26 । జూన్ । 2025

## రోదసిలోకి శుభాన్షు శుక్లా.. ఎనిమిది నిమిషాల్లోనే భూమికి చేరిన ఫాల్కన్ రాకెట్

**ఫ్లోరిడా-నవభూమి:** కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లిన స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ భూమికి సురక్షితంగా తిరిగి వచ్చింది. ప్రయోగం చేపట్టిన ఎనిమిది నిమిషాల్లోనే ఈ రాకెట్ భూమికి చేరింది. వ్యోమగాములతో కూడిన క్రూ డ్రాగన్ క్యాప్సూల్ ఐఎస్ఎస్‌కు వెళ్లే మార్గంలో నిర్ణీత సమయానికి ఫాల్కన్ 9 రాకెట్ నుంచి విడిపోయింది. అనంతరం ఫాల్కన్ రాకెట్ తిరిగి సురక్షితంగా భూమికి చేరింది. ఈ క్యాప్సూల్



దాదాపు 28 గంటల పాటు ప్రయాణించి రేపు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఐఎస్-ఎస్ కు చేరుకుంటుంది. సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్ తో అనుసంధానమవుతుందని స్పేస్ ఎక్స్ శాస్త్రవేత్తలు తెలిపారు. స్పేస్‌ఎక్స్ కంపెనీ తయారుచేసిన ఈ ఫాల్కన్ 9 రాకెట్ ప్రపంచంలోనే తొలి ఆర్బిటల్-క్లాస్ పునర్వినియోగ రాకెట్.

## ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా మోదీ పోరాటం.. బుక్ ప్రచురించిన బ్లూక్రాఫ్ట్ ఫౌండేషన్




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని మోదీ అనుభవాలకు చెందిన జ్ఞాపకాలతో కూడిన పుస్తకాన్ని బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ సంస్థ ప్రింట్ చేసింది. ఎమర్జెన్సీ నాటి రోజుల్లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా మోదీ ఎలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారో ఆ బుక్‌లో రాశారు. మోదీ స్వయంగా వెల్లడించిన ఎమర్జెన్సీ అనుభవాలను ఆ బుక్‌లో ప్రజెంట్ చేశారు. ద ఎమర్జెన్సీ డైయిరీస్.. ఇయర్స్ దట్ ఫోర్జ్‌డ్ ఏ లీడర్(%ుఞ్తువ జుఎవతీస్త్రవఅఎం ణఖుతీఅవం%) అన్న టైటిల్‌తో బుక్‌ను డిజైన్ చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రచారకర్తగా మోదీ అనుభవాలను ఆ బుక్‌లో రాశారు. యువ మోదీతో పనిచేసిన మరికొందరు అనుభవాలను కూడా ఆ బుక్‌లో పబ్లిష్ చేశారు. ప్రజాస్వామ్య విలువల కోసం మోదీ ఎలా ఫైట్ చేశారో ఆ బుక్‌లో ప్రజెంట్చేసినట్లు చెబుతున్నారు. ఆ పుస్తకానికి మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ ముందుమాట రాశారు. దేవగౌడ కూడా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. ద ఎమర్జెన్సీ డైయిరీస్ పుస్తకాన్ని ఇవాళ కేంద్ర మంత్రి అమిత్ షా రిలీజ్ చేస్తారు.

బుక్ రిలీజ్ గురించి ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. ఎమర్జెన్సీ విధించిన రోజుల్లో తాను ఆర్ఎస్ఎస్ ప్రచారకుడిగా ఉన్నట్లు చెప్పారు. యాంటీ ఎమర్జెన్సీ ఉద్యమం తనకు లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్ అన్నారు. ప్రజాస్వామ్య విలువల్ని ఎలా కాపాడాలో ఆ ఉద్యమం నేర్పిందన్నారు. ఆ నాటి కొన్ని అనుభవాలను బ్లూక్రాఫ్ట్ డిజిటల్ సంస్థ క్రోడీకరించి ఓ బుక్ రూపంలో తీసుకువచ్చిందన్నారు. ఎమర్జెన్సీ రోజులను గుర్తు తెచ్చుకునేవాళ్లు తమ అనుభవాలను సోషల్ మీడియాలో షేర్ చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు.

## అండమాన్ సముద్రంలో భూకంపం



**చెన్నై-నవభూమి:** అండమాన్ సముద్రం )లో భూకంపం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలు పై భూకంపం తీవ్రత 4.2గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. తెల్లవారుజామున 1:43 గంటల ప్రాంతంలో ప్రకంపనలు నమోదైనట్లు తెలిపింది. భూమికి 20 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు పేర్కొంది. ఈ ప్రకంపనలతో సముద్రంలో అల్లకల్లోలం నెలకొంది. కెరటాలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తీర ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు.

## పది రోజులుగా భారత్‌లోనే బ్రిటన్ ఫైటర్ జెట్..!



**తిరువనంతపురం-నవభూమి:** ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాలలో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బీఇంకా కేరళ లోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టు లోనే ఉంది. సాంకేతిక సమస్య కారణంగా ల్యాండ్ అయిన ఈ జెట్ గత 10 రోజులుగా భారత్‌లోనే నిలిచిపోయింది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఈ బ్రిటిష్ జెట్‌కు సీఐఎస్ఎఫ్ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తున్నారు. అయితే ఆ జెట్‌లో సమస్య ఏంటి..? ఇన్ని రోజులు ఎందుకు చిక్కుకుపోయిందన్న విషయంపై మాత్రం ఇప్పటికీ క్లారిటీ లేదు. గత పది రోజులుగా తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్ ఆరుబయటే ఈ జెట్‌ను పార్క్ చేశారు. దీంతో దాన్ని హ్యాంగర్‌కు తరలించమని భారత్ చేసిన విజ్ఞప్తిని బ్రిటన్ నేవీ సున్నితంగా తిరస్కరించింది. ఈ ఫైటర్ జెట్ సాంకేతికత గురించి ఆందోళన కారణంగా వారు ఈ ఆఫర్‌ను తిరస్కరించినట్లుగా తెలిసింది. తుది తనిఖీల సమయంలో మాత్రం దీన్ని హ్యాంగర్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది.బ్రిటన్ దేశానికి చెందిన హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ క్యారియర్ ఇటీవల ఇండో-పసిఫిక్ రీజియన్‌లో భారత నేవీతో కలిసి సంయుక్తంగా యుద్ధ విన్యాసాలు చేసింది. బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఆ నౌకలోని యుద్ధ విమానం ఎఫ్-35 ఇంధనం తగ్గడంతో జూన్ 14న తిరువనంతపురంలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యిందని ముందుగా వార్తలు వినిపించాయి. అయితే, ఇన్ని రోజులు అది ఇక్కడే ఉండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలిసింది.ఆ ఫైటర్ జెట్‌లో సమస్యను సరిచేసిన తర్వాత తిరిగి హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ పైకి చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫైటర్‌జెట్‌కు సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తున్నది. మన దేశంలో ఓ విదేశీ యుద్ధ విమానం ఐదు రోజులపాటు నిలిచిపోవడం, అందులోనూ ఎఫ్-35 లాంటి 5వ తరం స్టెల్త్‌జెట్ మోరాయించడం సాధారణ విషయం కాదు. కాగా ఈ విమానం షార్ట్ టేకాఫ్‌తోపాటు వర్టికల్ ల్యాండింగ్ అవుతుంది. అమెరికా సహా అతికొద్ది దేశాల ఎయిర్‌ఫోర్సుల వద్దే ఈ ఫైటర్ జెట్ ఉంది. ప్రస్తుతం ఇజ్రాయెల్ కూడా దీనిలోనే మరో వేరియంట్ విమానాన్ని ఇరాన్‌పై దాడులకు వాడుతున్నది.

## మంత్రి అహ్మద్‌ఖాన్ సీరియస్.. పేదల నుంచి లంచం తీసుకునే దరిద్రం రాలేదు..



**బెంగళూరు-నవభూమి:** పేదలకు కేటాయించే ఇళ్ల లబ్ధిదారులనుంచి లంచం తీసుకునేంతటి దరిద్రం తనకు రాలేదంటూ.. గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ మండిపడ్డారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లబ్ధిదారులనుంచి తాను లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తానన్నారు. తన శాఖలో అవినీతికి తావు లేదన్నారు. ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఆరోపణలపై విచారణ జరుపుతామని, ఎమ్మెల్యేతోనూ మాట్లాడతానన్నారు.

# తెల్ల చొక్కా వేసుకొస్తేనే గౌరవం ఇస్తారా?



**న్యూఢిల్లీ-నవభూమి:** తెల్ల చొక్కా వేసుకుని వస్తేనే పోలీసులు వారికి గౌరవం ఇస్తారా అని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. మురికి బట్టల్లో వచ్చిన వారు ఫిర్యాదు చేస్తే తీసుకోరా అని సూటిగా అడిగింది. ముఖ్యంగా ఓ ఫిర్యాదుదారుడు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. అక్కడి సిబ్బంది అతడిని కనీసం కూర్చోనివ్వలేదు. దీంతో అతడు తనకు అవమానం జరిగిందంటూ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగానే మాట్లాడుతూ మురికి బట్టలు వేసుకు వచ్చిన వారు ఫిర్యాదు చేస్తే తీసుకోరా అని ప్రశ్నించింది. మరి వారు ఓట్లు వేస్తే కూడా లెక్కించరా అంటూనే.. ఫలానా వారు మాత్రమే కూర్చోవాలి, మిగతా వారు కూర్చోకూడదంటూ చెప్పే హక్కు మీకు ఎక్కడిదని అడిగింది.చెన్నై నోళంబూర్‌కు చెందిన వానమలై అనే వ్యక్తి ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే అక్కడి అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ నిధులు దుర్వినియోగం అయినట్లు అతడికి తెలియగా.. వానమలై సొసైటీకి ఫిర్యాదు చేశాడు. దీంతో అతడు దళిత వర్గానికి చెందినవాడంటూ అతడిని అవమాన పరిచేలా వాట్సాప్ గ్రూపలో కుల పరమైన పోస్టులు చేశారు. దీంతో వానమలై తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. వారిపై చర్యలు తీసుకోవాలనుకున్నాడు. ఈక్రమంలోనే ఫిర్యాదు చేసేందుకని నొళంబూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అయితే అక్కడ కూడా అతడికి ఇలాంటి పరస్థితే ఎదురైంది. ముఖ్యంగా వానమలైని పోలీసులు కనీసం అక్కడ కూర్చోనివ్వలేదు.ఇలా తనను కూర్చోనివ్వకుండా అవమాన పరచడంతో వానమలై.. సదరు ఎస్సైపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. దాన్ని గమనించిన కమిషన్ వెంటనే పోలీసులకు నోటీసు పంపింది. ముఖ్యంగా దీనిపై సమాధానం ఇవ్వాని కోరింది. మరోవైపు వానమలై.. ఈ ప్రాతిపదికన ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు చేపట్టాలని కోరుతూ హైకోర్టుకు వెళ్లారు. దీనిపై జస్టిస్ వేలమురుగన్ ఇటీవలే విచారణ జరిపారు. పిటిషనర్ సూచించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసుల తరఫున న్యాయవాది చెప్పారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషన్ దారుడిని స్టేషన్‌లో కూర్చోనీయకుండా అవమానించిన పోలీసులు అధికారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. ఇన్‌స్పెక్టర్ ముందు కూర్చోవడానికి ఫిర్యాదు దారుడికి ఎందుకు అనుమతి ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. మురికి చొక్కాతో వస్తే ఫిర్యాదు తీసుకోరా అని న్యాయమూర్తి నిలదీశారు. అలాగే అలాంటి వారు ఎన్నికల్లో ఓట్లు వేస్తే వాటిని లెక్కించరా అంటూ అడిగారు. ఫలానా వారు మాత్రమే కుర్చీలో కూర్చోవాలి, మిగిలిన వారు కూర్చోకూడదని చెప్పేందుకు మీరు ఎవరు, మీకు ఆ హక్కు ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. ఇంతటితో ఆగకుండా.. ప్రభుత్వ కార్యాలయం ప్రజలు అందరిది అని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. సంబంధిత ఇన్‌స్పెక్టర్‌పై రెండు వారాల్లో చర్యలు చేపడతారని సమాధానం ఇచ్చారు. దాంతో న్యాయమూర్తి విచారణను జులై 15వ తేదీకి వాయిదా వేశారు.

### మెడలో చెప్పుల దండ వేసి

# దొంగను ఊరేగించిన పోలీసులు



**జమ్మూ-నవభూమి:** కొన్ని సందర్భాల్లో పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. తాజాగా, దొంగతనం కేసులో అనుమానితుడ్ని అరెస్ట్ చేసిన పోలీసులు.. అతడి పట్ల అమానుషంగా ప్రవర్తించారు. అతడికి మెడలో చెప్పుల దండ వేసి.. పోలీస్ జీప్ బొయినెట్‌పై ఎక్కించి ఊరేగించారు. జమ్మూ కశ్మీర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దుమారం రేగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. బక్షీనగర్ ప్రాంతంలో మందులు దుకాణానికి వచ్చిన వ్యక్తి అక్కడ రూ.40,000 దొంగిలించాడనే ఆరోపణలతో జమ్మూ కశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడి చేతికి బేడీలు, మెడలో చెప్పుల దండ వేసి అర్ధనగ్నంగా ఊరేగించారు.చేతులకు అరదండాలు వేసి, ఒక పోలీసు జీప్ బోయినెట్ మీద కూర్చోబెట్టి నగరంలో ఊరేగించారు. స్థానికుల సమక్షంలో చెప్పుల దండ అతడి మెడలో వేశారు. అంతే కాకుండా పోలీసు బృందం లౌడ్‌స్పీకర్‌లో ప్రకటనలు చేస్తూ.. 'ఇవ్వాళ మేము ఓ దొంగను పట్టుకున్నాం. ఈ వ్యక్తి మందులు కొనే వంకతో దుకాణంలో రూ.40,000 దొంగిలించాడు' అని ప్రకటించారు. దీనిని స్థానికుడు ఒకరు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అయ్యింది. పోలీసులపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది.

విమర్శలు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జమ్మూ పోలీస్ శాఖ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది: 'ఈ చర్యలు పూర్తిగా అనుచితం. వృత్తిపరంగా క్రమశిక్షణ కలిగిన సంస్థ సభ్యులకు తగని ప్రవర్తన ఇది.. దీనికి బాధ్యులైన పోలీసులపై కఠినమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపింది. దీనిపై విచారణకు డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయి అధికారిను నియమించి, ఒక వారంలోపు పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.ఈ ఘటనపై మానవ హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు, సామాన్య ప్రజలు తీవ్రంగా స్పందిస్తున్నారు. పోలీసులు న్యాయపరంగా కాకుండా, పౌరులను అవమానించేలా తమ స్వంత తీర్పుతో చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికం అని అంటున్నారు.

'ఇది దొంగతనం కంటే ఎక్కువ నేరం' అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సంఘటన మరోసారి పోలీసు శిక్షణ, నైతికత, బాధ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోనూ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో నలుగురు యువకులను అరెస్ట్ చేసిన తెనాలి పోలీసులు.. నడిరోడ్డు మీద అరికాళ్లపై లాఠీలతో కొట్టి హింసించారు.

గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఏపీలో రాజకీయ దుమారానికి దారితీసింది. మాజీ సీఎం వైఎస్ జగన్ బాధిత కుటుంబాల పరామర్శకు వెళ్లడం మరింత అగ్గి రాజేసింది.

# లవర్‌పై పగతో 12 రాష్ట్రాలకు బాంబు బెదిరింపులు



**చెన్నై-నవభూమి:** దేశంలోని ప్రముఖ ప్రాంతాలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ పంపించిన మహిళా ఇంజినీర్ రెనె జోషిడాను అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని ఓ మల్టీనేషనల్ కంపెనీలో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రెనె జోషిడా ను చెన్నైలోని ఆమె నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం, బీజే మెడికల్ కాలేజీ సహా పలు స్కూళ్లు, కాలేజీలకు రెనె జోషిడా వరుసగా బాంబు బెదిరింపులకు పాల్పడి.. ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేసినట్లు పోలీసులు తెలిపారు.ఇక ఆమెను పట్టుకునేందుకు అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు.. దేశవ్యాప్తంగా జల్లెడ పట్టారు. అయితే బాంబు బెదిరింపులు ఎందుకు చేశావని.. పోలీసులు రెనె జోషిడాను ప్రశ్నించగా.. ఆమె చెప్పిన సమాధానం విని పోలీసులు షాక్‌కు గురయ్యారు. అయితే తాను ప్రేమించిన విజయ్ ప్రభాకర్ అనే వ్యక్తి.. తనను కాకుండా మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని.. ఈ నేపథ్యంలోనే అతడిపై కక్ష సాధించేందుకే అతని పేరుతో ఈ-మెయిల్ ఐడీలు సృష్టించి ఈ బాంబు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు విచారణలో రెనె జోషిడా అంగీకరించింది. ఇలా ఆయన పేరుతో బెదిరింపు మెయిల్స్ చేస్తే.. ఈ కేసులో విజయ్ ప్రభాకర్ ఇరుక్కుంటాడని భావించి ఇదంతా చేస్తున్నట్లు చెప్పింది.అయితే విజయ్ ప్రభాకర్ పేరుతో ఈ-మెయిల్స్ క్రియేట్ చేసి.. బాంబు బెదిరింపులు చేసిన రెనె జోషిడా.. ఈ కేసులో తన పేరు బయటికి రాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది. కానీ ఒక చిన్న పొరపాటు కారణంగా ఆమె దొరికిపోయిందని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు. కానీ ఆమె చేసిన పొరపాటు మాత్రం వారు బయటపెట్టలేదు.రెనె జోషిడా.. గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా మొత్తం 12 రాష్ట్రాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కానీ ఆమె చేసిన బెదిరింపు మెయిల్స్ కారణంగా.. వేలాది మంది అమాయకులు భయభ్రాంతులకు గురవుతున్నారనే విషయాన్ని ఆమె పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో ఆమెపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇక ఆమె ఒక్క గుజరాత్‌కే 21 బెదిరింపు మెయిల్స్ పంపించిందని.. అందులో నరేంద్ర మోదీ స్టేడియానికే 13 మెయిల్స్ చేసినట్లు అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.జెనీవా లిబరల్ స్కూల్‌కు 4 మెయిల్స్, దివ్యజ్యోతి స్కూల్‌కు 3 మెయిల్స్, బీజే మెడికల్ కాలేజీకి ఒక మెయిల్ పంపించినట్లు పేర్కొన్నారు. గుజరాత్‌తో పాటు మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, బీహార్, తెలంగాణ, పంజాబ్, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు కూడా రెనె జోషిడా ఈ బాంబు బెదిరింపు మెయిల్స్ పంపించిందని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చెప్పారు.

# మా అణుకేంద్రాలు బాగా దెబ్బతిన్నాయి

### అంగీకరించిన ఇరాన్

**టెహ్రాన్-నవభూమి:** 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై బీ-2 స్పిరిట్ బాంబర్లతో అమెరికా గత వారంలో దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ప్రకటించారు. అయితే, ఏ మేరకు నష్టం జరిగిందనే విషయంపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తూ వచ్చాయి. జరిగిన నష్టం తక్కువేనని, అమెరికా ఆపరేషన్ ఫెయిల్ అనే ప్రచారం కూడా జరిగింది. అయితే, దీనిపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ బుధవారం నాడు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా దాడుల్లో తమ అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నట్టు ఆయన ధ్రువీకరించారు.'మా అణుకేంద్రాలు బాగా దెబ్బతిన్నాయని నిశ్చయంగా చెప్పగలను' అని బఘయీ తెలిపారు. అయితే మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఇరాన్ అణుసంస్థతోపాటు ఇతర ఏజెన్సీలు పరిస్థితిని అంచనా వేస్తున్నాయని చెప్పారు.

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి సంప్రదింపులు జరిపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నెథర్లాండ్స్‌లో జరిగిన 'నాటో' సమ్మిట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్ అణుకేంద్రాలపై కచ్చితమైన దాడులు జరిపామని చెప్పారు. 'వారికి అణుబాంబు ఉండదు, దాన్ని వాళ్లు అభివృద్ధి చేయబోవడం లేదు' అని చెప్పారు. మరోవైపు ఇరాన్ మాత్రం తమ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను వదులుకోవడం లేదని చెబుతోంది. తమ అణుకేంద్రాల భద్రతకు హామీ ఇచ్చేంత వరకూ అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు సహకారాన్ని నిలిపివేయాలనీ ఇరాన్ పార్లమెంటు తీర్మానించింది. దీనిపై ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫేల్ మరియానో గ్రాస్సి వియన్నాలో మాట్లాడుతూ.. న్యూక్లియర్ కేంద్రాల తనిఖీలను తిరిగి ప్రారంభించేందుకు చర్చలు జరపాలని ఇరాన్‌కు తాను ఇప్పటికే లేఖ రాసినట్టు చెప్పారు.

# బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్-నవభూమి:** బోనాల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆషాడ మాసం బోనాల ఉత్సవాలతో తెలంగాణలో పండుగ వాతావరణం మొదలవుతుందని అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి నెలకొంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరుకున్నారు.

## మెరీనా తీరం... మైమరిపించే ప్రాంతం



**చెన్నై-నవభూమి:** స్థానిక మెరీనా బీచ్(లో 'బ్లూ ఫ్లాగ్' సర్టిఫికెట్ పొందేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో పలు పనులు చేపట్టారు. ఆ ప్రకారం, బీచ్ ప్రాంతంలో కొబ్బరి ఆకుల పాకలు, పిల్లలకు క్రీడా మైదానం, క్రీడా ఉపకరణాలు ఏర్పాటవుతున్నాయి. డానిష్ ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ప్రపంచంలోని అత్యుత్తమ బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ అందజేస్తోంది. ఘనవ్యర్థాల నిర్వాహణ, బీచ్ శుభ్రత, పర్యాటకుల భద్రత, కల్పిస్తున్న వసతులు సహా వివిధ అంశాలు పరిశీలించి ఈ సర్టిఫికెట్ అందజేస్తోంది.

బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ అంతర్జాతీయ ప్రామాణికం కావడంతో, ఈ సర్టిఫికెట్ పొందిన బీచ్ ప్రాంతం అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతుంది. అలాగే, పర్యాటకుల రాకపోకలు పెరిగే కొద్దీ స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా వృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో కోవలం బీచ్ ఇప్పటికే బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ పొందింది. ఈ నేపథ్యంలో, చెన్నై మెరీనా బీచ్ తిరువాన్మియూర్ సహా ఆరు బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా, మెరీనా బీచ్‌లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతమయ్యాయి.

ఇందుకోసం జీసీసీ ఆధ్వర్యంలో రూ.5.60 కోట్లతో బీచ్‌లో వాక్ వే, సైకిల్ మార్గాలు, ఆట స్థలం, వాచ్ టవర్, 360 డిగ్రీల నిఘా కెమెరాలు, ఓపెన్ ఎయిర్ జిమ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ప్రస్తుతం బీచ్‌లో పిల్లల ఆట సామగ్రి ఏర్పాటుచేయడంతో పాటు మొక్కలు కూడా నాటుతున్నారు. అలాగే, పర్యావరణ అనుకూల వెదురుతో తయారుచేసిన షెడ్ రూఫ్‌లు, లాంజ్ కుర్చీలు, డస్ట్‌బిన్‌లు, సోఫాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కింద, దివ్యాంగుల కోసం 4 వీల్ చెర్లను కొనుగోలు చేశారు. సర్వీస్ రోడ్డులో వృద్ధులు, దివ్యాంగులు వెళ్లేలా బ్యాటరీ వాహనాలు కూడా ఏర్పాటయ్యాయి.

## రైలు ప్రయాణీకులకు షాక్.. జూలై 1 నుంచి పెరగనున్న టికెట్ ఛార్జీలు..! ఎంతంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వేశాఖ ప్రయాణీకులకు బిగ్ షాక్ ఇచ్చింది. టికెట్ ఛార్జీలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 1 నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినప్పటికీ రైల్వే ఉన్నతాధికారి ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. అనధికార సమాచారం ప్రకారం, చాలా సంవత్సరాల తర్వాత రైల్వే శాఖ ప్యాసింజర్ రైలు ఛార్జీలను పెంచబోతోంది. నాన్ ఏసీ మెయిల్, ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు కిలోమీటరుకు ఒక పైసా, ఏసీ ప్రయాణీకులకు 2 పైసల చొప్పున పెరుగుతాయి. అయితే, సెకండ్ క్లాస్ సాధారణ తరగతిలో500 కి.మీ దూరం వరకూ ప్రయాణించేవారికి ఈ పెంపు వర్తించదు. వీరు గనక అదనంగా ఒక్క కిలోమీటరు దూరంగా ప్రయాణించినా అరపైసా చొప్పున పెరుగుతుంది. అలాగే నెలవారీ సీజన్ టికెట్ ధరలు, సబర్బన్ రైళ్ల టికెట్‌ఛార్జీల్లో కూడా ఎలాంటి మార్పు ఉండబోదు.

జూలై 1 నుంచి రైల్వే శాఖ తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించిన కీలక నియమం అమల్లోకి తీసుకురానుంది. కొత్త నియమం ప్రకారం, డిజిటల్ నవీకరణతో పాటు, ఆధార్ కార్డు ఉన్నవారు మాత్రమే వెబ్‌సైట్ లేదా యాప్‌లో తత్కాల్ టిక్కెట్లను బుక్ చేసుకోగలరు. సరైన వ్యక్తులు మాత్రమే తత్కాల్ బుకింగ్ ప్రయోజనాలు పొందేలా చూడటమే ఈ మార్పు వెనకగల ప్రధాన ఉద్దేశమని ఇటీవల రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది.దీనితో పాటు, భారతీయ రైల్వేలు అధీకృత బుకింగ్ ఏజెంట్లపై కూడా అనేక ఆంక్షలు విధించాయి. వాటిలో ఒకటి ఏజెంట్లు ఇకపై బుకింగ్ విండో ప్రారంభమైన మొదటి 30 నిమిషాలలో తత్కాల్ టిక్కెట్లను బుక్ చేసుకోలేరు. %ూజ% క్లాస్ టిక్కెట్ కోసం ప్రయాణీకులు ఉదయం 10:00 నుంచి 10:30 వరకూ.. నాన్-ఏసీ టిక్కెట్ల కోసం ఉదయం 11:00 నుండి 11:30 వరకూ నిరంతరాయంగా సంబంధిత వెబ్‌సైట్లలో బుక్ చేసుకోవచ్చు.జూలై 1, 2025 నుంచి ఆధార్ ధృవీకరించబడిన వినియోగదారులు మాత్రమే వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్ చేసుకోగలరు. జూలై 15 నుంచి బుకింగ్ కోసం ఆధార్ ఆధారిత ప్రామాణీకరణ తప్పనిసరి కానుంది. తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలో అక్రమాలను అరికట్టడానికి, తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి ప్రామాణీకరణ తప్పనిసరి చేసింది రైల్వేశాఖ. ఆధార్ ధృవీకరణ తర్వాత కౌంటర్ ఆధారిత తత్కాల్ టిక్కెట్లను కూడా బుక్ చేసుకోవచ్చని తెలుస్తోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | గురువారం | 26 । జూన్ । 2025



## 282 మంది భారతీయులతో ఇరాన్ నుంచి ఢిల్లీకి మరో విమానం.. ఇప్పటి వరకూ 2,858 మంది తరలింపు



టెహ్రాన్-నవభూమి: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు కేంద్రం 'ఆపరేషన్ సింధు' చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు స్వదేశానికి చేరుకున్నారు. ఇరాన్ నుంచి భారతీయులతో బయల్దేరిన ప్రత్యేక విమానం బుధవారం తెల్లవారుజామున ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది.ఈ విమానంలో 282 మంది భారతీయులు క్షేమంగా స్వదేశానికి తిరిగొచ్చారు. 'జూన్25న తెల్లవారుజామున మాషా (ఇరాన్) నుంచి 282 మంది భారతీయులతో ప్రత్యేక విమానం ఢిల్లీకి చేరుకుంది. దీంతో ఇప్పటి వరకు ఇరాన్ నుంచి 2,858 మందిని స్వదేశానికి తీసుకొచ్చాం' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది.

ఇరాన్ నుంచి ఇది 11వ విమానం అని పేర్కొంది. ఇందులో పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంకకు చెందిన వారు కూడా ఉన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ నుంచి మూడు విమానాల్లో దాదాపు 594 మంది భారత పౌరులు, నేపాల్, శ్రీలంక పౌరులను సురక్షితంగా తీసుకొచ్చినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

ఈ ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్, ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోయిన దాదాపు 3180 మంది భారత పౌరులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చినట్లు వివరించింది.



## యుద్ధం కాదు.. శాంతే శాశ్వతం

ఏ చట్టాలకు లోబడి ఉండాల్సిన అవసరం లేని ఒక విధ్వంసకర రూపం యుద్ధం. విచ్చలవిడిగా ఒకరినొకరు చంపుకోవడం, ఆస్తులను ధ్వంసం చేసుకోవడం, ఎవరు ఎక్కువ ఈ విధంగా చేస్తే, వారే గెలిచినట్లు సంబరపడతారు.

ఏ చట్టాలకు లోబడి ఉండాల్సిన అవసరం లేని ఒక విధ్వంసకర రూపం యుద్ధం. విచ్చలవిడిగా ఒకరినొకరు చంపుకోవడం, ఆస్తులను ధ్వంసం చేసుకోవడం, ఎవరు ఎక్కువ ఈ విధంగా చేస్తే, వారే గెలిచినట్లు సంబరపడతారు. ఓడినవారే కాదు, గెలిచినవారు కూడా ఎన్నో ప్రాణాలు, సంపదను కోల్పోతారు. కానీ, అంతిమ గెలుపు తమదే అన్నట్టు సంబరాలు చేసుకుంటారు. వారు చేసిన విధ్వంసం ఎలా ఉంటుందో ఒకసారి పరిశీలిద్దాం. ప్రస్తుత ఉక్రెయిన్ రాజధాని కీవ్, సోవియట్ యూనియన్‌లో ఉన్నప్పుడు, అద్భుతమైన కట్టడాలతో ప్రపంచ పర్యాటక కేంద్రం. యుద్ధం చేసిన ఏ దేశమైనా, యుద్ధానంతరం అభివృద్ధి పనులు, ఆలోచనలు కనుమరుగై, యుద్ధం కారణంగా జరిగిన నష్టాన్ని సరిచేసుకోవడంలో ఉండిపోతాయి. అంటే... కొన్ని దశాబ్దాలపాటు నష్ట నివారణకే పరిమితమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఆకలిచావులకు గురైనా ఆశ్చర్యం లేదు. మూడేళ్లకు పైగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. కొత్తగా మొదలైన ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం భీకరంగా సాగుతూ, ప్రపంచాన్ని భయపెడుతోంది. సంప్రదాయ యుద్ధాలకు కాలం చెల్లింది, దౌత్యపరమైన పద్ధతిలోనే దేశాల మధ్య వివాదాలు తీర్చుకునే కొత్త సంప్రదాయం మొదలైందని అందరూ భావిస్తున్న నేపథ్యంలో ఈ యుద్ధాలు జరుగుతుండడం బాధాకరం. ప్రపంచాన్ని భయానికి గురి చేస్తున్నది అణు బాంబులు. ఇవి ప్రపంచంలో కేవలం 9 దేశాలలోనే ఉన్నా, వాటని వినియోగిస్తే, భూమండలాన్ని వందసార్లు పూర్తిగా ధ్వంసం చేయవచ్చు. మరో భయం కలిగించే విషయం... ఉత్తర కొరియా, పాకిస్థాన్ వంటి ఉన్మాదుల వద్ద అణ్వాయుధాలు ఉండడం. ఇరాన్ వాటికి తోడు కాకుండా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య జరుగుతున్నది యుద్ధంలా కాకుండా, హమాస్ తీవ్రవాద సంస్థను నిర్మూలించడానికి చేస్తున్న దాడులుగా ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తోంది. భారత్-పాకిస్తాన్ మధ్య దాడులు మూడు రోజులకే ముగియడం సంతోషించదగ్గ విషయం. అవి కొనసాగితే ఇరుదేశాలూ ఎంతో కొంత నష్టపోయేవి. ఈ యుద్ధాలు త్వరగా ముగిసి, ప్రజలు సుఖంగా జీవించే రోజులు రావాలని ఆశిద్దాం.

మనిషి రూపొందించుకున్న అత్యంత ప్రమాదకరమైన ఆవిష్కరణలలో యుద్ధం ఒకటి. ఇది చట్టాలకు అతీతం. ఇది విలువలకు విరుద్ధం. ఇది మానవత్వానికి శత్రువు. ఒకరినొకరు చంపుకోవడం, బాంబులతో నగరాలను నేలమట్టం చేయడం, పౌరుల జీవితాలను అగ్నిదాహంగా మార్చడం – ఇవే యుద్ధానికి ఇతర దేశాలపై చూపే విజేత సంకేతాలు. గెలుపు అనే భావనను మానవ నష్టాలపై ఆధారపెట్టడం ఎంత నిర్దయనో ఈ ప్రక్రియ మనకు చెప్పకనే చెబుతుంది.ప్రపంచానికి గాయాల మీద గాయాలు గుదబండిన సందర్భమే ఉక్రెయిన్ రష్యా యుద్ధం. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణలో పది వేలల ప్రాణాలు నశించాయి. మిలియన్ల మంది వలసపోయారు. కీవ్ నగరం, ఒకప్పుడు సోవియట్ సామ్రాజ్యంలో కళా వారసత్వానికి నిలయం – ఇప్పుడు శ్మశాన శాంతికి సంకేతంగా మారిపోయింది. విద్యుత్ లేదు, తాగునీరు లేదు, భద్రత లేదు. చెత్త, చీకటి, శబ్దాలు... ఇవే మిగిలిన జీవితం. యుద్ధం అనంతర అభివృద్ధి అన్నది అక్కడి ప్రజలకు శూన్యం.ఇజ్రాయెల ఇరాన్ మధ్య దళాల కదలికలు ప్రపంచాన్ని భయపెడుతున్నాయి. ఇవి సాధారణ ఘర్షణలు కావు – అణు బాంబుల ముప్పును ఊహించాల్సిన స్థాయికి చేరుతున్నాయి. ప్రపంచంలో కేవలం తొమ్మిది దేశాల వద్దే అణు ఆయుధాలు ఉన్నా, వాటిని వినియోగించే ఉన్మాదం ఉన్న నాయకులు ఉన్న దేశాలు మరింత ప్రమాదకరమైనవి. ఉత్తర కొరియా, పాకిస్థాన్ వంటి దేశాల వద్ద ఈ శక్తి ఉండడమే ఒక ప్రహసనంగా మారుతోంది.ఇజ్రాయెల్‌పాలస్తీనా మధ్య జరుగుతున్న ఘర్షణను హమాస్ అనే తీవ్రవాద సంస్థపై ఆపరేషన్‌గా కొన్ని దేశాలు సమర్థించినా, ఆ దాడుల తీవ్రతకు బలవుతున్నది పౌరజనం. శిశువులపై బాంబులు, ఆసుపత్రులపై దాడులు – ఇవన్నీ యుద్ధంలో న్యాయంగా భావించబడతాయంటే, మానవత్వానికి మరణగీతి పాడినట్లే. అంతర్గత సంఘర్షణల పేరుతో జరుగుతున్న విధ్వంసం, మధ్యప్రాచ్యంలోనే కాకుండా, సమస్త మానవ సమాజాన్ని కలవరపెడుతోంది.ఇంతకీ ఈ యుద్ధాలన్నింటికి తెరపడేనా? భారత్ పాకిస్థాన్ మధ్య ఇటీవల జరిగిన మూడు రోజుల ఘర్షణ తక్కువ సమయంలో ముగిసిందన్నది ఒక శుభ సూచిక. కానీ అది శాశ్వత శాంతికి బాటవేస్తుందా? లేక తాత్కాలిక నిశ్శబ్దానికి సంకేతమా? ఈ ప్రశ్నను మనం తప్పక వేయాలి.సంప్రదాయ యుద్ధాలకు చరిత్రలో స్థానం ఉంది. కానీ భవిష్యత్తు వాటిని క్షమించదు. ఈ శతాబ్దం అస్త్రాలకు కాదు, సంభాషణకు అవసరమైనది. దౌత్యం, సంయమనం, పరస్పర గౌరవం లేనిదే శాంతి సాధ్యం కాదు. మార్పు కావాల్సినది దేశాల పాలకుల్లో కాదు వారి ఆలోచన విధానంలో ఉండాలి.

### పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా విద్యా సంస్థల నడిపిన

# మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



**మిళింద్ యూనివర్సిటీకి ఔరంగాబాద్‌లో 54 ఎకరాలు స్థలం కేటాయించిన హైదరాబాద్ నిజాం మీరు ఉస్మాన్ అలీ ఖాన్**

భారతదేశపు స్వాతంత్రం రాకముందే సమ సమాజ నిర్మాణం కోసం మహానుభావులందరూ విద్యను ప్రాధాన్యతకు గుర్తించి ఉచిత విద్య సంస్థలను నడిపిన సంఘటనలు చాలా ఉన్నాయి . అందులో తొలి గురువుగా సాహు మహారాజ్ ను చెప్పుకోవచ్చు , తర్వాత కాలంలో మహాత్మ జ్యోతిబాపూలే భార్యా భర్త లిద్దరూ ఎన్నో కష్టాలు నష్టాలు అవమానాలను భరించి బహుజన వర్గాలకు పేదలకు చదువులు నేర్పిన ఘనత వారికి దక్కుతుంది . ఆ తర్వాత కాలంలో వారి ఆశయాలను పునికి పుచ్చుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటుచేసి పాఠశాలలో కళాశాలను ఏర్పాటు చేశారు . డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏర్పాటుచేసిన కళాశాలలో చదువులు చదివిన వారు భారత దేశంలో ఉన్నత పదవులు నిర్వహించారు. అందులో ప్రధానంగా దేశంలోని ఉన్నత విద్యా మండలి నిర్వహించే గ్రాండ్స్ కమిషన్ చైర్మన్ గా మిళింద యూనివర్సిటీ లో చదివిన సుఖదేవ్ తోరత్ చైర్మన్ గా విధులు నిర్వహించారు . డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 13 సెప్టెంబర్ 1946 న పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ( ప్రజా విద్యావర్ధక సంఘం ) అనే పేరుతో ఒక విద్యా సంస్థను స్థాపించి సో సైటీ చట్టాల క్రింద దాన్ని రిజిస్టర్ చేయించారు.ఈ సంస్థ ద్వారా సుమారు 7 కళాశాలలను, 20 వసతి గృహాలు( హాస్టళ్ళు ) నడుపుతున్నారు.సుమారు లక్ష రూపాయలకు పైగా విరాళాలు ద్వారా వసూలు చేసి ఈ సంస్థ ద్వారా బొంబాయిలో సిద్ధార్థ కళాశాలను స్థాపించాడు.ఈ సిద్ధార్థ కళాశాలలో న్యాయశాస్త్రం, కళా శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం యీ విధంగా ఏ భాగానికి ఆ భాగం ప్రత్యేక కళాశాల విభాగాలుగా అభివృద్ధి చేశారు. ఈ సిద్ధార్థ కళాశాల కార్యకలా పాల్లోనే అంబేద్కర్ పూర్తిగా నిమగ్నమయ్యేవారు.వేళకు ఇంటికి వెళ్ళేవారు కాదు.కళాశాలకు కావలసిన వసతులు కల్పించడంతో పాటు ప్రతి విభాగానికి ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి స్వయంగా అంబేద్కర్ ఉత్తమ గ్రంథాలను సేకరించి పెట్టారు. ప్రతి తరగతికి వెళ్ళి బోధనా పద్ధతులను పరీక్షించడం చేసేవారు. కొన్ని సార్లు



అంబేద్కర్ న్యాయశాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి అంశాలపై తానే స్వయంగా బోధించే వారు. రోజులో 12 గంటలు కళాశాలలో సరిపోగా ఇంటికి వచ్చాక మళ్ళీ రాజకీయాలు, గ్రంథ పఠనం వంటివి తప్పేవి కావు.

అణగారిన వర్గాల వారికి మనువాద శక్తులు విద్యను దూరం చేశాయి.ఈ నేపథ్యంలో బాబాసాహెబ్ డా.అంబేద్కర్ ఆది గురువు భగవాన్ బుద్ధుడు నుండి ధమ్మాన్ని అనుసరించి, మధ్య కాలంలో సంత్ కబీర్ దాస్ నుండి ఆధ్యాత్మిక స్ఫూర్తిని పొంది, ఆధునిక గురువు మహాత్మా జ్యోతిరావు ఫూలే స్ఫూర్తితో అందరికీ విద్య కోసం పోరాటం సాగించారు.విద్య ఒక శక్తివంతమైన ఆయుధంగా సామాజిక మార్పుకు ఉపకరిస్తుంది అని బాబాసాహెబ్ భావించారు. ముఖ్యంగా విద్యకు దూరమైన బహుజనులు కోసం అందరికీ విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో పలు విద్యా సంస్థలు స్థాపించారు.

1945 వ సంవత్సరం జూలై 8 వ తేదీన బాబాసాహెబ్ ముంబైలో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీను( %ూజుూ% ) స్థాపించారు.ఈ సంస్థ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ మొదటిసారిగా 1946 జూన్ 20 వ తేదీన సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ ను ప్రారంభించారు.ఇక్కడ బాబాసాహెబ్ డా.అంబేద్కర్ ను తమ స్వర్థానికి వాడుకుంటున్న భావదాస్యంతో ఉన్న దళిత క్రైస్తవులు గమనించాల్సిన విషయం ఏంటంటే ఎందుకు బాబాసాహెబ్ సిద్ధార్థ అని భగవాన్ బుద్ధుని పేరును ఈ కళాశాలకు పెట్టారు? ఏం జీసస్ క్రీస్తు అని పెట్టలేదే?! బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అంటే మహామానవీయుడు,దశమ భాగాల కోసం ఉపన్యాసాలు ఇచ్చే వాళ్ళ మాటలు మాత్రమే నమ్మే దళిత క్రైస్తవులు బాబాసాహెబ్ ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. బాబాసాహెబ్ లేకపోతే మీకు మానవ హక్కులు కూడా లభించకపోవును. బాబాసాహెబ్ సిద్ధార్థ అనే పేరు ఈ కళాశాలకు పెట్టడం వెనుక ఉద్దేశం ఏంటంటే బౌద్ధ తత్వం ప్రతిబింబించాలని.

విద్య ద్వారా సామాజిక సమానత్వం సాధించాలి అని బాబాసాహెబ్ భావిస్తే విద్యావంతులు అయి కూడా మన వాళ్ళు మూఢులుగా, స్వార్థపరులుగా తయారు అవుతున్నారు.సామాజిక సమానత్వం కోసం కాకుండా విద్యావంతులు విదేశీ క్రైస్తవ మతం వ్యాప్తి కోసం పనిచేస్తున్న పరిస్థితి.విద్యను అభ్యసించి సామాజిక మార్పుకు కృషి చేస్తారని ఆయన ఆశిస్తే మనవాళ్ళు మనువాద శక్తులు బలోపేతం అవడానికి ఉపయోగపడుతున్నారు.

బాబాసాహెబ్ స్థాపించిన సిద్ధార్థ కళాశాల ముంబైలోని తొలి కళాశాలలో ఒకటి. ఈ కళాశాలలో విద్యను అభ్యసించడానికి ఎలాంటి తారతమ్యాలు చూపకుండా అందరికీ అవకాశాలు కల్పించింది.స్వయంగా బాబాసాహెబ్ ఈ కళాశాలకు వచ్చి ఎన్నో ప్రసంగాలు చేశారు.

**మిళింద్ కళాశాల ప్రారంభం**

మిళింద కళాశాల స్థాపన జూన్ 19,1950 లో ప్రసిద్ధి చెందిన ఇండో- గ్రీకు బౌద్ధ చక్రవర్తి అయిన మిళిందుని పేరుతో మిళింద మహా విద్యాలయాన్ని మహారాష్ట్రలోని ఔరంగాబాద్ లో నెలకొల్పారు. మొత్తం 54 ఎకరాల స్థలాన్ని ఈ మిళింద్ మహా విద్యాలయం ఏర్పాటుకు గాను హైదరాబాద్ 7 వ నవాబ్ నిజాం మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు దానంగా ఇచ్చారు.

ఈ మిళింద్ మహావిద్యాలయం ప్రారంభానికి శంఖుస్థాపన కు భారత మొదటి రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ 1, సెప్టెంబర్ 1950 లో చేసారు.వీరితో పాటు హైదరాబాద్ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మరియు ఇతరులతో ఈ కార్యక్రమం జరిగింది.

మిళింద్ మహావిద్యాలయం స్థాపించి 70 సంవత్సరాలు అవుతోంది. ఈ విద్యాలయంలో చదివి వేలాది మంది వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఆర్థికవేత్తలు, శాస్త్రవేత్తలు, రచయితలు, ప్రభుత్వ అధికారులు అవుతున్నారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ త్యాగం, పోరాటం గురించి ఎంత చెప్పిన తక్కువే, కుల వ్యవస్థ నిర్మూలన కోసం , అంటరానితనం రూపుమాపేందుకు, పీడిత కులాలు దోపిడీ అగ్రకులాల నుంచి విముక్తి చెంది ప్రజాస్వామ్యంలో సమానత్వంతో జీవించాలని, ఈ దేశాన్ని ప్రబుద్ధ భారత్ గా మార్చాలని అహర్నిశలు తపించారు. కమ్యూనిస్టులు వలె మాటలు చెప్పి,భావోద్వేగాలతో యువతను రెచ్చగొట్టి ధర్నాలు, రాస్తారోకోలు పేరుతో జనాలను సమీకరించి సోషలిజం పేరుతో హోల్ సేల్ గా బహుజనులైన ఎస్సీ, ఎస్టీ,బి.సీ,మైనారిటీలను దోపిడీ అగ్రకులాలకు రాజ్యాధికారం అప్పజెప్పే పద్ధతులు ఆయన అనుసరించలేదు.ఆయన అసలైన సమతా రాజ్యం కోసం తపించిన నాయకుడు,బోధిసత్వుడు, నిష్కళంక దేశభక్తుడు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక పక్కన అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే తను, తను కుటుంబం కొవ్వొత్తి వలె కరిగి పోతూ ఈ సమాజానికి వెలుగులు ప్రసరింప చేసిన త్యాగం ఆయనది. భవిష్యత్ సమాజం కోసం రచనలు చేశారు. మరోపక్క విద్య కోసం ఎన్నో విద్యాసంస్థలు, హాస్టళ్ళు స్థాపించారు. మిళింద్ యూనివర్సిటీలో చదివిన వారు ఎంతో మంది ప్రయోజకులయ్యారు , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇతర దేశాల్లో స్థిరపడ్డారు . ప్రధానంగా భారతదేశంలో అత్యున్నతమైన విద్యాసంస్థల నిర్వహణ గ్రాంట్ కమిషన్ చైర్మన్గా సుఖదేవ్ తోరత్ ఎంపికయ్యారు . భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటి దళితుడు ఆ పదవిలో కొనసాగారు. ముందుచూపుతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ %ఎఅశీఞశ్రీవనస్త్రవ అం జూశీఞవతీ% అని అనేక సందర్భాల్లో జరిగిన ప్రసంగాలు చెప్పారు . అంబేద్కర్ ప్రాథమిక ప్రాధాన్యత చదువు పైనే దృష్టి పెట్టారు . అందు కు గాను మహనీ యులను ఆదర్శంగా తీసుకొని విద్యా సంస్థలు నిర్వహించారు . అవి ఇప్పటికి కూడా కొనసాగి మంచి ఫలితాలను సాధిస్తున్నాయి . సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నవారు కూడా విద్యాసంస్థలు ఏర్పాటు చేసి నాడు ఉచిత విద్యను బోధించారు . ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోరుకున్నారు

అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196

# మాతృత్వానికి నవశకం: ఉమాదేవి వెర్సెస్ తమిళనాడు తీర్పు!



మనదేశంలో ఉద్యోగినుల హక్కుల పరిరక్షణకు, ముఖ్యంగా మాతృత్వపు హక్కుల విషయంలో సుప్రీంకోర్టు మే 23, 2025న ఇచ్చిన కె. ఉమాదేవి వెర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో చారిత్రాత్మక తీర్పుతో గణనీయమైన ముందడుగు పడింది. ఆర్థిక, మాతృత్వ హక్కుల పరిధిని నేరుగా ప్రస్తావించి విస్తరించింది. ఇది మహిళల పునరుత్పత్తి స్వేచ్ఛకు, కార్యాలయ గౌరవానికి పెద్ద పీట వేసింది.

**పూర్వాపరాలు:** ఈ కేసు కె. ఉమాదేవి అనే ఉద్యోగిని చుట్టూ తిరిగింది. ఆమె తన రెండవ వివాహం తర్వాత జన్మించిన మూడవ బిడ్డకు ప్రసూతి సెలవు కోరారు. తమిళనాడు ప్రభుత్వం ఆమె అభ్యర్థనను నిరాకరించింది. సుప్రీంకోర్టు తన ఇటీవలి తీర్పులో శ్రీమతి ఉమాదేవికి స్పష్టంగా అనుకూలంగా నిలిచింది. అటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యానాలను కొట్టివేసింది. పిల్లల సంఖ్య లేదా వివాహ పరిస్థితుల ఆధారంగా ప్రసూతి సెలవును నిరాకరించడం లేదా పరిమితం చేయడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. ప్రసూతి ప్రయోజనాలు ఒక మహిళ పునరుత్పత్తి హక్కులలో, ప్రాథమిక గౌరవంలో, రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం హామీ ఇవ్వబడిన ఆరోగ్య హక్కులో అంతర్భాగమని నొక్కి చెప్పింది. అటువంటి వివక్షాపూరిత నియమాలు మహిళలపై "అన్యాయమైన భారాన్ని" సృష్టిస్తాయని, వారి కెరీర్ లేదా కుటుంబం మధ్య ఎంపిక చేసుకోవలసి వస్తుందని, లేదా వారి పునరుత్పత్తి నిర్ణయాలు తీసుకునే హక్కును అణగదొక్కుతాయని తీర్పు నొక్కి చెప్పింది.

**1961 నాటి ప్రసూతి ప్రయోజన చట్టం :**

సాధారణంగా " ఇద్దరు కంటే తక్కువ మంది జీవించి ఉన్న పిల్లలు" ఉన్న మహిళలకు మాత్రమే ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేసే ప్రస్తుత నిబంధనలు దీనికి కారణం. అనేక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సేవలలో సాధారణంగా ఉండే ఈ విధానం, వివక్షాపూరితమైనదిగా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది.ఇప్పటివరకు భారతదేశంలో ప్రసూతి హక్కులు ప్రధానంగా 1961 నాటి ప్రసూతి ప్రయోజన చట్టం ద్వారా నిర్వహింపబడుతున్నాయి. ఇది గర్భధారణ సమయంలో, తరువాత పని చేసే మహిళలకు కొన్ని రక్షణలు, ప్రయోజనాలను నిర్ధారిస్తుంది . ఈ చట్టం వేతనంతో కూడిన సెలవు, తొలగింపు నుండి రక్షణ, ప్రసవానికి సంబంధించిన ఇతర ప్రయోజనాలను అందిస్తుంది. సెలవు తర్వాత వారు అదే లేదా సమానమైన స్థానానికి తిరిగి రావడానికి హామీ ఇస్తుంది.



**తీర్పు ప్రభావాలు:**

ఈ తీర్పు భారతదేశంలో ఆర్థిక మాతృత్వ హక్కుల స్వరూపంపై లోతైన, తక్షణ ప్రభావాలను చూపుతుంది.

**ప్రభుత్వ ఉద్యోగులకు విస్తృత అర్హత:**

" ఇద్దరు పిల్లల నిబంధన" లేదా ఇలాంటి ఆంక్షల వల్ల గతంలో పరిమితులు ఎదుర్కొన్న ప్రభుత్వ ఉద్యోగినులపై దీని ప్రభావం చాలా ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ తీర్పు ఇప్పుడు వారికి జీవించి ఉన్న పిల్లల సంఖ్య లేదా వైవాహిక సందర్భంతో సంబంధం లేకుండా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అనుమతిస్తుంది. వారి జీవితంలో కీలకమైన సమయంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.

**పునరుత్పత్తి హక్కులకు పటిష్టత:**

ఈ తీర్పు ప్రసూతి ప్రయోజనాలను కేవలం సేవా నిబంధన నుండి ఒక మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛ యొక్క ప్రాథమిక అంశంగా ఉన్నతీకరించింది. అధికరణలు 14 (చట్టం ముందు సమానత్వం) మరియు 21 (జీవించే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛ)తో దీనిని అనుసంధానించడం ద్వారా కోర్టు మాతృత్వ అర్హతలకు బలమైన రాజ్యాంగ ఆధారాలను అందించింది.

**విస్తృత అనువర్తనానికి పూర్వనిర్ణయం:**

ఈ నిర్దిష్ట కేసు ప్రభుత్వ ఉద్యోగినికి సంబంధించినది అయినప్పటికీ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన బలమైన రాజ్యాంగ సూత్రాలు ఇతర రంగాలలో, ప్రైవేట్ రంగంతో సహా ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను సవాలు చేయడానికి గణనీయమైన పూర్వనిర్ణయంగా ఉపయోగపడతాయి. పిల్లల సంఖ్య ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేయడానికి ప్రయత్నించే ఏ సంస్థ అయినా ఇప్పుడు గణనీయమైన చట్టపరమైన సవాలును ఎదుర్కొంటుంది.

**కార్యశక్తిలో లింగ సమానత్వాన్ని పెంపొందించడం:**

కుటుంబ పరిమాణం ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను నిరాకరించడం తరచుగా మహిళలను, ముఖ్యంగా పునర్వివాహం చేసుకున్న లేదా వివిధ కారణాల వల్ల ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న వారిని అసమానంగా ప్రభావితం చేస్తుంది. ఈ తీర్పు ఒక కీలకమైన అడ్డంకిని తొలగించి ఉద్యోగంలో ఎక్కువ లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంద. తల్లులుగా తమ పాత్రలను నిర్వర్తించినందుకు మహిళలు శిక్షించబడకుండా చూస్తుంది.

**విధాన సమీక్షకు పిలుపు:**

ఈ తీర్పు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, అలాగే ప్రైవేట్ సంస్థలకు, సుప్రీంకోర్టు తీసుకున్న ప్రగతిశీల వైఖరికి అనుగుణంగా వారి ప్రస్తుత ప్రసూతి సెలవు విధానాలను సమీక్షించి, సవరించాల్సిన అవసరాన్ని ప్రభావవంతంగా సూచిస్తుంది. పిల్లల సంఖ్య ఆధారంగా వివక్ష చూపించే విధానాలు ఇప్పుడు రాజ్యాంగపరంగా దుర్బలమైనవి.

సవాళ్లు:అయితే సవాళ్లు ఇంకా ఉన్నాయి. ఈ తీర్పు శ్రామిక శక్తిలో ఒక వర్గం కోసం ఒక కీలకమైన వివక్షాపూరిత అంశాన్ని అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలకు ఆర్థిక మాతృత్వ హక్కుల విస్తృత సమస్య ఇలాంటి తీర్పుల ద్వారా ఎక్కువగా పరిష్కరించబడ ˇలేదు. భారతదేశంలో మహిళా శ్రామిక శక్తిలో ఎక్కువ మందిని కలిగి ఉన్న ఈ మహిళలకు అధికారిక యజమాని ఉద్యోగి సంబంధాలు లేవు, తత్ఫలితంగా, చెల్లింపు ప్రసూతి సెలవు, వైద్య బోనస్‌లు లేదా క్రెచె సౌకర్యాలు వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలకు ప్రాప్యత లేదు. గర్భధారణ సమయంలో వారి దుర్బలత్వం తరచుగా వారిని ముందస్తుగా పనికి తిరిగి రావడానికి లేదా మరింత పేదరికంలోకి నెట్టడానికి బలవంతం చేస్తుంది.మే 23, 2025 నాటి ఈ తీర్పు మహిళల హక్కులను మాతృత్వం ఉద్యోగానికి అడ్డంకి కాకూడదని లేదా ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదని ధృవీకరిస్తుంది. ఇది ఆశకు ఒక మార్గదర్శిగా పనిచేస్తుంది. ప్రసూతి ప్రయోజనాల రక్షణ గొడుగును విస్తరిస్తుంది. భారతదేశానికి తదుపరి కీలకమైన చర్య ఏమిటంటే, ఈ ప్రగతిశీల తీర్పు స్ఫూర్తిని ఉపయోగించుకుని, మరింత సమ్మిళిత, సార్వత్రిక సామాజిక భద్రతా చట్రాలను రూపొందించడం, తద్వారా ఆర్థిక మాతృత్వ సహాయాన్ని అన్ని మహిళలకు విస్తరించడం, ప్రతి తల్లి, ఆమె పని రంగంతో సంబంధం లేకుండా, గౌరవంతో, ఆర్థిక భద్రతతో మాతృత్వాన్ని స్వీకరించగలదని నిర్ధారించడం. ఈ తీర్పు రాజ్యాంగపరమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందిబీ ఇప్పుడు, శాసన, విధానపరమైన విభాగాలు దేశంలోని ప్రతి మహిళకు సమగ్ర ఆర్థిక మాతృత్వ హక్కులను వాస్తవం చేయడానికి అనుసరించాలి.

జనక మోహన రావు దుంగ
8247045230

భక్తి

## బ్రాహ్మీ ముహూర్తం అంటే



'బ్రాహ్మీ ముహూర్తం' అనే మాట మనం వింటూనే ఉంటాం. అది తెల్లవారుజాము సమయం అని అందరికీ తెలుసు. కానీ సరైన సమయం మాత్రం చాలామందికి తెలియదు. అలాగే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలని, పూజ చేయాలని, పిల్లలు చదువుకోవాలని ఎందుకు సూచిస్తారో తెలుసుకుందాం. సూర్యోదయానికి ముందున్న 48 నిమిషాల సమయాన్ని 'బ్రాహ్మీముహూర్తం' అంటారు. ఇది పూజలకు, జపాలకు, మంత్రసాధనకు విశిష్టమైనదని పూర్వులు చెప్పారు.

**ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి...**

మన శరీరంలోని జీవక్రియలన్నీ మన లోపల ఉండే జీవ గడియార సమయం ప్రకారం జరుగుతాయి. బ్రాహ్మీ ముహూర్తంలో మేలుకొనేవారికి జీవక్రియ సక్రమంగా సాగుతుంది. ఎందుకంటే ఉదయం వేళ మన శరీరంలో కార్టిసోల్ హార్మోన్ ఎక్కువ మోతాదులో విడుదల అవుతుంది. ఈ హార్మోన్ మనలోని ఒత్తిడిని తగ్గించి, జ్ఞాపకశక్తిపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. అందుకే విద్యార్థులు ఆ సమయంలో చదువుకుంటే బాగా గుర్తుంటుందని, వారి జ్ఞాపకశక్తి పెరుగుతుందని విశ్వాసం ఉంది. అలాగే ఆ సమయంలో పరిసరాలు నిశ్శబ్దంగా ఉంటాయి. కాబట్టి చదివినది నేరుగా మెదడులో నిక్షిప్తం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాత్రి తొందరగా నిద్రపోయి, సూర్యోదయానికి ముందే లేచేవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా రావంటోంది ఆయుర్వేదం. రాత్రంతా చెట్లు విడుదల చేసిన ఆక్సిజన్... వేకువ జామున కాలుష్యం బారిన పడకుండా ఎక్కువ పరిమాణంలో మనకు అందుబాటులో ఉండేది బ్రాహ్మీ[illegible] సమయంలోనే. ఉదయం నడకకు వెళ్ళేవారికి ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. ప్రతిరోజూ సూర్యోదయాన్ని చూసే అలవాటు ఉన్నవారి గుండె, మెదడు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటాయి. లేలేత సూర్యకిరణాలు మనపైన ప్రసరించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. సూర్యరశ్మిలో ఉండే 'విటమిన్-డి' మన ఎముకలు బలంగా ఉండడానికి దోహదం చేస్తుంది.



## 'భారత్ మళ్లీ అంతరిక్షంలోకి వస్తోంది.. జై హింద్' రోదసి యాత్రకు ముందు శుభాన్షు ట్వీట్



**న్యూఢిల్లీ-నవభూమి:** పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసి యాత్ర ఎట్టకేలకు ప్రారంభమైంది. 'యాక్సియం-4' మిషన్‌లో భాగంగా శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమాన ప్రకారం) ఈ ప్రయోగం జరిగింది. 41 ఏళ్ల తర్వాత ప్రైవేట్ రోదసి యాత్ర ద్వారా భారత వ్యోమగామి ఐఎస్ఎస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో రోదసి యాత్రకు వెళ్లే ముందు శుభాన్షు తన ఎక్స్ ఖాతాలో కొన్ని ట్వీట్స్ చేశారు. 'భారతదేశం అంతరిక్షంలోకి తిరిగి వస్తోంది.. జై హింద్', '41 ఏళ్ల తర్వాత.. భారత జెండా మళ్లీ అంతరిక్షంలో ఎగురుతుంది.. జై హింద్' అంటూ ట్వీట్ చేశారు. 'భారత్ మానవ సహిత అంతరిక్ష యాత్ర ప్రారంభమైంది. జై హింద్.. జై భారత్' అని శుభాన్షు పేర్కొన్నారు.యాక్సియం-4' మిషన్‌లో భాగంగా శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరి వెళ్లారు. వీరు ప్రయాణిస్తున్న ఫాల్కన్-9 రాకెట్ ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:01 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. ఈ వ్యోమనౌక గురువారం సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం కానుంది. 14

## డ్రగ్స్ కేసులో పంజాబ్ మాజీ మంత్రి అరెస్ట్..!



అమృత్‌సర్-నవభూమి: పంజాబ్ రాష్ట్రానికి సంబంధించిన 2021 నాటి డ్రగ్స్ కేసు లో శిరోమణి అకాలీదళ్ సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియా అరెస్టయినట్లు తెలుస్తోంది. ఇవాళ (బుధవారం) తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు అమృత్‌సర్ లోని మజీతియా నివాసంలో ఆకస్మిక సోదాలు చేశారు.విక్రమ్ మజీతియా శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సొంత బావ. ఆయన గతంలో పంజాబ్ రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య గనీవే కౌర్ మజీతియా ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 నాటి డ్రగ్స్ కేసులో విక్రమ్ మజీతియా నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్.. మజీతియాకు, ఆయన కుటుంబానికి సంబంధించిన కంపెనీల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది.ఈ క్రమంలో ఇవాళ విజిలెన్స్ బ్యూరో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మజీతియా ఇంటిపైకి రైడింగ్‌కు రావడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ సందర్భంగా మజీతియా, మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కేసులో ఎవరినైనా అరెస్ట్ చేశారా..? అన్న ప్రశ్నకు అమృత్‌సర్ ఆర్పీఎస్ సంధూ అవునని చెప్పారు. అరెస్టయిన వాళ్లను ఇక్కడ నుంచి తీసుకెళ్లామని తెలిపారు. ప్రస్తుతం ఇంట్లో సోదాలు జరుగుతున్నాయని అన్నారు.

## దేశంలో గత పదకొండేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ : సంజయ్ రౌత్



**అమృత్‌సర్-నవభూమి:** దేశంలో గడిచిన పదకొండేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని, నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడంలో తప్పులేదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. అప్పట్లో రాజ్యాంగాన్ని పూర్తిగా గౌరవిస్తూనే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ అనేది కూడా ఒక రాజ్యాంగబద్ధమైన చర్యనేనని, కాబట్టి బీజేపీ చెబుతున్నట్టుగా ఎమర్జెన్సీని 'సంవిధాన్ హత్యా దివస్' పరిగణించలేమని రౌత్ చెప్పారు. ఇందిరాగాంధీ తలుచుకుంటే మాయ చేసి, డబ్బులు పంచి ఎన్నికల్లో గెలిచేదని, కానీ ఆమె అలా చేయలేదని అన్నారు. ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా ఉండేవారని చెప్పారు.

## రోదసిలోకి శుభాన్షు శుక్లా.. నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ రాకెట్



**అమృత్‌సర్-నవభూమి:**భారతీయులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసి యాత్ర ఎట్టకేలకు ప్రారంభమైంది. 'యాక్సియం-4' మిషన్‌లో భాగంగా శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరి వెళ్లారు. వీరు ప్రయాణిస్తున్న ఫాల్కన్-9 రాకెట్ ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:01 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. ఈ వ్యోమనౌక గురువారం సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం కానుంది. 14 రోజులపాటూ వ్యోమగాములు అంతరిక్షంలో ఉండనున్నారు. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. ఈ మిషన్‌కు శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తున్నారు.

## రాంగ్ రూట్లో కారు డ్రైవ్ చేస్తూ కల్నల్‌పై దాడి.. పరారీలో పోలీసు ఇన్‌స్పెక్టర్..



**లక్నో-నవభూమి:** యూపీలోని లక్నోలో రాంగ్ రూట్ డ్రైవింగ్ ఘర్షణకు దారి తీసింది. రాంగ్ సైడ్‌లో కారు నడుపుతున్న వ్యక్తి.. ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్‌పై దాడి చేశాడు. అతని చెంప చెల్లు మనిపించాడు. అయితే ఆ దాడి చేసిన వ్యక్తిని ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ సరోజ్‌గా గుర్తించారు. చెంప దెబ్బ తిన్న వ్యక్తి ఆర్మీ కల్నల్ ఆనంద్ ప్రకాశ్ సుమన్. కల్నల్‌పై చేయి చేసుకున్న పోలీసు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. దాడికి చెందిన వీడియో వైరల్ అవుతున్నది.రాంగ్ రూట్లో వచ్చి దాడి చేసిన ఇన్‌స్పెక్టర్‌పై కల్నల్ ఫిర్యాదు చేశాడు. తన భార్య, కుమార్తె ముందే ఆ వ్యక్తి దాడి చేసినట్లు కల్నల్ పేర్కొన్నాడు. రాంగ్ సైడ్‌లో డ్రైవ్ చేస్తున్నందుకు ప్రశ్నించడంతో ఆవేశానికి గురైన ఇన్‌స్పెక్టర్ దాడి చేశాడు. చెంప దెబ్బ తిన్న కల్నల్ ఆనంద్ ప్రస్తుతం పాట్నాలోని ఎన్సీసీ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్నాడు. కారు విండో తీయగానే తిట్టడం మొదలుపెట్టాడని, చెంప దెబ్బ కూడా కొట్టినట్లు ఫిర్యాదులో కల్నల్ తెలిపాడు.అతన్ని ఆపేందుకు కారు దిగి రాగానే, రెండు కార్ల మధ్య తనను నొక్కిపెట్టే ప్రయత్నం చేశాడన్నాడు. ఎడమ కాలు మీద నుంచి కారును తోలుతూ అతను పరారీ అయినట్లు చెప్పాడు. నిందితుడు ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ పరారీలో ఉన్నాడు. అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. కల్నల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు బుక్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు డీసీపీ నిపున్ అగర్వాల్ తెలిపారు.

# ట్రంప్‌నకు కంటిమీద కునుకుపట్టని పని ఇరాన్ చేసేసిందా?



**టెహ్రాన్-నవభూమి:** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు 12వ రోజు చల్లబడిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం మంగళవారం ముగిసింది! ఆపరేషన్ రైజింగ్ లయన్ అంటూ ఇజ్రాయెల్ యుద్ధం మొదలుపెట్టినా, ఆపరేషన్ మిడ్ నైట్ హ్యామర్ అంటూ అమెరికా రంగంలోకి దిగినా.. అందుకు ప్రధాన కారణం ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదనేదే! ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తోందని.. వాటివల్ల తమ అస్తిత్వానికి ముప్పు పొంచి ఉందని.. అందుకే ఆ దేశంలోని అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అణు ఒప్పందాలపై చర్చలు సెట్ కావడం లేదంటూ అమెరికా రంగంలోకి దిగింది. ఈ క్రమంలో ఇప్పటికే ఇరాన్ అణు పరీక్షలు నిర్వహించేసిందనే విషయం తెరపైకి వచ్చింది! ఇరాన్ ఎట్టిపరిస్థితుల్లోనూ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదు అనే లక్ష్యంతో ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించగా, చివర్లో అమెరికా ఓ చెయ్యి వేసి పని పూర్తి చేసిందని చెబుతున్నారు. అయితే... ఇలా ఇజ్రాయెల్ ఒక పక్క, అమెరికా ఓ పక్క దాడులు చేసిన గ్యాప్ లో తాను అనుకున్న పనిని ఇరాన్ పూర్తి చేసిందనే ప్రచారం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ యుద్ధంలోకి అమెరికా ఎంట్రీకి రెండు రోజుల ముందు, గత శుక్రవారం ఉత్తర ఇరాన్ లో 5.1 తీవ్రతతో భూకంపం వచ్చిందనే వార్తలు వెలువడ్డాయి. అయితే.. ఇది నిజంగానే భూకంపమా.. లేక, ఇరాన్ అణుపరీక్షలు నిర్వహించడం వల్ల భూమి లోపల ఏర్పడిన భారీ ప్రకంపనల ప్రభావమా అనే చర్చ ప్రపంచవ్యాప్తంగా నడిచింది. .. హీరో సంచలన వ్యాఖ్యలు అయితే ఆ ప్రచారం ఇప్పుడు అటు అమెరికా, ఇజ్రాయెల్ తో పాటు వీరి మిత్ర దేశాల్ని సైతం కలవరపెడుతున్నాయని అంటున్నారు. తమ దాడులతో ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకున్నామని, అణు స్థావరాల్ని దెబ్బతీశామని, అందువల్ల ఇప్పట్లో ఇరాన్ అణుబాంబు గురించి ఆలోచించడమే కష్టమని అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్ చెప్పుకుంటున్నాయి. సరిగ్గా ఈ సమయంలో... ఇరాన్ లోని సెమ్నాన్ నగరానికి 27 కిలోమీటర్ల దూరంలో అణు పరీక్ష జరిగిందంటూ తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ ఓ షాకింగ్ కథనాన్ని వెల్లడించింది. దీంతో... ఈ అణు పరీక్ష తర్వాతే ఉలిక్కిపడ్డ అమెరికా ఇరాన్ లోని అణు కేంద్రాలపై దాడులకు దిగిందన్న చర్చ మొదలైంది. దీంతో.. ఇప్పుడు ట్రంప్ కో ఇరకాటంలో పడ్డారని అంటున్నారు.

దీనికితోడు... ఈ దాడుల్లో ఇరాన్ కు జరిగిన నష్టం గురించి పెంటగాన్ కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ) ఓ నివేదిక తయారుచేసింది. ఇందులో.. ఆపరేషన్ మిడ్ నైట్ హ్యామర్ అంటూ అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ కు పరిమితమైన నష్టం మాత్రం వాటిల్లిందని తెలిపింది. ఇరాన్ కొన్ని నెలల్లోనే తన కార్యక్రమాలను తిరిగి ప్రారంభించేసుకోవచ్చని తెలిపింది!

## ఈ దాడులు ఇరాన్‌కు జుజుబి... అమెరికా ఇంటెలిజెన్స్ షాకింగ్ రిపోర్ట్!



**ఖతర్-నవభూమి:** పశ్చిమాసియాలో ప్రస్తుతం వాతావరణం కాస్త ప్రశాంతంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం 12వ రోజు శాంతించింది. ఈ యుద్ధంలో తాము విజయం సాధించామని ఇజ్రాయెల్ ప్రకటించుకుంది.. ఖతర్ లో తాము ఎయిర్ బేస్ పై చేసిన దాడులతో వణికిన అమెరికా కాళ్ల బేరానికి వచ్చి, ఇజ్రాయెల్ ను బలవంతంగా సీజ్ ఫైర్ కి ఒప్పించిందని ఇరాన్ చెప్పుకుంది. ఈ యుద్ధంలో ఎవరు గెలిచారు, ఎవరు ఓటమిపాలయ్యారు అనేది కాదు.. ఫైనల్ గా శాంతి గెలిచింది, శాంతి నిలిచింది, అది తనవల్లే సాధ్యమైంది అనేస్థాయిలో ట్రంప్ స్పందిస్తున్నారు. సీజ్ ఫైర్ ఉల్లంఘించినట్లు వార్తలొస్తే బూతులు మాట్లాడుతున్నారు! మరోవైపు... ఆపరేషన్ రైజింగ్ లయన్ లక్ష్యం నెరవేరిందని, ఇరాన్ కు అణ్వాయుధాలు చేసే సామర్థ్యం పోయిందని ఇజ్రాయెల్ చెప్పుకుంది. దీంతో... ఇప్పట్లో ఇరాన్ తేరుకోవడం కష్టమే అని, ఇకపై ఆ దేశం అణ్వాయుధాల తయారీ విషయంలో తొందరపడకపోవచ్చని కథనాలొస్తున్నాయి. అయితే... ఈ యుద్ధంలో ఇరాన్ కు జరిగిన నష్టం జుజుబి అనీ.. అది పెద్ద తీవ్రమైనది కాదని.. మరో కొన్ని నెలల్లో ఇరాన్ విల్ బీ బ్యాక్ అంటున్నాయి నివేదికలు. ఈ విషయం వైరల్ గా మారింది. అవును... ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమెరికా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున ఇరాన్ లోని మూడు అణుకేంద్రాలు లక్ష్యంగా అమెరికా దాడులకు దిగింది. అయితే.. ఈ దాడుల్లో ఇరాన్ కు జరిగిన నష్టం గురించి పెంటగాన్ కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీఐఏ) ఓ నివేదిక తయారుచేసింది. దీంతో... ఈ నివేదికలోని అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఇందులో ప్రధానంగా... ఆపరేషన్ మిడ్ నైట్ హ్యామర్ అంటూ అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ కు పరిమితమైన నష్టం మాత్రం వాటిల్లిందని అందులో తెలిపింది. ఈ నేపథ్యంలో ఇరాన్ కొన్ని నెలల్లోనే తన కార్యక్రమాలను తిరిగి ప్రారంభించేసుకోవచ్చని తెలిపింది! వాస్తవానికి... ఇరాన్ లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అనే అణుకేంద్రాలపై బీ-2 స్పిరిట్ బాంబర్లతో అమెరికా భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఆయా అణుకేంద్రాలు నాశనం అయ్యాయని ట్రంప్ ప్రకటించారు. అయితే, ఇంటెలిజెన్స్ నివేదికలు అందుకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ దాడుల్లో ఫోర్డో, నతాంజ్ లు పూర్తిగా నాశనం కాలేదని నివేదికలో పేర్కొంది.. యురేనియం శుద్ధి చేసేందుకు ఉపయోగించే సెంట్రిఫ్యూజ్ లు వంటి కీలక పరికరాలను ఇరాన్ తిరిగి కొన్ని నెలల్లోనే ప్రారంభించుకోవచ్చని తెలిపింది. దీంతో... ఈ విషయాలపై ట్రంప్ స్పందించారు. అవి పూర్తిగా నకిలీ వార్తలని పేర్కొన్నరు. చరిత్రలో అత్యంత విజయవంతమైన సైనిక దాడుల తీవ్రతను తగ్గించే ప్రయత్నం ఇదని అన్నారు. ఇదే సమయంలో... ఇలాంటి ఆరోపణలతో కూడిన నివేదికలను లీక్ చేయడం అధ్యక్షుడు ట్రంప్ ను కించపరచడమేనని.. 30 వేల పౌండ్లు కలిగిన 14 బాంబులను కచ్చితమైన లక్ష్యాలపై వేస్తే ఎంత నష్టం జరుగుతుందో అందరికీ తెలుసని.. అవన్నీ మొత్తం ధ్వంసం అయ్యాయని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ఆ నాయకుడి వల్లే డ్రగ్స్ అలవాటైంది.. హీరో సంచలన వ్యాఖ్యలు



**చెన్నై-నవభూమి:** మృదువైన పాత్రలతో తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించిన నటుడు శ్రీరామ్ డ్రగ్స్ కేసులో అరెస్ట్ కావడంతో సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. తన డ్రగ్స్ అలవాటుకు కారణం మాజీ ఏఐఏడీఎంకే నేత ప్రసాద్ అని ఆయన కోర్టులో చేసిన వ్యాఖ్యలు ఈ కేసులో మరింత సంచలనం రేపాయి. - కోర్టులో నేరాన్ని అంగీకరించిన శ్రీరామ్ చెన్నై సుంగంబాక్కం పోలీస్ స్టేషన్ పరిధిలో హీరో శ్రీరామ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో ఆయన రెండు సార్లు డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఆయన్ను కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించి పుళల్ జైలుకు తరలించారు. కోర్టులో శ్రీరామ్ తన వాంగ్మూలంలో "డ్రగ్స్ వాడటం నా తప్పు ఒప్పుకుంటున్నాను. కానీ ఈ అలవాటు నాకు ప్రసాద్ వల్లే వచ్చింది. నాకు ఆయన ?10 లక్షలు ఇవ్వాలి. ప్రతిసారి డబ్బు అడిగినప్పుడు డబ్బుకు బదులు కొకైన్ ఇచ్చేవాడు. మొదట నేను నిరాకరించినా క్రమంగా అలవాటు అయిపోయింది. చివరికి నేనే డ్రగ్స్ అడిగే పరిస్థితికి వచ్చాను. నా కొడుకును చూసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. దయచేసి బెయిల్ మంజూరు చేయండి" అని కోరారు. పోలీసుల దర్యాప్తులో మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. శ్రీరామ్‌కు ప్రసాద్ మాధ్యమం ద్వారా డ్రగ్స్ సరఫరా అయ్యేవని, ఈ క్రమంలో ప్రదీప్ అనే వ్యక్తి పేరు బయటపడింది. ప్రదీప్, ప్రసాద్ నుంచి 40 సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రదీప్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, అతని వాంగ్మూలం ఆధారంగా శ్రీరామ్‌ను అరెస్ట్ చేశారు. - సినీ ప్రయాణం.. ఊహించని మలుపు తిరుపతికి చెందిన శ్రీరామ్ "రోజా కూటం" సినిమాతో తమిళంలో అరంగేట్రం చేశారు. ఈ సినిమా తెలుగులో "రోజా పూలు" పేరుతో విడుదలై మంచి పేరు తెచ్చింది. తెలుగులో శ్రీకాంత్ అనే ప్రముఖ నటుడు ఉండటంతో తన అసలుపేరు మార్చుకుని శ్రీరామ్‌గా కొనసాగాడు. "ఆడవారి మాటలకు అర్థాలే వేరులే", "లై", "పోలీస్ పోలీస్", "నిప్పు", "దడ", "రావణాసుర", "పిండం" వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. సినీ పరిశ్రమకు దెబ్బ శ్రీరామ్ డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం తమిళ, తెలుగు పరిశ్రమల్లో కలకలం రేపింది. అందరికీ సౌమ్యుడిగా కనిపించే ఈ నటుడు ఇలాంటి కేసులో చిక్కుకోవడం అభిమానులనే కాక, సహనటులను కూడా దిగ్భ్రాంతికి గురి చేసింది. డ్రగ్స్ వంటి వినాశకరమైన వలలో ఒక ప్రతిభావంతుడైన నటుడు చిక్కుకోవడాన్ని పరిశ్రమలోని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. శ్రీరామ్ అరెస్ట్ కేసు కేవలం ఒక వ్యక్తిగత తప్పే కాదు.. ఇది సినీ రంగంలోకి మత్తు పదార్థాలు ఎలా చొరబడుతున్నాయో తెలిపే ఒక ఘటన.. ఇలాంటి ఘటనలు పరిశ్రమపై నీడ వేయకుండా ఉండాలంటే, కఠిన చట్టాలతో పాటు, ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యత కూడా అవసరం. ఇప్పుడు ఈ కేసులో మరోసారి విచారణ కొనసాగనుండగా, ప్రసాద్‌పైనా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం పోలీసులపై ఉంది.

## ఒంటరి బతుకే బెటర్.. మారుతున్న యువత ధోరణి

**న్యూఢిల్లీ-నవభూమి:** ఒకప్పుడు పెళ్లి అనే వ్యవస్థ జీవితంలో తీరని కర్మలన్నిటికీ ముగింపు. స్థిరత్వానికి ప్రతీకగా భావించబడేది. "ఇల్లు, ఇల్లాలు, పిల్లలు" అనే మూడు మంత్రాల చుట్టూ ఓ జీవితాన్ని అల్లుకునే ప్రయత్నం తల్లిదండ్రులు మాత్రమే కాదు.. యువతలోనూ సహజంగా కనిపించేది. కానీ ఇప్పుడు ఆ దృశ్యాలు మారిపోయాయి. "సోలో బ్రతుకే సో బెటరు" అనే టైటిల్ సినిమాకు మాత్రమే పరిమితమై ఉండకుండా నేటి యువత జీవితానికి మార్గదర్శకంగా మారుతోంది. - పెళ్లి.. ఒక తప్పనిసరి నుంచి ఒక ఎంపికగా భారతీయ సమాజంలో గతంలో పెళ్లి ఒక తప్పనిసరి దశ. 25ఏళ్లు దాటేసరికి "ఏం బాబు, ఇంకా పెళ్లి చేసుకోలేదా?" అనే ప్రశ్నలు వర్షంలా కురవడం సహజం. కానీ ఇప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానంగా చాలా మంది యువత "ఇంకా ఆలోచన లేదు".. "ఫ్రీగా బ్రతకటం బెటర్ అనిపిస్తుంది" అనే అభిప్రాయాలను బహిరంగంగా పంచుకుంటున్నారు. పెళ్లి ఒక "లైఫ్ అచీవ్‌మెంట్" కాదని భావించే మనస్తత్వం విస్తృతమవుతోంది. - గణాంకాలు ఏమంటున్నాయి? అధికారిక లెక్కలు లేకపోయినా.. సామాజిక పరిశీలనల ప్రకారం దేశంలో 25-40 వయస్సు గల యువతలో కనీసం 10-15 శాతం మంది పెళ్లికి దూరంగా ఉన్నారు. మాల్దీవులు, స్వీడన్ లాంటి దేశాల్లో ఇది సహజ ప్రక్రియగా మారింది. సంప్రదాయాల చుట్టూ బతికే భారతదేశంలో ఇది ఓ పెద్ద మార్పే. అంతేకాదు పెద్ద పెద్ద నగరాల్లో అయితే ఈ శాతం 20కి చేరనుంది. ఇది కేవలం నగరాలకు పరిమితం కాదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వ్యవసాయ ఆధారిత జీవితాల్లో పెళ్లి ప్రయత్నాల తీవ్రత తగ్గిపోతుంది. కనీసం ఉద్యోగం లేకుంటే పెళ్లి సాధ్యపడదన్న నమ్మకం ప్రజల్లో విస్తరించింది. పొలం ఉన్నా, భూములు ఉన్నా, వాటికి విలువ లేకపోవడం, ఆర్థిక భద్రతపై పెరిగిన చైతన్యం వల్ల పెళ్లి అనేది గడచిన దశగా మారిపోయింది. పెళ్లికి దూరంగా ఉన్న ప్రధాన కారణాలు ఉద్యోగం లేకపోతే పెళ్లికి ఛాన్స్ లేదన్న భయం యువతలో నెలకొంది. నిరుద్యోగంతో పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులకు భారంగా మారడం అనే ఆలోచన వల్లే కాదు, అమ్మాయిల తల్లిదండ్రులు కూడా వధువు భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ఉద్యోగం లేని వరుడిని కాదనుతున్నారు. పెళ్లి అంటే కట్టుబాట్లు, బాధ్యతలు అనే భావన పెరిగింది. స్వేచ్ఛగా బ్రతకాలని భావించే యువత పెళ్లికి దూరంగా నిలుస్తున్నారు. "నన్ను నేను చూసుకోవడం సులభం, ఇంకొకరిని చూసుకోవడం భారంగా ఉంటుంది" అన్న అభిప్రాయం వేగంగా వ్యాపిస్తోంది. ఈ తరం యువత ప్రేమను తీసుకోవడంలో ఎక్కువ శ్రద్ధ చూపుతూ, ఎప్పుడైనా విడిపోవచ్చు అనే భావనతో రిలేషన్‌షిప్‌లను క్యాజువల్‌గా చూస్తున్నారు. పైగా, పెళ్లికి ముందు మంచి ఉద్యోగం, మంచి ఇల్లు, స్టేటస్, బలమైన ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ వంటివి కావాలని అమ్మాయిలు కోరడం వల్ల చాలామంది కుర్రాళు పెళ్లికి భయపడుతున్నారు. డౌరీ కేసులు, హరాస్‌మెంట్ ఆరోపణలు, సెపరేషన్‌లు, చైల్డ్ కస్టడీ డిస్ప్యూట్లు ఇవన్నీ కలిపి పెళ్లంటే ఇబ్బంది అనే మానసికతను పెంచుతున్నాయి.

## మరోసారి లేఆఫ్స్‌కు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. !




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130కిపైగా కంపెనీలు దాదాపు 61 వేల మందికి పైగా ద్యోగులను తొలగించాయి. ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే.తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సంస్థ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. వచ్చే వారం ప్రారంభంలో లేఆఫ్స్ గురించి సంస్థ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. వేలాది మందిపై ఈ ప్రభావం ఉండనున్నట్లు సమాచారం. తాజా లేఆఫ్సలు విభాగంలో ఉండనున్నట్లు సమాచారం. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. వరుస లేఆఫ్స్‌తో సంస్థలోని ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

## తావి నదిలో చిక్కుకుపోయిన వ్యక్తి.. షాకింగ్ వీడియో



**జమ్మూ-నవభూమి:** జమ్ము కశ్మీర్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ప్రధాన నదుల్లో నీటి మట్టం పెరిగింది. పలు నదులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. తాజాగా జమ్ములోని తావి నది లో ఓ వ్యక్తి చిక్కుకుపోయాడు.భారీ వర్షాల కారణంగా ప్రస్తుతం తావి నది ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నదిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఓ వ్యక్తి నది మధ్యలో ప్రమాదవశాత్తూ చిక్కుకుపోయాడు. నదిలోని ఓ వంతెన వద్ద చిక్కుకుపోయాడు. సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. నది ఒడ్డున ఉన్న స్థానికులు ఆ వ్యక్తిని గుర్తించి సాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, నదిలో నీటి ప్రవాహం పెరుగుతుండటంతో వీలు పడట్లేదు. దీంతో వారు సహాయ బృందాలకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నిచ్చెన సాయంతో నీటి మధ్యలో చిక్కుకుపోయిన వ్యక్తిని సురక్షితంగా రక్షించారు. వ్యక్తి నది మధ్యలో చిక్కుకుపోయిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## కాంగ్రెస్ నేత సంచలన కామెంట్స్.. ఉచితం.. సముచితం కాదు

**బెంగళూరు-నవభూమి:** ఉచితాలు సమంజసం కాదని, శక్తి గ్యారెంటీతో బస్సుల్లో పురుషులకు సీట్లు ఉండడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్వీ దేశ్‌పాండే వ్యాఖ్యలు సర్వత్రా సంచలనానికి దారితీశాయి. ఇటీవలే ప్రభుత్వంపై సొంతపార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు బీఆర్ పాటిల్, రాజుకాగె, ఎన్వై గోపాలకృష్ణ అసంతృప్తి వ్యక్తం చేసిన తరుణంలోనే ఆర్వీ దేశ్‌పాండే వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. పేరొందినవారే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విమర్శలకు కారణమవుతోంది. మహిళలు శక్తి గ్యారెంటీ ఉందని అడ్డూ అదుపులేకుండా ప్రయాణిస్తున్నారని బస్సుల్లో మగవాళ్లు కూర్చుని ప్రయాణించే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు.



## ఉప్పుతో ఇలా

మనం సాధారణంగా ఉప్పుని రుచి కోసం వాడుతూ ఉంటాం. ఉప్పులేని వంటను ఊహించలేం కూడా! అలాంటి ఉప్పుని రకరకాలుగా వినియోగిస్తూ ఇంట్లో శుచి శుభ్రతలను పెంచుకోవచ్చు.బకెట్ నీళ్లలో చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని ఇల్లంతా చల్లి తడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే ఇంట్లోకి క్రిమి కీటకాలు రావు. తలుపులు మూసి ఉంచడం వల్ల గదుల్లో నిండే వాసనలు తొలగిపోయి ఇల్లు తాజాగా ఉంటుంది. ఒక చిన్న గిన్నె నిండా ఉప్పు నింపి దాన్ని ఒక మూలగా పెడితే బాత్‌రూమ్‌లో హానికారక బ్యాక్టీరియాలు నశిస్తాయి.ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి, మాంసం, చేపలు తదితరాలను శుభ్రం చేసి ముక్కలుగా తరిగినప్పుడు వాటి వాసనలు చేతులకు పట్టేస్తూ ఉంటాయి. అలాంటప్పుడు చేతులను ముందుగా నీళ్లతో తడపాలి. తరవాత అరచేతిలో కొద్దిగా కల్లుప్పు తీసుకుని రెండు చేతులనూ ఒకదానితో మరోదాన్ని రుద్దుకోవాలి. రెండు నిమిషాల తరవాత మంచినీళ్లతో కడిగేసుకుంటే వాసనలు పూర్తిగా పోతాయి.వంటగదిలో ఉండే సింక్‌లో కొద్దిగా రాళ్లఉప్పు చల్లి బ్రష్‌తో గట్టిగా రుద్దాలి. తరవాత మంచినీళ్లు పోసి కడగాలి. రెండు రోజులకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే సింక్ శుభ్రంగా ఉంటుంది. స్టీల్, గ్రానైట్, సిమెంట్ సింక్‌లకు ఈ పద్ధతి బాగా పనిచేస్తుంది.



# నెయ్యితో నిగారింపు!



నెయ్యిని కొందరు ఇష్టంగా తింటారు. కొందరు మాత్రం అసలు ఇష్టపడరు. అయితే నెయ్యితో కలిగే బ్యూటీ బెనిఫిట్స్ గురించి తెలిస్తే మీ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. అవేమిటంటే..పొడి చర్మం చాలా మందిని ఇబ్బంది పెడుతుంది. సీజన్‌తో సంబంధం లేకుండా డ్రై స్కిన్‌తో సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. అటువంటి వాళ్లు కొన్ని చుక్కల నెయ్యిని చర్మంపై రాసుకుని కాసేపు సాజ్ చేసి వదిలేయాలి. ఇలా రోజూ చేయడం వల్ల పొడి చర్మం సమస్య దూరమవుతుంది. చర్మం మృదువుగా తయారవుతుంది.

నెయ్యిని ఆహారంతోపాటు తీసుకుంటే చర్మం యవ్వనంగా కనిపించ డానికి సహాయపడు తుంది.

నెయ్యిలో ఉండే విటమిన్–ఇ వయసు పైబడిన లక్షణాలను దరిచేర కుండా చూస్తుంది. అంతేకాదు చర్మం ముడతలు పడకుండా ఉండడం లోనూ నెయ్యి తోడ్పడు తుంది.బాత్ ఆయిల్‌గానూ నెయ్యిని ఉపయోగించవచ్చు.

5 టేబుల్‌స్పూన్ల నెయ్యి తీసుకుని అందులో పది చుక్కలు మీకిష్టమైన ఎసెన్షియల్ ఆయిల్ వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమం కొన్ని చుక్కలు స్నానం చేసిన తరువాత ఒంటికి రాసుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది.కళ్లు అలసటగా ఉంటే కొన్ని చుక్కల నెయ్యిని కళ్ల చుట్టూ రాసుకుని నెమ్మదిగా మసాజ్ చేస్తే ఉపశమనం లభిస్తుంది. నెయ్యిని పెదాలకు రాసుకుంటే మృదువుగా తయారవుతాయి.

## ఆమ్ కీ ఖీర్



**కావల్సినవి:**బాస్మతీ బియ్యం – కప్పు (గంట ముందు నానబెట్టుకోవాలి),చక్కెర – ఒకటిన్నర కప్పు, పాలు – రెండులీటర్లు, మామిడిపండ్లు పెద్దవి – నాలుగు,గులాబీనీరు – రెండు చుక్కలు,బాదం, పిస్తా పలుకులు – రెండూ కలిపి పావుకప్పు, కోవా – అరకప్పు.

**తయారీ:** మామిడిపండ్ల చెక్కు తీసి ముక్కల్లా కోసి పెట్టుకోవాలి. అలాగే నానిన బియ్యాన్ని మిక్సీ జారులోకి తీసుకుని మెత్తని పిండిలా చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు పాలను వేడిచేసి అందులో బియ్యప్పిండి వేసి మంట తగ్గించాలి. కాసేపటికి అది ఉడుకుతుంది. అప్పుడు చక్కెరా, కోవా వేసి బాగా కలపాలి. ఇది చిక్కగా అయ్యాక మందుగా కోసి పెట్టుకున్న మామిడిపండు ముక్కలూ, గులాబీనీరూ వేసి కలిపి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి. చివరగా బాదం, పిస్తా పలుకులు వేసి వేడి చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది చల్లగా తీసుకుంటేనే బాగుంటుంది.

## యాపిల్ మిల్క్‌షేక్



**కావల్సినవి:** యాపిల్ ముక్కలు – పెద్ద కప్పు, గింజల్లేని ఖర్జూరాలు – మూడు (సన్నగా తరగాలి), తేనె – పావుకప్పు, చల్లటి పాలు – ఒకటిన్నర కప్పు.

తయారీ: యాపిల్, ఖర్జూర ముక్కలు, పెద్ద చెంచా తేనె, అరకప్పు పాలు తీసుకుని మిక్సీలో మెత్తగా చేసుకోవాలి. యాపిల్ ముక్కలు ముద్దగా అయ్యాక మిగిలిన పాలూ, తేనె వేసి మరోసారి మిక్సీ పట్టాలి. చివరగా గ్లాసుల్లోకి తీసుకుని నాలుగు ఐసుముక్కలు వేసుకుంటే చాలు. చల్లచల్లటి యాపిల్ మిల్క్‌షేక్ తయారైనట్లే.



సాధారణంగా సోషల్ మీడియా అంటే వినోదానికి మాత్రమే వేదిక అన్న అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ కొన్ని అరుదైన గళాలు, వాటి వెనుక ఉన్న బాధ్యతతో కూడిన ఆశయాలు ఈ వేదికల పరిమితిని ధిక్కరించగలవు. అలాంటి వారిలో కావ్యా కర్ణాటక్ ఒకరు. సెల్‌ఫోన్ చేతిలో పట్టుకుని సామాజిక సమస్యలను అత్యంత బాధ్యతతో పరిశీలిస్తూ, తన

# సోషల్ మీడియా-నిర్లక్ష్యాన్ని ఛేదించే ఆయుధం

**గళాన్ని లక్షల మందికి వినిపించే సామర్థ్యాన్ని సాధించింది ఈ యువతి. ఆమె కథ కేవలం ఒక క్రియేటర్ కథ కాదు - అది కొత్త తరాల నిబద్ధతకు దర్పణం.**





ఢిల్లీలోని 'లేడీ శ్రీరామ్ కాలేజీ'లో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత కావ్యా, ముంబయిలోని 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్'లో మాస్టర్స్ చదవాలనే తపనతో పయనించింది. అక్కడ చదివే రోజుల్లోనే ఆమెను చైతన్యం కలిగించిన అనుభవం దేవ్‌నార్ డంపింగ్ యార్డ్. ఆసియాలోనే అతిపెద్ద చెత్త డంపింగ్ ప్రాంతం. చెత్తపైనే ఇంట్లు, వాటి మధ్యనే మురుగు కాలువలు – అవి చూపిన దారుణ స్థితిని మానవతా దృష్టితో అర్థం చేసుకుంది కావ్యా. కొద్ది నిమిషాలు అక్కడ ఉండలేనంత దుర్గంధం, దయనీయ స్థితిలో జీవిస్తున్న ప్రజల జీవన పోరాటం ఆమెను ఆంతరంగికంగా కదిలించింది.మాస్టర్స్ పూర్తయ్యాక ఢిల్లీకి తిరిగొచ్చినా, ఆమె ఆలోచనలు మాత్రం దేవ్‌నార్ చుట్టూ తిరిగేవే. ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'ఏ%ఎన్.ఎతీమ్ఖవ%' ద్వారా మొదట తన అభిప్రాయాలు, పరిశీలనలు తెలియజేస్తూ ప్రారంభించింది. కానీ ఒక పావుగంట వీడియోతో ఏం మారుతుంది అన్న ఆలోచనతో, పెద్ద ప్రాజెక్ట్‌లా చూసింది ఆ అంశాన్ని. అక్కడి జీవనవాతావరణం, ఆరోగ్య సమస్యలు, పాలకుల నిర్లక్ష్యం %–% అన్నీ కలిపి ఒక సిరీస్ కంటెంట్‌గా రూపొందించింది. ఆ వీడియోలకు పది లక్షలకుపైగా వ్యూస్ రావడం ఆమెకి ఆశ్చర్యం కాకపోయినా, ప్రజల స్పందన ఆమెను కొత్త దిశగా నడిపింది. సామాజిక అంశాలపై సోషల్ మీడియా ద్వారానే స్పందించగలమని ఆమె నమ్మింది.వీడియో ప్రొడ్యూసర్‌గా ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే ఈ సిరీస్‌ను రూపొందించింది కావ్యా.

ఆడపిల్లల విద్య హక్కు, మతాల పేరుతో జరుగుతున్న మానవ హింస ఇవన్నీ ఆమె కంటెంట్‌లో ప్రాధాన్యత పొందిన అంశాలు. ఆమె కథనం వినోదానికి ప్రత్యామ్నాయంగా ఆవేశానికి తాత్కాలికతకు భిన్నంగా ఒక నిజమైన, నిర్భయమైన గళంగా ఎదిగింది. ఆమె ప్రయత్నాల మూలంగా యువతలో సామాజిక స్పృహ పెరుగుతున్నట్టు కొందరు నిపుణులు అభిప్రాయపడుతు న్నారు. కావ్యా కర్ణాటక్ కథనం ఈ తరం యువతకు ఒక స్పష్టమైన సందేశం. మార్పు కోసం ఎదురుచూడొద్దు. మనమే మొదలుకావాలి. అది చిన్న వీడియో అయినా, అక్షరంగా రాసిన ఒక మెసేజ్ అయినా ప్రభావాన్ని చూపగలదు. ఆమె చూపించింది నిజం... నిర్భయంగా నిలబడగల ధైర్యమే మార్పుకు మార్గం.

మాస్టర్స్ తరువాత ఓ కంపెనీలో వీడియో ప్రొడ్యూసర్‌గా చేసేదాన్ని. ఉద్యోగం చేస్తూనే దేవ్‌నార్ వీడియో తీశాను. అనూహ్య స్పందన రావడంతో ఇక పూర్తి సమయం ఇలాంటి సామాజిక అంశాలపైనే కేటాయించాలని నిర్ణయించుకున్నాను. ఉద్యోగం మానేశాను. రెండున్నరేళ్ల కిందట 'కేకే క్రియేట్' పేరిట సొంతంగా చిన్నపాటి కంపెనీ ఒకటి

కానీ, ఉద్యోగాన్ని వదిలి పూర్తిస్థాయిలో సామాజిక కంటెంట్‌పైనే కేంద్రీకరించాలనే నిర్ణయం తీసుకుంది. సొంతంగా 'కేకే క్రియేట్' అనే సంస్థను స్థాపించి, పదహారు వేల రూపాయల ఫోన్, నలభై రూపాయల గ్రీన్‌స్క్రీన్, మూడు నెలల జీతంతో ప్రారంభించింది తన ప్రయాణం. ఆరంభంలో ఎన్నో సవాళ్లు ఎదురైనా, సమాజం పట్ల తన బాధ్యతను ఆమె మరచిపోలేదు. ప్రతికూలతలతో పోరాడుతూ, వీడియోల సిరీస్‌లు రూపొందిస్తూ, సామాజిక సమస్యలను విభిన్న కోణాల్లో విశ్లేషిస్తూ ముందుకెళ్లింది.

దేవ్‌నార్ డంపింగ్ యార్డ్ పరిసరాల్లో ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై ఆమె చేసిన డాక్యుమెంటరీ ఆధారంగా స్థానికులు కొంతమంది తమ పిల్లల్ని అక్కడి నుంచి తరలించడం మొదలుపెట్టారు. ఆరోగ్య శాఖ అధికారులు ఒకసారి పరిశీలనకు వచ్చారని సమాచారం కూడా వెలువడింది. అంటే, ఆమె కంటెంట్ నిజంగా మార్పును నెమ్మదిగా ప్రారంభించింది.

కేవలం దేవ్‌నార్ కాదు అనేక ఇతర అంశాలు కూడా ఆమె వీడియోల్లో చర్చకు వస్తున్నాయి. ఢిల్లీలోని వీధి చిన్నారుల జీవితం,

ప్రారంభించాను. అందుకోసం దాచుకున్న డబ్బు ఖర్చు పెట్టాను. ఆరంభంలో ఎన్నో సవాళ్లు. ఉద్యోగం వదిలేసే నాటికి నా చేతిలో ఉన్నది పదహారు వేల మొబైల్ ఫోన్, నలభై రూపాయల గ్రీన్ స్క్రీన్, మూడు నెలల జీతం. కానీ ధైర్యం చేశాను. దేవ్‌నార్ ప్రాంతం సిరీస్‌కు అన్ని వర్గాల నుంచీ స్పందన, అభినందనలు అందాయి. అవి నాకు మరింత ప్రేరణనిచ్చాయి.

## రోజ్ క్రీమ్



ఒక కప్పు పన్నీరు, టీ స్పూన్ బోరాక్స్, టీ స్పూన్ లెనోలిన్, పదిహేను చుక్కల రోజ్‌పెటల్ ఎక్స్‌ట్రాక్ట్, ఆరు చుక్కల ఆల్మండ్ ఆయిల్, పావు టీ స్పూన్ తేనెమైనం, ఇరవై చుక్కల రోజ్ ఆయిల్ తీసుకోవాలి. ముందుగా పన్నీటిలో బోరాక్స్ వేసి పక్కన ఉంచాలి. తేనెమైనం, లెనోలిన్‌లను ఒక పాత్రలో వేయాలి. దీనిని నేరుగా మంట మీద పెట్టి కరిగించకూడదు. వెడల్పుగా ఉన్న పాత్రలో నీటిని పోసి మరిగించి అందులో తేనెమైనం, లెనోలిన్ ఉన్న పాత్రను పెట్టి కరిగేవరకు ఉంచాలి. ఈ మిశ్రమం కరిగితే చాలు మరగకూడదు. దించిన వెంటనే ఇందులో ఆల్మండ్ ఆయిల్ వేసి కలపాలి. ఇప్పుడు బోరాక్స్ కలిపిన పన్నీటి మిశ్రమాన్ని, రోజ్‌పెటల్స్ ఎక్స్‌ట్రాక్ట్ వేసి చల్లబడే వరకు చిలకాలి. చివరగా రోజ్ ఆయిల్ వేసి కలపాలి.

ఇలా తయారుచేసుకున్న రోజ్ క్రీమ్‌ను తడిలేని బాటిల్‌లో నిల్వ చేసుకుని రోజూ వాడవచ్చు. ముఖం, మెడ, చేతులకు, పాదాలకు కూడా వాడవచ్చు. దీనిని రాసిన వెంటనే చర్మంలోకి ఇంకదు. కాబట్టి వేళ్లతో వలయాకారంగా (స్ట్రోక్స్ ఇస్తూ మర్దన చేస్తే ఒక్క నిమిషంలోనే చర్మానికి పడుతుంది. మెడకు రాసిన తర్వాత నెమ్మదిగా మెడను అటూ, ఇటూ ఒకసారి, వలయాకారంగా ఒకసారి తిప్పితే నెక్ ఎక్సర్‌సైజ్ కూడా పూర్తవుతుంది.

దీనిని రోజూ వాడడం వల్ల చర్మానికి గులాబీ ప్యాక్‌లతో కలిగే ప్రయోజనాలన్నీ ఒనగూరతాయి. మాయిశ్చరైజర్‌గా, ఫేస్‌లైన్ రిమూవర్‌గా, ముడతల నివారిణిగానూ పనిచేస్తుంది. దీని గులాబీ పెర్‌ఫ్యూమ్ రోజంతా ఆహ్లాదంగా ఉంచుతుంది.

# పనీర్ ప్రయోజనాలెన్నో



మనం తరచూ వంటల్లో ఉపయోగించే పనీర్‌లో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయం టున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...

పనీర్‌లో అధిక మొత్తంలో ప్రొటీన్ ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రించి బరువు పెరగకుండా తోడ్పడుతుంది. కండర పుష్టికి కూడా సహాయపడుతుంది.

ఇందులో కాల్షియం, ఫాస్పరస్‌లు దంతాలు, ఎముకలను బలంగా ఉంచడంలో తోడ్పడతాయి.

ఒమేగా 3, ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు రుమటాయిడ్, ఆర్థరైటిస్ వంటి ఎముక సంబంధిత సమస్యల బారి నుంచి కాపాడతాయి.

కొవ్వులు, ప్రోటీన్లు పనీర్‌లో సమృద్ధిగా ఉంటాయి. దాంతో త్వరగా అలసట దరిచేరదు.

పనీర్ జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి తోడ్పడుతుంది. దీనిలోని విటమిన్ బి 12 మెటబాలిజంను మెరుగుపరుస్తుంది.

పనీర్‌లోని అమైనో ఆమ్లాలు శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తికి తోడ్పడతాయి. దాంతో రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

పనీర్ అనే పదం వినగానే నోరూరించే వంటకాలు గుర్తొస్తాయి. కానీ ఈ రుచికరమైన ఆహారం ఆరోగ్యానికి కూడా ఎన్నో విధాలుగా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. సాదా రుచికి పెట్టింది పేరు అయినా, పనీర్‌లో దాగి ఉన్న పోషకాల విలువ గురించి ఎంతో మందికి తెలియదు.పనీర్‌లో అధికంగా ఉండే ప్రొటీన్ శరీరానికి కావలసిన శక్తిని అందించడమే కాదు, ఆకలిని నియంత్రించి బరువు పెరగకుండా కూడా సహాయపడుతుంది. దీని వల్ల జిమ్ వెళ్లే వాళ్లకు ఇది ఆహార పట్టికలో తప్పనిసరిగా చేరుతుంది. అలాగే, పనీర్‌లో ఉండే కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఎముకలను బలంగా ఉంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

ఇందులో ఉండే ఒమేగా–3, ఒమేగా–6 కొవ్వు ఆమ్లాలు రుమటాయిడ్ మరియు ఆర్థరైటిస్ వంటి ఎముకల సమస్యల నుంచి రక్షణనిచ్చే గుణం కలిగి ఉంటాయి. పనీర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలోనూ సహాయపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ బి12 శరీరంలోని మెటబాలిజం ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. ఇంకా ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఏమంటే, పనీర్‌లోని కొన్ని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచడంలో సహకరిస్తాయి. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో చిన్న మోతాదుల్లో పనీర్‌ను చేర్చుకుంటే, ఆరోగ్యపరంగా మంచి లాభాలే పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. రుచి ఆరోగ్యం రెండింటికీ సమతుల్యం కావాలనుకునే వారికి పనీర్ అత్యుత్తమ ఎంపిక.

పైగా, సమృద్ధిగా ఉండే కొవ్వులు మరియు ప్రొటీన్‌ల వల్ల అలసట త్వరగా రాదు. ఇది రోజంతా చురుకుగా ఉండేందుకు తోడ్పడుతుంది.

## షుగర్ ఉన్నవారికి దివ్య ఔషధం



అరటి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. ప్రత్యేకంగా వీటికి ఒక సీజన్ అంటూ ఏమీ ఉండదు. అనారోగ్యంగా ఉన్నవారు చాలా మంది అరటి పండ్లను శక్తి కోసం తింటారు. దీంతో రోగం నుంచి త్వరగా కోలుకోవచ్చని భావిస్తారు. అరటి పండ్లను తినడం వల్ల శక్తి లభించడమే కాక పోషకాలు కూడా అందుతాయి. క్రీడాకారులు సైతం తక్షణ శక్తి కోసం అరటి పండ్లను తింటుంటారు. అయితే మనకు సాధారణంగా లభించేవి పసుపు రంగులో ఉండే అరటి పండ్లు. కానీ ఈ పండ్లలోనూ అనేక రకాల వెరైటీలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో ఒక రకమే ఎరుగు రంగు అరటి పండ్లు. ఇవి కూడా మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అయితే ఎరుపు రంగు అరటి పండ్లను తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి, పసుపు రంగు పండ్లకు, వీటికి తేడా ఏమిటి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

ఎరుపు రంగు అరటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో కెరోటినాయిడ్స్, ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందువల్లే ఈ అరటి పండ్ల తొక్క ఎరుపు రంగులో ఉంటుంది. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల వీటి తొక్కకు ఎరుపు రంగు ఉంటుంది. అందువల్ల ఎరుపు రంగు అరటి పండ్లను తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి, అంతర్గత వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె జబ్బులు, ఇతర ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఎరుపు రంగు అరటి పండ్లలో విటమిన్ సి కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది.

## బాదం ఎలా తింటే మంచిది?



ఈ మధ్యకాలంలో తృణ ధాన్యాలు, నట్స్ , డ్రైఫ్రూట్స్ వినియోగం బాగా పెరిగింది. ఒకపుడు ఖరీదైనవి మనకెందుకులే అని వదిలేసిన సామాన్యులు కూడా వాటిపై అవగాహన పెంచుకుంటున్నారు. పోషకాహారం లేక వ్యాధుల బారినపడే కంటే ముందే జాగ్రత్త పడాలని భావిస్తున్నారు. అలాంటి వాటిలో ఒకటి బాదాం. మరి బాదం పప్పులను ఎలా తీసుకుంటే మంచిది? నానబెట్టి తినడం వల్లే అదనపు ప్రయోజనాలుంటాయా? ఆల్మండ్‌లోని పోషకవిలువలు, ఆరోగ్యకర ప్రయోజనాలు తెలియాలనుకుంటున్నారా? అయితే ఈ వీడియో మీకోసం.. అద్భుతమైన పోషక విలువలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న పప్పు బాదం. బాదం ఒమేగా 3, విటమిన్ ఇ, ప్రొటీన్, పీచుతో నిండి ఉంటుంది. బరువు తగ్గడం నించీ రక్తపోటు అదుపులో ఉంచుకోడం వరకూ, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం నించీ కాన్సర్ ముప్పుని తగ్గించడం వరకూ బాదం చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే సూపర్ ఫుడ్ అని కూడా భావిస్తున్నారు. ఇందులో ఉన్న ప్రొటీన్ ఆకలిని నియంత్రిస్తుంది.దీంతో బరువు తగ్గడం కూడా తేలిక. మెగ్నీషియం వల్ల ఎముకలు బలపడతాయి, ఇంకా మధుమేహం కూడా అదుపులో ఉంటుంది. అంతేకాదు, రక్తపోటు ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. నానబెట్టిన బాదాం తింటేనే ఎక్కువ ప్రయోజనాలా అంటే మాత్రం అవుననే చెప్పాలి. (మీ గార్డెన్‌లో గులాబీలు విరగ బూయాలంటే?)ఏదైనా గింజని నానబెట్టి, మొలక వచ్చేలా చేసినపుడు వాటిల్లో కొవ్వు ప్రొటీన్‌గా మారుతుంది. అలాగే బాదం పప్పులు మీద ఉండే తొక్కలో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పోషకాలను గ్రహించకుండా చేస్తుంది. నాన బెట్టి, పైన తోలు తీసి తినడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి. రాత్రి నానబెట్టిన అయిదు లేదా ఆరు బాదం పప్పులను ఉదయాన్నే తింటే మంచిదని ఆహార నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన బాదంలో ఉండే విటమిన్ కాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. నానబెట్టిన బాదంపప్పులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. అలాగే నానబెట్టిన బాదంనించి లిపేజ్ అనే ఒక ఎంజైమ్ విడుదల అవుతుంది. ఇది అరుగుదలకీ, అనవసరమైన కొవ్వు కరగడానికీ ఉపయోగపడుతుంది. దీంతోపాటు గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఫోలిక్ యాసిడ్ నానబెట్టిన బాదంలో సమృద్ధిగా ఉంది. చెడు కొలెస్ట్రాల్‌కి చెక్ చెప్పే బాదం గుండె ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. బాదంలో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. వీటిలో ఉండే విటమిన్ ఇ యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేసి ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గించి వయసు కనపడనివ్వకుండా చేస్తుంది.

బాదం పప్పులు పోషకాలలోనే కాదు, వంటకాలలో వాడుకోడానికి కూడా పనికొస్తాయి. బాదం ఒమేగా 3, విటమిన్ ఇ లాంటి పోషకాలతో సమృద్ధమైంది. బాదం తిన్నాక నిండుగా అనిపించి తొందరగా ఆకలి వేయదు. పాయసం మీద సన్నని పలుకులుగా చేసి చల్లినా, నూరి కుర్మా లో వాడినా, నానబెట్టి రుబ్బి బాదం పాలు తయారుచేసినా అందరూ ఇష్టపడతారు. బాదంలో అద్భుతమైన పోషక గుణాలు ఉన్నాయి. ఈ లాభాలన్నిటినీ పొందాలంటే వాటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం అవసరం. ఇలా చేయడం వల్ల ఆరోగ్యకరమైన జీవితం మన సొంతం అవుతుందని డైటీషియన్స్ చెబుతున్నారు.బాదం టీ ప్రయోజనాలు

బాదం పప్పులు అధిక పోషకాహారాన్ని అందిస్తాయి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఉంటాయి. బాదంలో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ ఇ, కాల్షియం, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని సరిగ్గా ఉంచుతుంది. ఉన్నవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మెగ్నీషియం సరైన మొత్తంలో తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుతుంది.





## సెన్సెక్స్ 530 పాయింట్ల జంప్.. డీఐఐల రికార్డు రూ. 3.56 లక్షల కోట్లు

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


**ముంబై-నవభూమి:** భారత స్టాక్ మార్కెట్లు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ, క్రూడ్ ధరల పతనం, స్థిరమైన అమెరికన్ డాలర్ వంటి అనుకూల సంకేతాలతో మార్కెట్లు పుంజుకున్నాయి. ఈ క్రమంలో ఉదయం 10.20 గంటలకు సెన్సెక్స్ 527 పాయింట్లు ఎగిసిపడి 82,582కి చేరింది. నిఫ్టీ కూడా 138 పాయింట్లు పెరిగి 25,441 వద్ద నిలిచింది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 103, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 225 పాయింట్లు లాభపడింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ విలువ రూ. 453.31 లక్షల కోట్లకు చేరింది. గత సెషన్‌లో పోలిస్తే రూ. 3.07 లక్షల కోట్లు కొత్తగా వచ్చాయి.రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ ద్వారా పెరుగుతున్న ఆదరణ డీఐఐలను స్థిరంగా ఉంచిందని నిపుణులు చెబుతున్నారు. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ గ్రోత్ కూడా 2024లో ఈ రికార్డు కొనుగోళ్లకు కారణమన్నారు. అంతర్జాతీయ మార్కెట్లు, ప్రధానంగా నాస్‌డాక్ 100 రికార్డు గరిష్ఠాలకు చేరుకోవడంతో భారత మార్కెట్లకు ఊపునిచ్చింది. ఈ క్రమంలో బీఎస్ఈలో 48 షేర్లు 52 వారాల గరిష్ఠాలను తాకగా, 25 షేర్లు 52 వారాల కనిష్ఠాలకు చేరాయి. మొత్తం 3,225 షేర్లలో 2,467 షేర్లు లాభాల్లో, 623 షేర్లు నష్టాల్లో, 148 షేర్లు మార్పు లేకుండా ట్రేడయ్యాయి.

## వన్నెతగ్గిన బంగారం.. ఒక్కరోజే రూ.1,470 దిగిన 10 గ్రాముల ధర



**హైదరాబాద్/న్యూఢిల్లీ- నవభూమి:** దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పడిపోయాయి. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.1,470 దిగి లక్ష రూపాయల మార్కుకు దిగువన రూ.99,220 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.1,350 దిగొచ్చి రూ.90,950 వద్ద నిలిచింది. కాగా, దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ తులం రేటు రూ.900 తగ్గి రూ.98, 900గా నమోదైనట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

**ఉద్రిక్తతలు తగ్గడంతో..**

పశ్చిమాసియానేగాక, యావత్తు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్న ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం వల్లే గోల్డ్ మార్కెట్‌లో ఈ రివర్స్ ట్రెండ్ అని నిపుణులు తాజా మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు. గతకొద్ది రోజులుగా ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. పరస్పర దాడులతో బీభత్సం సృష్టించాయి. ఈ ఘర్షణల్లోకి అమెరికా కూడా ప్రవేశించడంతో పరిస్థితులు మరింతగా దిగజారాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్లలో వాటిల్లుతున్న నష్టాలను అధిగమించడానికి మదుపరులు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం వైపునకు అడుగులు వేస్తూ వచ్చారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయన్న వార్తలు.. ఇన్వెస్టర్ల చూపును మళ్లీ ఈక్విటీల వైపునకు మరల్చాయి. ఈ నేపథ్యంలోనే బంగారం ధరల తగ్గుదల అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**వెలవెలబోతున్న వెండి**

మార్కెట్‌లో బంగారం ధరలతోపాటు వెండి ధరలూ క్షీణిస్తున్నాయి. న్యూఢిల్లీలో కిలో రేటు ఈ ఒక్కరోజే రూ.1,000 పతనమైంది. దీంతో రూ.1,04,200 వద్ద స్థిరపడింది. సాధారణ కొనుగోలుదారులతోపాటు నాణేల తయారీదారులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ తగ్గిందని.. అందుకే వెండి ధరలు క్రమేణా దిగొస్తున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఈ నెలలోనే వెండి కిలో ధర మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ రూ.1,08,100గా నమోదైన సంగతి విదితమే. అయితే గడిచిన రెండు వారాల్లో కిలో రేటు దాదాపు రూ.4వేలదాకా పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో తులం 24 క్యారెట్ బంగారం ధర దేశీయంగా గరిష్ఠంగా రూ.1,01,600 పలికిన సంగతీ విదితమే.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్, సిల్వర్ రేట్లు క్రమేణా క్షీణిస్తున్నాయి. ఔన్స్ గోల్డ్ ధర 46.05 డాలర్లు లేదా 1.37 శాతం పడిపోయి 3,323.05 డాలర్లకు పరిమితమైంది. అమెరికా రిజర్వ్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యవిధానాన్ని ఇన్వెస్టర్లు దగ్గరగా గమనిస్తున్నారని, ఈ క్రమంలోనే గోల్డ్ మార్కెట్ రివర్స్ గేర్ తీసుకుందన్న అంచనాలు వినిపిస్తున్నాయిప్పుడు. వడ్డీరేట్లను తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పట్నుంచో చెప్తున్నప్పటికీ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ ససేమిరా అంటున్నారు. వడ్డీరేట్ల కోతలపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తాజాగా మరోసారి స్పష్టం చేశారు. దీంతో గ్లోబల్ మార్కెట్‌లో బంగారం ధరల క్షీణతకు దారితీసింది. దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులపై వేచిచూసే ధోరణినే అవలంబిస్తున్నామన్నారు. సాధారణంగా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గితే బంగారం ధరలు మార్కెట్‌లో పెరుగుతాయి. అలాగే వడ్డీరేట్లు పెరిగితే గోల్డ్ ప్రైస్ తగ్గుతుంది.

## టెలికంలో ద్వంద్వ పెత్తనం మంచిది కాదు



**న్యూఢిల్లీ-నవభూమి:** టెలికం రంగంలో రెండు కంపెనీల గుత్తాధిపత్యం ఏమాత్రం మంచిది కాదని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. ఏ రంగంలో అయినా పోటీ తప్పనిసరన్నారు. బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం (బీఐఎఫ్) నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశ టెలికం రంగంలో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలదే పెత్తనం. ఈ రెండు కంపెనీలు 4జీ, 5జీ సేవలతో దూసుకు పోతుంటే, వొడాఫోన్ ఐడియా కంపెనీ అప్పులు, నష్టాలతో కుదేలవుతోంది. ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్ అయితే ఇప్పటి వరకు కనీసం 4జీ సేవలు కూడా ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.శాట్‌కామ్‌లకు త్వరలో స్పెక్ట్రమ్: ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించే కంపెనీలకు త్వరలోనే స్పెక్ట్రమ్ కేటాయింపులు పూర్తి చేస్తామని సింధియా ప్రకటించారు. అయితే ఎప్పటిలోగా అనే విషయాన్ని మాత్రం వెల్లడించ లేదు. వేలం ద్వారా గాక, పాలనాపరమైన అనుమతుల ద్వారానే ఈ కేటాయింపులు ఉంటాయన్నారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌తో పాటు అనేక శాట్‌కాం కంపెనీలు ఇప్పటికే లైసెన్సులు పొంది తమ సేవల ప్రారంభానికి స్పెక్ట్రమ్ కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నాయి.

## వడ్డీరేట్ల తగ్గింపుపై వేచి చూస్తాం



**వాషింగ్టన్- నవభూమి:** అధ్యక్షుడు ట్రంప్ ఎంత అరిచి గీపెట్టినా కీలక వడ్డీరేట్లను ఇప్పటికిపుడు త గ్గించే ప్రసక్తే లేదని అమెరికన్ ఫెడరల్ రిజ ర్వ్ తేల్చి చెప్పింది. ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో వేచి చూసి మాత్రమే, వడ్డీరేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామని ఫెడ్ చైర్మన్ జెరోం పోవెల్ స్పష్టం చేశారు. రుణ సేకరణ భారం తగ్గించేందుకు ఫెడ్ వెంటనే వడ్డీరేట్లు తగ్గించాలని ట్రంప్ పదే పదే కోరుతున్న విషయం తెలిసిందే. అయినా గత వారం జరిగిన సమావేశంలో కీలక స్వల్ప కాలిక వడ్డీరేట్లను 4.25-4.5 శాతం వద్దే కొనసాగించాలని ఫెడ్ నిర్ణయించింది. దీనిపై ట్రంప్ మండిపడుతూ పోవెల్‌ను మూర్ఖ? శిఖామణి, అసమర్థుడు అని నిందించారు.

## ఫ్రీలాన్సర్లకు పర్సనల్ లోన్ వస్తుందా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఫ్రీలాన్సర్లు పర్సనల్ లోన్ తీసుకోవాలనుకుంటున్నారా? అయితే కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకోవాలి. జీతం తీసుకునే ఉద్యోగులతో పాటు, ఫ్రీలాన్సర్లు కూడా పర్సనల్ లోన్ తీసుకోవచ్చు. పెళ్లి, ఇంటి మరమ్మతులు వంటి అవసరాల కోసం ఈ లోన్ ఉపయోగపడుతుంది. లోన్ తీసుకునే ముందు ఆదాయపు పన్ను రిటర్న్‌లు, క్రెడిట్ స్కోర్ వంటివి పరిగణనలోకి తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే లోన్ తీసుకోవడం మంచిది. ఫ్రీలాన్సర్లు ఏదైనా వస్తువులు కొనేందుకు లేదా పని తక్కువగా ఉన్న నెలల్లో ఖర్చుల కోసం పర్సనల్ లోన్ తీసుకోవచ్చు. లోన్ కోసం అప్లై చేసేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి.ఐటీఆర్ చాలా ముఖ్యం. ఫ్రీలాన్సర్లకు జీతం స్లిప్‌లు ఉండవు. కాబట్టి, ఆదాయాన్ని చూపించడానికి ఐటీఆర్ ఉపయోగపడుతుంది. గత రెండు, మూడు సంవత్సరాల ఐటీఆర్‌లను బ్యాంకులు లేదా లు పరిశీలిస్తాయి. దీని ద్వారా ఫ్రీలాన్సర్ ఆదాయం తెలుస్తుంది. ఇది మీ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి రుణదాతకు సహాయపడుతుంది.క్రెడిట్ స్కోర్ కూడా ముఖ్యమైనది. పర్సనల్ లోన్ ఆమోదం పొందడానికి ఇది చాలా అవసరం. మంచి క్రెడిట్ స్కోర్‌ను మెయింటైన్ చేయడం ముఖ్యం. మీకు క్రెడిట్ కార్డ్ ఉంటే, బిల్లులు సకాలంలో చెల్లించాలి. ఇది మీ ఆర్థిక క్రమశిక్షణను చూపిస్తుంది.పర్సనల్ లోన్‌లకు వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే రుణం తీసుకోవడం మంచిది. అనవసరమైన ఖర్చుల కోసం లోన్ తీసుకుంటే భారం అవుతుంది.ఫ్రీలాన్సర్లు కొన్నిసార్లు పర్సనల్ లోన్ తీసుకోవాల్సి వస్తుంది. ఆ సందర్భాలేంటో చూద్దాం.కొన్నిసార్లు క్లయింట్లు డబ్బులు ఇవ్వడానికి ఆలస్యం చేస్తారు. అలాంటి సమయంలో కార్యకలాపాలు నిర్వహించడానికి డబ్బు అవసరం అవుతుంది. దీనినే "వర్కింగ్ క్యాపిటల్" అంటారు. ఈ అవసరాల కోసం పర్సనల్ లోన్ ఉపయోగపడుతుంది.కొత్త కంప్యూటర్ లేదా ఇతర పరికరాలు కొనడానికి డబ్బు అవసరం పడొచ్చు. ఇది ఒక రకమైన పెట్టుబడి. లోన్ తీసుకొని పరికరం కొని, దాని ద్వారా సంపాదించి తిరిగి చెల్లించవచ్చు.పని తక్కువగా ఉన్నప్పుడు సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి కూడా లోన్ అవసరం కావచ్చు. ఫ్రీలాన్సర్లు అత్యవసర నిధిని కలిగి ఉండాలని అనుకుంటారు. కానీ అది కొన్నిసార్లు సరిపోకపోవచ్చు. ఫ్రీలాన్సర్లు లోన్ తీసుకునే ముందు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. వాటిలో ఆదాయపు పన్ను రికార్డులు, క్రెడిట్ స్కోర్, లోన్ తీసుకోవడానికి గల కారణం ముఖ్యమైనవి. ఎప్పుడు పడితే అప్పుడు.. ముఖ్యంగా విలాసాల కోసం లోన్ తీసుకోవడం అంత మంచిది కాదు.

## బంగారం తాకట్టు పెట్టి లోన్ తీసుకోవాలనుకుంటున్నారా?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయులకు బంగారం అంటే చాలా ఇష్టం. ఇది కేవలం ఆభరణం కాదు. ఆర్థికంగా, సెంటిమెంటుగా కూడా దీనికి విలువ ఉంది. మీ బంగారం అమ్మకుండానే డబ్బు అవసరాలు తీర్చుకోవడానికి గోల్డ్ లోన్ ఉపయోగపడు తుంది. వ్యాపారం, పెళ్లిళ్లు, విద్య, వైద్యం వంటి అవసరాల కోసం ఇది చాలా సులువుగా డబ్బు పొందే మార్గం. గోల్డ్ లోన్ ఎలా పనిచేస్తుంది? కొత్తగా ఏం రూల్స్ తీసుకొచ్చింది. వంటి విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. గోల్డ్ లోన్ అంటే మీ బంగారం తాకట్టు పెట్టి డబ్బు తీసుకోవడం. బ్యాంకులు లేదా (నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ) ఈ లోన్ ఇస్తాయి.ఇక్కడ మీ బంగారు ఆభరణాలు, నాణేలు బ్యాంకులో పెట్టి డబ్బు తీసుకోవచ్చు. లోన్-టు-వాల్యూ అంటే మీ బంగారం విలువలో ఎంత శాతం లోన్ ఇస్తారనేది. మీరు తీసుకున్న అప్పు, వడ్డీ మొత్తం తిరిగి చెల్లించిన తర్వాత మీ బంగారం మీకు తిరిగి ఇస్తారు.

మొదట మీరు మీ బంగారాన్ని బ్యాంకుకు లేదా తీసుకెళ్లాలి. వాళ్లు మీ బంగారం బరువు, అది ఎంత స్వచ్ఛమైనదో చూస్తారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మీ బంగారం విలువను లెక్కిస్తారు. 18 నుంచి 24 క్యారెట్ల బంగారాన్ని మాత్రమే తీసుకుంటారు. లోన్ మొత్తం మీ చేతికి ఇస్తారు. ఇది సాధారణంగా బంగారం విలువలో 75 శాతం వరకు ఉంటుంది. దీనినే నిష్పత్తి అంటారు.మీరు లోన్ ఎలా తిరిగి చెల్లించాలో ఎంచుకోవచ్చు. బుల్లెట్ రీపేమెంట్ అంటే ఒకేసారి మొత్తం చెల్లించడం. %జువీ×% అంటే నెలవారీ వాయిదాలలో చెల్లించడం. లేదా, ప్రతి నెల వడ్డీ కట్టి, చివర్లో అసలు మొత్తం చెల్లించొచ్చు. మీరు మొత్తం అప్పు తీర్చిన తర్వాత మీ బంగారం మీకు తిరిగి ఇస్తారు.చాలా త్వరగా లోన్ ఇస్తారు. కొన్నిసార్లు 10 నిమిషాల్లోనే డబ్బు తీసుకోవచ్చు. మీకు ఆదాయం ఎంత ఉందో చూపించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బంగారం హామీగా ఉంటుంది. లోన్ తిరిగి చెల్లించడానికి ఎక్కువ సమయం ఉంటుంది. మూడు నెలల నుంచి 3 సంవత్సరాల వరకు గడువు ఉంటుంది. ఇతర లోన్లతో పోలిస్తే వడ్డీ రేట్లు తక్కువగా ఉంటాయి. ఇక్కడ మీ క్రెడిట్ స్కోరుతో పనిలేదు. అంటే స్కోరు బాగా లేకపోయినా లోన్ వస్తుంది. ఒకవేళ మీరు లోన్ కట్టకపోతేనే మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడుతుంది.

ఏప్రిల్ 2025లో ఆర్బీఐ.. బంగారం రుణాలపై కొన్ని కొత్త రూల్స్ తీసుకొచ్చింది. దీనివల్ల గోల్డ్ లోన్ విషయంలో మోసాలు జరగకుండా ఉంటాయి. అప్పు తీసుకునేవారికి కూడా మేలు జరుగుతుంది. ఆ రూల్స్ ఏమిటో ఇప్పుడు చూద్దాం.మీ బంగారం ఆర్బీఐ లైసెన్స్ ఉన్న చోట లేదా బ్యాంక్ లాకర్లలో భద్రంగా ఉంచాలి. "హామీగా ఉంచిన బంగారాన్ని -సర్టిఫైడ్ సంస్థలు లేదా సంస్థల ఆధ్వర్యంలోని లాకర్లు లేదా వాల్ట్‌లలో నిల్వ చేయాలని బ్యాంకులు తప్పనిసరిగా నిర్ధారించుకోవాలి" అని ఆర్బీఐ తెలిపింది.బంగారం విలువను లెక్కించే విధానం అందరికీ ఒకేలా ఉండాలి. తరచుగా థర్డ్-పార్టీ ఆడిట్ చేస్తూ ఉండాలి. అప్పు తీసుకునేవారు లోన్ తీసుకునే ముందు అన్ని విషయాలు తెలుసుకొని డిజిటల్‌గా అంగీకరించాలి. దీనివల్ల వారికి లోన్ గురించి పూర్తిగా అర్థం చేసుకోవడానికి సమయం ఉంటుంది. లోన్ తిరిగి చెల్లించే గడువుపై ఆర్బీఐ పరిమితులు కూడా పెట్టొచ్చు. రూ. 20,000 కంటే ఎక్కువ నగదు రుణం బ్యాంకు ద్వారానే ఇవ్వాలి.

వడ్డీ రేట్లు, వేలం నిబంధనలు, ఇతర ఖర్చుల గురించి అప్పు తీసుకునేవారికి స్పష్టంగా చెప్పాలి.ఒకవేళ అప్పు తీసుకున్న వ్యక్తి డబ్బు కట్టకపోతే, బంగారం వేలం వేస్తారు. ఈ వేలం సరైన పద్ధతిలో, పారదర్శకంగా జరగాలి. బంగారం పోతే లేదా దొంగతనానికి గురైతే నష్టం జరగకుండా ఉండేందుకు బీమా తీసుకోవాలి. నిష్పత్తి 75 శాతానికి మించకూడదు.

ఎక్కువ డాక్యుమెంట్లు లేకుండా, త్వరగా డబ్బు కావాలనుకునేవారికి గోల్డ్ లోన్ మంచిది. కానీ, అప్పు తీసుకునే ముందు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి.

వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పోల్చుకోవాలి. తిరిగి ఎలా చెల్లించాలో తెలుసుకోవాలి. మీ బంగారాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ఒక ప్రణాళిక వేసుకోవాలి. చివరిగా, గోల్డ్ లోన్‌లు త్వరగా డబ్బు పొందడానికి సులువైన మార్గం. వ్యక్తిగత రుణాల కంటే ఇది చౌకగా ఉంటుంది. కొత్త రూల్స్ వల్ల మరింత భద్రత ఉంటుంది. సామాన్యులకు ఈ లోన్లు మరింత అందుబాటులో ఉంటాయి.

# దేశంలో 30కోట్ల 5జీ కస్టమర్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** గత ఏడాది చివరి నాటికి దేశంలో 5జీ వినియోగదారులు 29 కోట్లకు చేరారని మంగళవారం విడుదలైన ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్టులో తేలింది. మొత్తం భారతీయ మొబైల్ వినియోగదారుల్లో ఇది 24 శాతమని పేర్కొన్నది. అలాగే ఒక్కో స్మార్ట్‌ఫోన్ యూజర్ నెలకు 32 జీబీ డాటాను వాడుకున్నారని ఈ తాజా నివేదికలో ఎరిక్సన్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే 2030కల్లా ఇంచుమించుగా మూడురెట్లు పెరిగి దేశీయ 5జీ సబ్‌స్క్రైబర్లు దాదాపు 98 కోట్లకు చేరుకోవచ్చుని (దేశీయ మొబైల్ వాడకందారుల్లో 75 శాతం), నెలకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల డాటా వాడకం 62 జీబీని తాకవచ్చుని అంచనా వేసింది.ఇక 2030 నాటికి దేశంలో 4జీ కస్టమర్లు ప్రస్తుతంతో పోల్చితే సుమారు 60 శాతం పడిపోయి 23 కోట్లకు పరిమితం కావచ్చంటూ ఈ అప్‌డేటెడ్ రిపోర్టులో స్వీడిష్ టెలికం కంపెనీ చెప్పింది. నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన రిపోర్టులో 2030 నాటికి దేశంలో 5జీ యూజర్లు 97 కోట్లకు పెరగవచ్చని, 4జీ కస్టమర్లు 24 కోట్లుగా ఉంటారని అంచనా వేసింది. నెలవారీ డాటా వినియోగం కూడా స్మార్ట్‌ఫోన్‌కు 66 జీబీగా ఉండొచ్చన్నది. అయితే తాజా నివేదికలో ఈ నెంబర్లను సవరించింది.

## వొడాఫోన్ సైయెంట్ సహకార భాగస్వామ్యం

**హైదరాబాద్-నవభూమి:** నెట్‌వర్క్ ఇంజనీరింగ్, ఆపరేషన్ విభాగాల్లో సమర్థతను పెంచేందుకు వొడాఫోన్, సైయెంట్ చేతులు కలిపాయి. దీని కింద ఉభయ సంస్థలు ఏఐ ఆధారంగా పని చేసే గ్లోబల్ నెట్‌వర్క్ కన్ఫిగరేషన్ సొల్యూషన్‌ను విడుదల చేశాయి. దీని వల్ల స్థానిక మార్కెట్లలో నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ సమర్థత పెరుగుతుందని వొడాఫోన్ తెలిపింది.

## బొండాడ గ్రూప్‌నకు తమిళనాడు కాంట్రాక్టు

**హైదరాబాద్-నవభూమి:** మౌలిక వసతుల రంగంలో వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీల్లో ఒకటైన బొండాడ గ్రూప్‌నకు తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి భారీ కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద తమిళనాడులోని వెల్లలవిడుతి, తేనాంపట్టి ప్రాంతాల్లో 400 ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి వ్యవస్థను (బీఈఎస్ఎస్) నిర్మించాల్సి ఉంటుంది. బిల్డ్-ఓన్-ఆపరేట్ (బీఓఓ) మోడల్ కింద చేపట్టే ఈ ప్రాజెక్టుకు పోటీ టెండరింగ్ విధానంలో నిర్వహించిన బిడ్డింగ్‌లో బొండాడ గ్రూప్ విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచింది. 12 సంవత్సరాల పాటు అమలులో ఉండే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ కొనుగోలు ఒప్పందం కింద బొండాడ గ్రూప్ నుంచి తమిళనాడు జెనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టాన్‌జెడ్కో) బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సేవలు పొందుతుంది. ఇది బొండాడ గ్రూప్ ఎనర్జీ స్టోరేజి విభాగానికి కీలక మైలురాయి అని గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు బొండాడ అన్నారు.

## ఐటీఆర్ ఫైలింగ్ గడువు పొడిగింపు.. మరి జులై 31 తర్వాత చేస్తే ఫైన్ కట్టాలా?



**హైదరాబాద్-నవభూమి:** పన్ను చెల్లింపుదారులకు అలర్ట్. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు గడువును ఆదాయపు పన్ను శాఖ పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జులై 31 నుంచి సెప్టెంబర్ 15 వరకు మీ పన్ను రిటర్న్ దాఖలు చేసుకోవచ్చు. ఆలస్యంగా దాఖలు చేసినా జరిమానా ఉండదు, కానీ అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులో ఆలస్యం చేస్తే వడ్డీ కట్టాల్సి వస్తుంది. ఈ విషయాలపై నిపుణుల అభిప్రాయాలు తెలుసుకుందాం.

: ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసేవారికి ఒక ముఖ్యమైన ప్రకటన. కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి %ఖ=% దాఖలు గడువును పొడిగించింది. గడువు జులై 31, 2025 నుంచి సెప్టెంబర్ 15, 2025 వరకు పొడిగించింది. ఈ నిర్ణయం పన్ను చెల్లింపుదారులకు ఊరటనిస్తుంది. గడువు తేదీ తర్వాత %ఖ=% దాఖలు చేసినందుకు జరిమానా ఉండదనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులో ఆలస్యం జరిగితే మాత్రం వడ్డీ వర్తిస్తుంది. ఐటీఆర్ దాఖలు గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ మే 27న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జులై 31 తర్వాత ఐటీఆర్ ఫైల్ చేసినా ఎలాంటి జరిమానా ఉండదు.ఢిల్లీకి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ ప్రతిభా గోయల్ ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. "గడువు పొడిగింపు కారణంగా, సెక్షన్ 234%జూ% కింద ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, అడ్వాన్స్ టాక్స్ చెల్లింపులో జాప్యం జరిగితే 234%దీ, 234జ% నిబంధనలు వర్తిస్తాయి" అని ఆమె అన్నారు. ఒకవేళ నోటిఫికేషన్‌లో వడ్డీ లేదా జరిమానా ఉంటుందని పేర్కొని ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదని ఆమె అభిప్రాయపడ్డారు. అంటే, ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వడ్డీ గురించి ప్రస్తావించకపోతే, జరిమానా ఉండదని ఆమె తెలిపారు.ముంబైకి చెందిన మరో చార్టర్డ్ అకౌంటెంట్ చిరాగ్ చౌహాన్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. "ఈ సంవత్సరం జులై 31 తర్వాత టాక్స్ రిటర్న్ దాఖలు చేసినందుకు 234%జూ% కింద వడ్డీ చెల్లించాల్సి వస్తుందనేది ఒక అపోహ. సెక్షన్ 139 కింద ఇచ్చిన గడువు తేదీ తర్వాత రిటర్న్ దాఖలు చేసినప్పుడు ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. కానీ గడువు తేదీనే పొడిగించినప్పుడు, ఆలస్యంగా దాఖలు చేసినందుకు వడ్డీ ఎందుకు ఉంటుంది? అయితే, అడ్వాన్స్ టాక్స్ చెల్లింపులో జాప్యం జరిగితే మాత్రం వడ్డీ ఉంటుంది. ఇది జులై 31 తర్వాతే కాకుండా, ముందే వర్తిస్తుంది" అని ఆయన అన్నారు.

## చీర చుట్టూ చీకటి మాయ.. 'శారీ'లో రామ్ గోపాల్ వర్మ మరోసారి సంచలనం

**న్యూఢిల్లీ-నవభూమి:**రామ్ గోపాల్ వర్మ సైకలాజికల్ థ్రిల్లర్ 'శారీ'లో అబ్సెషన్ చెడుగా మారుతుంది. ఇది లయన్స్‌గేట్ ప్లేలో ప్రత్యేకంగా ప్రదర్శనకు సిద్ధంగా ఉంది. ఒక్క క్షణంలో కలిగే ఆకర్షణ మరింత కలవరపెట్టేదాన్ని మేల్కొల్పుతుంది. అబ్సెషన్, నియంత్రణ, భావోద్వేగ థ్రిల్లర్‌గా తెరకెక్కిన శారీ ఒక ఉల్లాసమైన ప్రయాణపు ముదుల్ని విప్పుతుందిదిస్నేహితులతో కలిసి వెళ్లిన వెకేషన్. చీరలో ఒక అపరిచితురాలు. పిచ్చిగా మారే ఒక చూపు. నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ పొందిన శారీ ఒక సైకలాజికల్ థ్రిల్లర్. ఇది ప్రేక్షకులను లోతుగా కలవరపెట్టే ప్రశ్నను ఎదుర్కోవలసి వస్తుంది: మనం ఆన్‌లైన్‌లో సంభాషించే వ్యక్తులను మీరు నిజంగా ఎంత బాగా తెలుసుకుంటారు? ఆన్‌లైన్ వ్యామోహంగా ప్రారంభమయ్యేది, నిరంతరాయంగా వెంటాడటం, భావోద్వేగాలను తారుమారు చేయడం, నియంత్రణ కోల్పోవడం వంటి వాటికి దారితీస్తుంది. సత్య యాదు పోషించిన కిట్టు కథను శారీలో చూడవచ్చు. ఆరాధ్య దేవి పోషించిన మహిళ పాత్ర పట్ల ఫోటోగ్రాఫర్ సత్య యాదు ఎక్కువ మక్కువ పెంచుకుంటాడు. ఆమెను చీరలో చూస్తాడు. అప్పటి నుంచి ఆమె రూపం అతన్ని పూర్తిగా ఆవరిస్తుంది. ప్రశంస నియంత్రణలోకి మారుతుంది. తిరస్కరణ కోపాన్ని రేకెత్తిస్తుంది. అతని వ్యామోహం ఆమె చుట్టూ ఉన్న ప్రతిదానినీ బెదిరించడం ప్రారంభిస్తుంది.

రామ్ గోపాల్ వర్మ రచన, సమర్పణలో గిరి కృష్ణ కమల్ దర్శకత్వం వహించిన శారీ కేవలం సినిమా మాత్రమే కాదు- ఇది డిజిటల్ యుగంలో వ్యామోహం, మోహం, దాని భయానక పరిణామాలను ఆందోళనకరంగా చూపిస్తుంది. జూన్ 27 నుంచి లయన్స్‌గేట్ ప్లేలో ప్రత్యేకంగా ప్రసారం కానున్న నరాలను మెలిపెట్టే ఈ సైకలాజికల్ థ్రిల్లర్ అదుపులేని కోరిక భయంకరమైన వైపుకు వెళుతుంది. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం మరియు మలయాళంలో అందుబాటులో ఉంటుంది.శారీ గురించి చిత్ర సమర్పకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, "శారీ కేవలం కల్పితం కాదు- ఇది నేడు సర్వసాధారణంగా మారుతున్న వాస్తవ డిజిటల్ స్టాకింగ్‌కు సంబంధించిన భయంకరమైన వాస్తవికతలో పాతుకుపోయింది. నేడు, నిజ జీవితంలో కన్నా ఆన్‌లైన్‌లో సంబంధాలు వేగంగా ఏర్పడతాయి. తరచూ మరొక వైపు ఎవరు ఉన్నారో నిజంగా తెలియకుండానే సంబంధం మొదలవుతుంది. శారీతో, నేను వాస్తవ పరిస్థితులను దాటి, సోషల్ మీడియా ఇంటరాక్షన్ లేదా ఒక చూపు చేసే హాని, పూర్తి స్థాయి భావోద్వేగ పీడకలగా ఎలా మారుతుందో చూపించాలనుకున్నాను. ఆప్యాయతగా ప్రారంభమయ్యేది త్వరగా నియంత్రణగా మారుతుంది. ప్రేమగా మారువేషంలో ఉన్న నియంత్రణ ద్వేషం కన్నా చాలా భయంకరమైనది. ఈ చిత్రాన్ని తెరకెక్కించే సమయంలో అనుభవం తీవ్రంగా ఉంది. ఎందుకంటే, ఇది నన్ను కొన్ని అసౌకర్య సత్యాలతో కూర్చోవలసి వచ్చింది" అని పేర్కొన్నారు.



దీని గురించి మరింత వివరిస్తూ, "సినిమాలో, చీర కేవలం ఒక వస్త్రం కన్నా ఎక్కువ అవుతుంది. మహిలలు ఏమి ధరించినా వారిపై కోరిక, భ్రమ ఎలా ప్రేరేపిస్తుందో అనే దానికి ఇది చిహ్నం. చీర వంటి సాంప్రదాయకమైన దానిని కూడా వస్తువుగా మార్చవచ్చు. ఎవరైనా 'కాదు' అని చూసినప్పుడు కూడా దాన్ని 'అవును' అని అర్థం చేసుకున్నప్పుడు ఏమి జరుగుతుందో శారీ అన్వేషిస్తుంది. ఇది సోషల్ మీడియా యుగంలో వ్యామోహం ఎలా ఉంటుందో వివరిస్తుంది. ఇక్కడ కల్పనలు వాస్తవికతతో మసకబారుతాయి. సరిహద్దులు అదృశ్యమవుతాయి. నేను ఆ అవరోహణను ముడి, వాస్తవిక రీతిలో బంధించాలనుకున్నాను. దాని ప్రధాన భాగంలో, ఇది మానవ స్వభావం, మన భావోద్వేగ దుర్బలత్వం మరియు ప్రశంస ఎలా సులభంగా చాలా చీకటిగా మారగలదో అనే దాని గురించి ఒక కథ" అని వివరించారు.అధికారిక సారాంశం: ఒక ఫోటోగ్రాఫర్ ఎరుపు చీర కట్టుకున్న ఒక రహస్యమైన స్త్రీతో ప్రమాదకరమైన వ్యామోహంలో కూరుకుపోయినప్పుడు, ఒక సాధారణ సెలవు చీకటి మలుపు తీసుకుంటుంది. ప్రశంస క్షణంగా ప్రారంభమూ వివిధ మలుపులు తీసుకుని, ప్రేమ మరియు పిచ్చి మధ్య రేఖలను అస్పష్టం చేస్తుంది. అతని వ్యామోహం తీవ్రమయ్యే కొద్దీ, అది ఆమె భద్రతకు, వాస్తవికతపై అతని సొంత పట్టుకు ముప్పు కలిగించడం ప్రారంభిస్తుంది. శారీ అనేది అదుపులేని కోరికల భయానక పరిణామాలను, అభిరుచి మరియు స్వాధీనానికి మధ్య ఉన్న పెళుసైన సరిహద్దును అన్వేషించే ఒక సైకలాజికల్ థ్రిల్లర్.

**క్రెడిట్స్: దర్శకత్వం: రామ్ గోపాల్ వర్మ**

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | గురువారం | 26 । జూన్ । 2025




# అఖిల్ సినిమా నుంచి తప్పుకున్న శ్రీలీల.!

టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకు మురలీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయగా.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ గ్లింప్స్ ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కథనాయికగా నటిస్తున్న శ్రీలీల మువీ నుంచి తప్పుకుందని తెలుస్తుంది.

మొదట ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఖరారైనట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే, ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ఇతర ప్రాజెక్టులు, ముఖ్యంగా హిందీ, తమిళ సినిమాల కోసం డేట్స్ కేటాయించడం కష్టంగా మారిన కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి శ్రీలీల తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఈ వార్తలు నిజమైతే, శ్రీలీల స్థానంలో మరో హీరోయిన్‌ను వెతికే పనిలో చిత్రబృందం ఉందని తెలుస్తోంది. శ్రీలీల ప్రస్తుతం తెలుగులో పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటు బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్‌తో ఒక చిత్రంలో తమిళంలో సుధ కొంగరా చిత్రంలో నటిస్తుంది.

నవచిత్ర



# జాన్వి అక్కడ బిజీ అవ్వాలని చూస్తుందా..?



శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ బాలీవుడ్ లో తన మార్క్ నటనతో ఆడియన్స్ ని ఆకట్టుకుంటుంది. హిందీలోనే కాదు తన మదర్ లానే సౌత్ సినిమాల్లో కూడా రాణించాలని అనుకున్న జాన్వి కపూర్ ఎన్ టీ ఆర్ దేవర తో తెలుగు ఎంట్రీ ఇచ్చింది. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన దేవర సినిమాలో తంగం పాత్రలో జాన్వి కపూర్ ఆకట్టుకుంది. సినిమాలో అమ్మడి గ్లామర్ కి తెలుగు ఆడియన్స్ పడిపోయారని చెప్పొచ్చు. ఐతే జాన్వి కపూర్ దేవర తర్వాత దేవర 2 చేయాల్సి ఉంది. దిల్ రాజు ఇంత గట్టిగా చెబుతున్నారంటే.. ఐతే ఈలోగా రాం చరణ్ పెద్ది ఆఫర్ అందుకుంది. బుచ్చి బాబు డైరెక్షన్ లో చరణ్ లీడ్ రోల్ లో చేస్తున్న పెద్ది సినిమా సంథింగ్ స్పెషల్ గా రానుంది. ఈ సినిమా విషయంలో జాన్వి కపూర్ చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. ఐతే దేవర సినిమా చేసినా కూడా జాన్వికి ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఆ సినిమాలో ఆమెను కేవలం గ్లామర్ షోకి మాత్రమే అన్నట్టుగా చూపించారు. ఐతే పెద్ది విషయంలో అలాంటి తప్పు జరగకూడదని ఫిక్స్ అయ్యింది. అందుకే అమ్మడు ఈ పాత్రని ఎంపిక చేసుకుంది. ఇదిలా ఉంటే సౌత్ సినిమాల మీద ఫోకస్ తో అక్కడ బాలీవుడ్ లో అవకాశాలు మిస్ అవుతున్నాయని భావిస్తున్న జాన్వి కపూర్ ఇక మీదట అక్కడే ఫోకస్ చేయాలని ఫిక్స్ అయ్యిందట. ఎంత చేసినా సౌత్ లో గ్లామర్ కన్నా యాక్టింగ్ తోనే ఇంప్రెస్ చేయాల్సి ఉంటుంది. ఐతే అలాంటి పాత్రలు పడితేనే కానీ జాన్వికి ఇక్కడ సూపర్ స్టార్ డం వచ్చే అవకాశం ఉండదు. అందుకే సౌత్ సినిమాలు అడపాదడపా చేసినా తనకు అనుకువగా ఉండే హిందీ సినిమాలే చేస్తే బెటర్ అని భావిస్తుందట జాన్వి కపూర్. ప్రస్తుతం అమ్మడు పెద్ది సినిమాతో పాటు రెండు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి పరం సుందరి కాగా మరొకటి సన్నీ సంస్కారి కి తులసి కుమారి సినిమా చేస్తుంది. ఈ రెండు సినిమాలతో మరోసారి బాలీవుడ్ లో తన సత్తా చాటాలని చూస్తుంది జాన్వి కపూర్. ఐతే తెలుగులో మాత్రం పెద్ది హంగామా బాగుండగా ఆ సినిమా సక్సెస్ ఐతే మళ్లీ తెలుగు ఇంకా సౌత్ పరిశ్రమల నుంచి జాన్వి కపూర్ కి ఛాన్స్ లు వచ్చే వీలుంటుంది.

# రష్మిక ప్లేస్‌కి ఎసరు పెట్టేలా అమ్మడి ప్లాన్..?



కన్నడ పరిశ్రమలో ఆరేళ్ల క్రితమే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది అందాల భామ రుక్మిణి వసంత్. హిందీలో అప్ స్టార్స్ అనే సినిమాలో ఎన్.జి.ఓ గర్ల్ గా కనిపించిన రుక్మిణి కన్నడలో బర్ బల్ ట్రియాలజీ కేస్ 1 ఫైండింగ్ వజ్రముని సినిమాలో నటించింది. ఆ సినిమాలో రుక్మిణిని చూసి రక్షిత్ శెట్టి సప్త సాగరాలు దాటి సినిమాలో ఛాన్స్ పట్టేసింది. సప్త సాగరాలు దాటి రెండు భాగాల్లో రుక్మిణి వసంత్ యాక్టింగ్ అదరగొట్టేసింది. సినిమాలో ఆమెను చూసిన యూత్ ఆడియన్స్ అంతా ఆమెకు ఫిదా అయ్యారు. సప్త సాగరాలు దాటి సినిమా తర్వాత రుక్మిణి వసంత్ సౌత్ ఆడియన్స్‌కి హాలిలిట్ ఫేవరెట్ అయ్యింది. అమ్మడికి వరుసగా ఇతర భాషల నుంచి ఛాన్స్ లు వస్తున్నాయి. ఇప్పటికే తమిళ్ లో విజయ్ సేతుపతితో ఏస్ సినిమా చేసిన రుక్మిణి వసంత్ శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాలో కూడా అవకాశం అందుకుంది. ఇక తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతో వచ్చినా ఆ సినిమా ఎవరు పట్టించుకోలేదు. లేటెస్ట్ గా అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. నీల్ తో సినిమా అది కూడా ఎన్టీఆర్ లాంటి స్టార్ తో ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు. తప్పకుండా రుక్మిణి సౌత్ సినిమాల్లో తన ఇంపాక్ట్ గట్టిగా చూపించేలా ఉందని అనిపిస్తుంది. తనకు యూత్ ఆడియన్స్ లో ఏర్పడిన క్రేజ్ చూస్తే సరిగ్గా ఒక్క బ్లాక్ బస్టర్ పడితే ఇక అమ్మడిని తీసుకెళ్లి టాప్ ప్లేస్ లో పెట్టేలా ఉన్నారు. ఆల్రెడీ కన్నడ నుంచి వచ్చి రష్మిక టాలీవుడ్ ని మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ సెన్సేషన్ గా మారింది. ఇక ఇప్పుడు రష్మిక తర్వాత రుక్మిణి అదే రేంజ్ ఫాం కొనసాగించాలని చూస్తుంది. రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టే ప్లానింగ్ లో భాగంగానే రుక్మిణి స్టార్ ఛాన్స్ లు పట్టేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా తప్పకుండా రుక్మిణికి ఆ ఛాన్స్ ఉందనే అనిపిస్తుంది. రుక్మిణి వసంత్ చేస్తున్న ఎన్టీఆర్ సినిమా బ్లాక్ బస్టర్ కొడితే మాత్రం అమ్మడికి ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. ఇదే కాదు మరో రెండు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా లైన్ లో ఉన్నట్టు తెలుస్తుంది.

# చమురు- స్థిరాస్తి రంగంలో నయనతార



కెరీర్‌లో సుమారు 80 చిత్రాల్లో నటించిన మేటి నటి.. కేవలం 50 సెకన్లకు రూ. 5 కోట్లు వసూలు చేయగలదు.. రూ. 50 కోట్ల ప్రైవేట్ జెట్ సొంతంగా ఉంది.. సౌత్ కెరీర్ లో ఎన్నో బ్లాక్ బస్టర్లలో నటించి, 1000 కోట్ల క్లబ్ సినిమాతో హిందీ ఆరంగేట్రాన్ని అదరగొట్టింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నిష్ణాతురాలు. గల్ఫ్ ఆయిల్ కంపెనీలో పెట్టుబడులు, లిప్ బామ్ కంపెనీ వ్యవస్థాపకురాలిగా సౌందర్య ఉత్పత్తుల రంగంలో ఎదుగుతున్న ఎంటర్ ప్రెన్యూర్ గాను వెలుగుతోంది. బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చిన నయన్ నటిగా తనను తాను ఆవిష్కరించుకున్న తీరు అసమానం. నయనతార కు ఉన్న గొప్ప ప్రజాదరణ , ఫాలోయింగ్ దృష్ట్యా బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల నుంచి భారీగా ఆర్జిస్తోంది. శాటిలైట్ డిష్ కనెక్షన్ ప్రకటనలో కేవలం 50 సెకన్ల పాటు కనిపించడానికి నయన్ ఏకంగా రూ. 5 కోట్లు వసూలు చేసింది. నయన్ ఒక్కో చిత్రానికి రూ. 10 కోట్లు వసూలు చేస్తుంది. నయన్ నికర ఆస్తి విలువ దాదాపు రూ. 200 కోట్లు. సుమారు రూ. 50 కోట్ల విలువైన ప్రైవేట్ జెట్ తన సొంతం. భర్త విఘ్నేష్ తో కలిసి ఇంతకుముందు ఈ ప్రయివేట్ జెట్ లో విహారయాత్రలను ఆస్వాధించింది. ఆకస్మిక ప్రయాణాలకు దీనిని ఉపయోగిస్తుంది. చెన్నైలోని పోయెస్ గార్డెన్ పరిసరాల్లో నయన్ సొంత విలాసాల ఇల్లు కొలువు దీరి ఉంది. 2021లో ఈ విశాలమైన నాలుగు బెడ్‌రూమ్‌ల అపార్ట్‌మెంట్‌లో చేరారు. వారికి సమీపంలో రజనీకాంత్ ,మాజీ పెప్సీ సీఈవో ఇంద్రా నూయి వంటి ప్రముఖుల ఇండ్లు ఉన్నాయి. నయన్ ఇల్లు 16,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. కేవలం బాత్రూమ్ 1,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. కొన్ని మినీ అపార్ట్‌మెంట్‌ల కంటే పెద్ద బాత్రూమ్‌ని అభిరుచి మేరకు డిజైన్ చేయించుకుంది నయన్. హోమ్ థియేటర్, ప్రైవేట్ జిమ్, స్విమ్మింగ్ పూల్, ఫ్లోర్-టు-సీలింగ్ గ్లాస్ ప్యానెల్‌లు ఈ ఇంటిలో ప్రత్యేక ఆకర్షణ. ఇవి లష్ గార్డెన్ వ్యూతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. నయనతార విలాసవంతంగా జీవించడమే కాదు.. వ్యాపారాల్లో తెలివైన పెట్టుబడులు పెడుతున్నారు. రూ. 200 కోట్ల నికర ఆస్తులు కలిగి ఉన్న నయన్ రెవెన్యూలో సగానికి పైగా రియల్ ఎస్టేట్ పెట్టుబడుల నుంచి వచ్చింది. చెన్నై, హైదరాబాద్, దుబాయ్ లాంటి చోట్ల తనకు ఆస్తులు ఉన్నాయి. మ్యాజిక్‌బ్రిక్స్ వివరాల ప్రకారం..నయన్ రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియో రూ.100 కోట్లకు పైగా ఉంది. దక్షిణ భారత సినీపరిశ్రమలో అత్యంత తెలివైన పెట్టుబడి దారుగా నయన్ తనను తాను ఆవిష్కరించుకుంది. నటుడి వ్యాఖ్యలు నయన్ తన తల్లిదండ్రులకు ఒక పోష్ ఫ్లాట్‌ను బహుమతిగా ఇచ్చి, తన వివాహానికి ముందే తెలివిగా రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. నయనతార కార్ల గ్యారేజీలో ఫోర్డ్ ఎండీవర్, టయోటా ఇన్నోవా క్రిస్టా కూడా ఉన్నాయి. నయన్ కు సొంత ప్రైవేట్ జెట్ ఉంది. రూ. 50 కోట్ల విలువైన ఈ విమానం నగరాల మధ్య వేగంగా ప్రయాణించడానికి, సెట్స్ కి వెళ్లేందుకు, కొన్నిసార్లు, విఘ్నేష్ - పిల్లలతో విదేశీ వెకేషన్లకు వెళ్లేందుకు దీనిని ఉపయోగిస్తుంది. భారతదేశంలో సొంత జెట్ కలిగి ఉన్న స్టార్లుగా రామ్ చరణ్, అల్లు అర్జున్, ప్రియాంక చోప్రా, శిల్పా శెట్టి వంటి ప్రముఖులు ఉన్నారు. వారి సరసనా నయన్ పేరు చేరింది. 2021లో చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ రెనిటా రాజన్‌తో కలిసి నయన్ స్వయంగా ది లిప్ బామ్ కంపెనీని స్థాపించింది. 100 కంటే ఎక్కువ వేరియంట్‌లను కలిగి ఉన్న ఈ బ్రాండ్ భారతదేశ చర్మ సంరక్షణ రంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. నయన్ చమురు పరిశ్రమలో పెట్టుబడి పెట్టింది. ఈ కంపెనీ విలువ దాదాపు రూ. 100 కోట్లకు చేరుకుందని తెలుస్తోంది. అలాగే చెన్నైలోని ఒక పాపులర్ స్నాక్-అండ్-టీ చైన్ లో వాటాను సంపాదించింది.

# సమంత సెకండ్ హ్యాండ్ కామెంట్స్..

## చాలా బాధపడిందన్న డిజైనర్



ఇండస్ట్రీలో ఎక్కువ ఏ హీరోయిన్ ను ట్రోల్ చేశారు అంటే టక్కున సమంత పేరు చెప్పుకొ స్తారు. ఆమెను ట్రోల్ చేసినంతగా ఇంకెవరిని ట్రోల్ చేయలేదని చెప్పొచ్చు. స్టార్ హీరోయిన్ గా ఇండస్ట్రీలో కొనసాగుతున్న సమయంలోనే అక్కినేని నాగ చైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇక అక్కినేని ఇంటి కోడలిగా అడుగుపెట్టిన సామ్.. అందుకు తగ్గట్టుగానే గౌరవాన్ని అందుకుంది. ఎక్కడికి వెళ్లినా ఆమె కూడా ఆ మర్యాదను దక్కించుకుంది. పెళ్లి తరువాత గ్లామర్ రోల్స్ తగ్గించింది. లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ అభిమానుల ప్రేమను చూరగొంది.నాగ చైతన్యతో ఇప్పటికీ కలిసి ఉంటే అమ్మడికి ఇవన్నీ అలాగే ఉండేవేమో. కానీ, నాలుగేళ్లు కూడా కలిసి ఉండలేక ఇద్దరు విడాకులు తీసుకొని విడిపోయారు. అక్కడ నుంచి మొదలైంది ఆమెపై ట్రోలింగ్. నోటికి ఎంత మాట వస్తే అంత మాట సామ్ ను అనేయడం మొదలుపెట్టారు. సామ్ కావాలనే విడాకులు ఇచ్చిందని, వేరొకరితో ఎఫైర్ ఉందని, స్టైలిస్ట్ జువాల్కర్ వలనే వీరు విడిపోయారని, ది ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ వలన విడిపోయారని ఇలా రకరకాలుగా విమర్శలు గుప్పించారు. అంతేనా చివరికి సామ్ ను సెకండ్ హ్యాండ్ అని కూడా అనేశారు. అక్కినేని ఇంటి నుంచి బయటకు వచ్చేసిన సమంతను ఇంకెవరు పెళ్లి చేసుకుంటారు. సెకండ్ హ్యాండ్ అయ్యిపోయిం దని నీచంగా మాట్లాడారు.ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎంత నీచంగా తిట్టినా సామ్ తొణకలేదు.. బెణకలేదు. ఎంతో స్ట్రాంగ్ గా నిలబడింది. మయోసైటిస్ వ్యాధిబారిన పడినప్పుడు కూడా అదంతా నాటకమని, సింపతీ కోసమని చెప్పుకొచ్చారు. అయినా పడినచోటనే లేచి నిలబడింది.

# లెజెండరీ నటి పాత్రకు కియారా న్యాయం చేయగలదా?



బాలీవుడ్ ట్రాజెడీ క్వీన్ మీనా కుమారి వృత్తి, వ్యక్తిగత జీవితం తెరిచిన పుస్తకం లాంటింది. నటిగా ఎన్నో క్లాసిక్ హిట్స్ తో తనకంటూ బాలీవుడ్ చరిత్రలో కొన్ని పేజీలు రాసిపెట్టింది. 'సాహిబ్ బివి ఔర్ గులాం', 'దిల్ ఏక్ మందిర్', 'ఫూల్ ఔర్ పత్తర్', 'పకీజా' లాంటి చిత్రాలో అప్పట్లో మీనా కుమారి ఓ సంచలనం. సినిమాలు చేస్తున్నంత కాలం మీనా కుమారి బాలీవుడ్ లో ఓ మెరుపు. అలాగే ఆమె వ్యక్తిగత జీవితం ఎంతో విషాధకరమైంది. ప్రేమ, నిరాశ, మద్యపానం అనే అంశాలు మీనా కుమారి జీవితాన్ని చిన్నాభిన్నం చేసాయి. వృత్తి గత జీవితంలో ఎంత గొప్ప సక్సెస్ సాధించిందో వ్యక్తిగత జీవితంలో అంతకంతకు కోల్పోయింది. తెరపై ప్రతి పాత్రలోనూ తన ఆత్మను, మనసును అంకితం చేసింది మీనా కుమారి. కానీ జీవితాంతం ప్రేమ కోసమే పోరాడింది. తనకంటే 37 సంవత్సరాలు పెద్దవాడైన చిత్రనిర్మాత కమల్ అమ్రోహిని వివాహం చేసుకుంది. కానీ అప్పటికే అతడికి పెళ్లైపోయింది. ఈ పెళ్లితో ఆమె జీవితాన్నే కోల్పోయింది. జీవితంలో దుఃఖం, వేదన తప్ప మరేమి దక్కలేదు. పకీజా సినిమాకు దర్శకత్వం వహిం చింది కమల్ ఆమ్రోహీ. పకీజా రిలీజ్ కు 15 ఏళ్లు పట్టడానికి కారణం కూడా వారిమధ్య సంబధం దెబ్బతి నమేనని నివేదికలు చెబుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఇద్దరు విడాకులతో వేరయ్యారు. అటుపై మద్యానికి బానిసై ఆరోగ్యం క్షిణించి సినిమా విడుదలైన రెండు నెలలకు 37 ఏళ్ల వయసులోనూ కన్ను మూసింది. నటిగా 90 చిత్రాలకు పైగా చేసింది. కమల్ ఆమ్రోహీ కుటుంబం ఇప్పుడామె బయోపిక్ తో ఘనమైన నివాళి అర్పించాలని చూస్తోంది. ఇప్పటికే మీనా కుమారి పాత్రకోసం కియారా అద్వానిని ఎంపిక చేసినట్లు వార్త లొస్తున్నాయి. మీనా పాత్రకు కియారా అన్ని రకాలుగా సరిపోతుంది అన్న భావన వ్యక్తమవుతోంది. మరి ఆమె ఎంట్రీ వాస్తవం ఎంతో తెలియాలి. ఈ బయోపిక్ లో నటిస్తే గనుక కియారా అద్వాణీ ఇమేజ్ మారి పోతుంది. నటిగా సరికొత్త ప్రయాణానికి ఆస్కారం ఉంటుంది. అయితే ఈ పాత్రకు కియారా సరిపోతుందా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఎంపిక కరెక్ట్ కాదనే వాదనా తె రపైకి వస్తోంది.

# బంతి మారిందోచ్



మార్చాలంటూ ఆఖరి రోజు తొలి సెషన్‌లో గిల్, సిరాజ్, రాహుల్, జడేజా, శార్దూల్ అంపైర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే గాగ్ టెస్టులో బాగానే ఉండడంతో దాంతోనే ఆటను కొనసాగించారు. పదేపదే ఇదే విషయం అడుగుతుండడంతో అటు ప్రేక్షకులు సైతం భారత ఆటగాళ్లను గేలి చేశారు. ఎట్టకేలకు 27వ ఓవర్ ముగిశాక బంతి గాగ్ టెస్టులో విఫలం కావడంతో భారత్ కోరిక తీరింది. దీంతో కీపర్ పంత్ సంతోషంతో గట్టిగా 'ఎస్..' అని అరవగా.. తర్వాతి ఓవర్ వేసేందుకు వచ్చిన జడేజా పిడికిలి బిగించి అంపైర్ దగ్గరకు వెళ్లి మరీ సంబరాలు చేసుకోవడం కనిపించింది. దీన్ని అంపైర్ గఫానే కూడా సరదాగా తీసుకున్నాడు.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ బంతి ఆకారంపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో బంతిని మార్చాలంటూ ఆఖరి రోజు తొలి సెషన్‌లో గిల్...

బంతి మారిందోచ్

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ బంతి ఆకారంపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో బంతిని

# ఒలింపిక్ స్వర్ణానికి రూ 6 కోట్లు



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ కొత్త క్రీడా పాలసీలో నగదు ప్రోత్సాహకాలను భారీగా పెంచారు. గతంలో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తే ఇచ్చే రూ.2 కోట్లను తాజా పాలసీలో రూ.6 కోట్లకు, ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలిస్తే ఇచ్చే రూ.30 లక్షలను రూ.3 కోట్లకు గణనీయంగా పెంచారు. ఇకపై ఒలింపిక్స్‌లో రజతానికి రూ.4 కోట్లు, కాంస్యానికి రూ.2 కోట్లు, ఆసియా క్రీడల్లో రజతానికి రూ. కోటిన్నర, కాంస్యానికి రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. కామన్వెల్త్ క్రీడలకు గతంలో స్వర్ణానికి రూ.25 లక్షలు ఉండగా, తాజాగా రూ. కోటిన్నరకు పెంచారు. రజతానికి రూ.75 లక్షలు, కాంస్యానికి రూ.50 లక్షలు అందిస్తారు. సాధారణ క్రీడాకారులతో సమానంగా ఎలాంటి వ్యత్యాసం లేకుండా పారా అథ్లెట్లకు కూడా ఇవే నగదు బహుమతులను అందించనున్నామని శాట్ చైర్మన్ శివసేనారెడ్డి చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్న క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆర్థిక, శిక్షణ పరంగా సహాయం అందించేందుకు కాంపిటేటివ్ అండ్ హైపెర్ఫామెన్స్ స్పోర్ట్స్ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నవక్రీడ

# గోల్డెన్ స్పైక్ విజేత చోప్రా




డైమండ్ లీగ్ నెగ్గిన జోరుమీదున్న వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా వరుసగా రెండో టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. మంగళవారం జరిగిన...

ఓస్ట్రావా (చెక్ రిపబ్లిక్): డైమండ్ లీగ్ నెగ్గిన జోరుమీదున్న వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా వరుసగా రెండో టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. మంగళవారం జరిగిన ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ ఈవెంట్‌లో జావెలిన్‌ను మూడో త్రోలో 85.29 మీటర్ల దూరం విసిరిన నీరజ్ అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టైటిల్ నెగ్గడం చోప్రాకిదే తొలిసారి. మొత్తం 9 మంది టాప్ అథ్లెట్లు పోటీపడ్డ ఈ మెగా ఈవెంట్‌లో దక్షిణాఫ్రికా త్రోయర్ డౌ స్మిత్ (84.12 మీ.) రెండో స్థానంలో, గ్రెనడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (83.63 మీ.) మూడో స్థానంలో నిలిచారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**